www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు
నేడు అంకురార్పణ
నేటి నుంచి
శరన్నవరాత్రి ఉత్సవాలు
ముస్తాబైన దుర్గమ్మ ఆలయం
శ్రీశైలంలోనూ ఏర్పాట్లు పూర్తి

విద్యుద్దీపాలంకరణతో వెలుగులీనుతున్న తిరుమల శ్రీవారి ఆలయం 3

గురువారం | 3-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 169 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి రా. 2.58 తదుపరి విదియ; నక్షత్రం: హస్త మ 3.32 తదుపరి చిత్త; వర్జ్యం: రా. 12.34-2.22; దుర్ముహూర్తం: ఉ. 10.05-10.52, మ. 2.49-3.36; అమృతఘడియలు: ఉ. 8.44-10.33; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.58 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గనుల ఘనుడు బేర్!



బలైపోయానని వాపోతున్న గనుల వెంకటరెడ్డి

బకరా.. బాగా విన్న పదం!
బలిపశువు.. బకరాకంటే ఎక్కువ స్థాయి!
పోలార్ బేర్.. అంటే, ధ్రువపు ఎలుగుబంటి!
బకరా, బలి పశువుకు మించిన 'బడా' బాధితుడన్న మాట! ఇది ఎవరో చెప్పిన మాట కాదు! ఏసీబీ అరెస్టు చేసిన గనుల ఘనుడు వెంకట రెడ్డి ఇప్పుడు ఇలా వాపోతున్నారట! వైసీపీ పెద్దలు తనను 'పోలార్ బేర్'లా మార్చేశారని, ఎరవేసి వాడుకున్నారని ఆక్రోశిస్తున్నారట!

డిప్యుటేషన్‌పై వచ్చి 'పోలార్ బేర్'లా ఇరుక్కుపోయా
రూ.850 కోట్ల ఎన్‌వోసీ ఇచ్చే స్థాయి నాకుందా?
సూత్రధారులు వేరే అని పరోక్షంగా వెల్లడి
నేటి నుంచి 3 రోజులపాటు ఏసీబీ కస్టడీకి
చేతులు మారిన సొమ్ములో ఎవరి వాటా ఎంత?
ఎవరి ఆదేశాల మేరకు ఇసుక ఒప్పందం జరిగింది?
ఎవరు చెప్పారని ఎన్‌వోసీ ఇచ్చారు?
కీలక ప్రశ్నలతో ఏసీబీ సిద్ధం

ధ్రువపు ఎలుగుబంటికి రక్తమంటే ఇష్టం! ఎస్కిమోలకు ధ్రువపు ఎలుగు అంటే ఇష్టం! 350 నుంచి 400 కిలోల టన్నులు ఉండే ఆ భారీ జీవిని వేటాడటం అంత సులభం కాదు. అందుకే... వేటగాళ్లు రక్తం పూసిన పదునైన కత్తులను వెళ్లే దారిలో ఏర్పాటు చేస్తారట! ఎలుగుబంట్లు రక్తం కోసం కత్తిని నాకుతాయి. దాని నాలుక తెగి దాని నెత్తురు ధార కడుతుంది. తన నెత్తురును తానే జుర్రుకుంటూ... చివరికి సొమ్మసిల్లి పడిపోతుంది. అప్పుడు... ఎస్కిమోలు సులువుగా దానిని సంహరిస్తారు. తనను కూడా అచ్చం ఇలాగే బలి చేశారని వెంకటరెడ్డి ఇప్పుడు ఆక్రోశిస్తున్నట్లు సమాచారం! వెరసి... వైసీపీ పెద్దల చేతిలో తాను బలైపోయానని, మొత్తం వ్యవహారంలో పాత్రధారిని మాత్రమేనని, సూత్రధారులు వేరే ఉన్నారని చెప్పినట్లు తెలిసింది. 'పైవాళ్లు' చెప్పకుండానే రూ.850 కోట్లకు ఎన్‌వోసీ ఇచ్చే స్థాయి తనకుందా అని ప్రశ్నించినట్లు సమాచారం!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
"నేను కోస్ట్‌గార్డ్ అధికారిని. సొంత శాఖలో నాకు చాలా మంచి పేరుంది. కానీ, జగన్ ప్రభుత్వంలోకి వచ్చి పోలార్ బేర్‌లా బలైపోయాను" అని 'గనుల' వెంకటరెడ్డి కొందరు అధికారుల ముందు వాపోయారు. జగన్ హయాంలో జరిగిన అతి భారీ కుంభకోణాల్లో ఒకటైన ఇసుక స్కామ్‌లో ఇరుక్కుపోయానని... దానికి కర్త, కర్మ మాత్రం తాను కాదని ఆయన మొత్తుకుంటున్నారు. గనుల వెంకట రెడ్డిని గత నెల 26న హైదరాబాద్ శివారులోని ఒక రిసార్ట్‌లో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అదే రాత్రి విజయవాడకు తీసుకొచ్చారు. 'ఏమిటి సార్ మీ పరిస్థితి ఇలా మారింది' అంటూ ఏసీబీ అధికారులు ఆయనపట్ల సానుభూతి ప్రదర్శించారు. దీంతో వెంకటరెడ్డి

మిగతా 12వ పేజీలో...

పోలవరం రెండేళ్లలో పూర్తి
పీపీపీలో బందరు పోర్టు
2025 డిసెంబరు నాటికి అందుబాటులోకి..
జనవరి ఒకటి నుంచి పీ-4 పథకం అమలు
దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం
బందరులో బాబు పర్యటన
పోర్టు పనుల పరిశీలన
మెడికల్ కళాశాలకు పింగళి వెంకయ్య పేరు



మచిలీపట్నంలో 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమంలో విద్యార్థినులతో కలిసి చెత్త ఊడుస్తున్న సీఎం చంద్రబాబు

చెత్త పన్ను రద్దు

ఐదేళ్లూ చెత్త తీయకుండానే పన్నేశారు: సీఎం

మచిలీపట్నం, అక్టోబరు 2: చెత్తపన్నును రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో స్వచ్ఛతే సేవ, మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. గాంధీజీ, శాస్త్రి ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ మంచి చేశారు కాబట్టి నేటికీ ఆయన్ను మననం చేసుకుంటున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. స్వచ్ఛత, పరిసరాల శుభ్రతపై అప్పట్లోనే ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు మహాత్మాగాంధీ కృషి చేశారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందన్నారు. దాన్ని శుభ్రం చేయాలంటే రెండేళ్లు పడుతుందని తెలిపారు. "గత ప్రభుత్వం చెత్తను ఎత్తకుండానే చెత్తపన్ను వేసింది. ఎవరైనా ప్రశ్నిస్తే చెత్తను తీసుకొచ్చి షాపుల ముందు పడేశారు. చెత్తపన్నును రద్దుచేస్తూ కేబినెట్‌లో తీర్మానం చేస్తాం. చెత్త ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేసే యూనిట్లను గతంలో టీడీపీ ప్రభుత్వంలోనే ప్రారంభించాం. ఇప్పుడు అవి కేవలం గుంటూరు, విశాఖపట్నంలో మాత్రమే ఈ ఫ్యాక్టరీలు పనిచేస్తున్నాయి. మిగిలిన అన్నిచోట్లా గత ఐదేళ్లలో నిలిపివేశారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. 2029నాటికి స్వచ్ఛ ఏపీ సాధించే సంకల్పంతో

మిగతా 11వ పేజీలో...



అతిథి గృహంలో చిన్న కుమార్తెతో డిక్లరేషన్‌పై సంతకం చేయిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్

పవన్ దీక్ష విరమణ

తిరుమల శ్రీవారిని దర్శించుకుని
11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష ముగింపు
స్వామి పాదాల చెంత వారాహి డిక్లరేషన్
జనసేనాని వెంట ఇద్దరు కుమార్తెలు
చిన్నకుమార్తెతో డిక్లరేషన్‌పై సంతకం
మైనర్ కావడంతో తండ్రిగా ఆయన కూడా

నేడు తిరుపతిలో పవన్ సభ

తిరుమల/తిరుపతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల శ్రీవారిని దర్శించుకుని ప్రాయశ్చిత్త దీక్షను విరమించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం నేపథ్యంలో 11 రోజులపాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఆయన మంగళవారం సాయంత్రం అలిపిరి నడకమార్గంలో తిరుమల చేరుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుమార్తెలు ఆద్య, పొలెనా అంజనతో కలిసి మహాద్వారం గుండా ఆలయంలోకి వెళ్లారు. వైకుంఠం క్యూలైన్ ద్వారా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి వచ్చే వరకు రంగనాయక మండపం వద్ద ఆయన వేచి ఉన్నారు. ఆ తర్వాత వారితో కలిసి ధ్వజస్తంభానికి మొక్కుకుని బంగారువాకిలికి చేరుకున్నారు. తనతో పాటు తీసుకువచ్చిన

మిగతా 11వ పేజీలో...

బైజూస్ ట్యాబ్.. కోట్లు గాయబ్

రూ.1,306 కోట్లు వృథా చేసిన జగన్
ఆ కంటెంట్ పేరుతో నాడు రెండేళ్లు కొనుగోలు

8వ తరగతి విద్యార్థులతో పాటు టీచర్లకూ
చివరికి ఆ కంటెంట్‌తో ఫలితం శూన్యం
ఇప్పుడు ఏకంగా బోర్డు తిప్పేసిన కంపెనీ
మనీ లాండరింగ్ వివాదంలో బైజూస్
ట్యాబ్‌లు ఎందుకిచ్చారో అర్థంకాని దుస్థితి
బడులకు తేవటమూ మరిచిన పిల్లలు



2

ఆర్ అండ్ బీలో.. సర్వం సారే!

3

మంత్రికి తెలియకుండానే ముఖ్య కార్యదర్శి మంత్రాంగం
రూ. 290 కోట్ల రోడ్ల మరమ్మతు పనులకు అనుమతులు
ఈఎన్‌సీతో కలిసి కీలక నిర్ణయం.. మంత్రికి కనీసం ఫైలు కూడా పెట్టని వైనం
ఆరా తీసిన ముఖ్యమంత్రి కార్యాలయం.. ముఖ్య కార్యదర్శిపై చర్యలకు సిద్ధం
వివరణ కోరుతూ ఈఎన్‌సీకి మంత్రి మెమో

పశ్చిమాసియా ఉద్రిక్తతలు..
భారత్‌పై తీవ్ర ప్రభావం!

చమురు దిగుమతుల్లో 80% గల్ఫ్ నుంచే..
పశ్చిమాసియాతో సన్నిహిత వాణిజ్య సంబంధాలు
అక్కడ ఉద్యోగాల్లో 90 లక్షల మంది భారతీయులు
దేశానికి భారీ ఎత్తున విదేశీ మారక ద్రవ్యం

న్యూఢిల్లీ, అక్టోబరు 2: ఇరాన్ నుంచి క్షిపణులు ఇజ్రాయెల్ పైకి దూసుకెళ్తున్నాయి.. ఇజ్రాయెల్ దళాలు లెబనాన్‌లో దాడులు జరుపుతున్నాయి.. భారత్‌కు కొన్ని వేల కి.మీ.ల దూరంలో ఈ పరిణామాలు జరుగుతున్నా.. మన మీద ఇవి తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయి. పశ్చిమాసియాతో భారత్‌కు సన్నిహిత సంబంధాలు ఉండటమే దీనికి కారణం. చమురు దిగుమతులు, పలు రకాల ఉత్పత్తుల

మిగతా 2వ పేజీలో...



ఇజ్రాయెల్ వైమానిక దాడులతో లెబనాన్‌లోని బీరుట్‌లో జరిగిన విధ్వంసం

వచ్చిన క్షిపణిని వచ్చినట్టే..

ఇరాన్ దాడిని సమర్థంగా అడ్డుకున్న ఇజ్రాయెల్
కొన్ని ఆఫీసులు, నిర్వహణ ప్రదేశాల ధ్వంసం
మినహా పెద్ద స్థాయి నష్టమేదీ జరగలేదని వెల్లడి

ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతున్న ఇజ్రాయెల్

ఇరాక్ గగనతలంలో ఇజ్రాయెల్ జెట్లు.. ఖతార్‌కు ఇరాన్ అధ్యక్షుడు
ఇజ్రాయెల్‌కు దన్నుగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్.. ఇరాన్ క్షిపణుల అడ్డగింత
హెచ్చరికల్లేకుండా మహిళలు, పిల్లల్ని ముక్కుమ్మడిగా చంపేస్తున్నారు: లెబనాన్
ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన.. మూడో ప్రపంచయుద్ధం అంచున ఉన్నాం: ట్రంప్

2



11

నేను సీఎం సీట్లో ఉంటేనే ప్రజలకు మేలు!

రాష్ట్రంలో పాలన కుప్పకూలింది
వ్యవసాయం, చదువులు, వైద్యం తిరోగమనంలోకి
4 నెలల్లోనే ప్రభుత్వ వ్యతిరేకత తారస్థాయికి: జగన్
అనుబంధ సంఘాల నేతలతో భేటీ
నేడు మళ్లీ బెంగళూరు ప్యాలెస్‌కు



ప్రవీణ్ ప్రకాశ్



శేషగిరిబాబు

ప్రవీణ్ ప్రకాశ్, శేషగిరికి జైలు

కోర్టు ధిక్కార వ్యాజ్యంలో హైకోర్టు తీర్పు
నెల రోజుల జైలు, 2 వేల జరిమానా
కోర్టు ఉత్తర్వులకు వక్రభాష్యం చెప్పాలని, సరైన స్ఫూర్తితో అమలుచేయాలని హితవు
అప్పీల్ దాఖలుకు వీలుగా తీర్పు అమలు నాలుగు వారాలు నిలుపుదల

12

నేటి నుంచి టెట్

రోజూ రెండు సెషన్లలో నిర్వహణ 3
4,27,300 మంది అభ్యర్థులు.. 108 కేంద్రాలు

ఢిల్లీలో భారీగా డ్రగ్స్ పట్టివేత

2

రూ. 2 వేల కోట్ల విలువ చేసే 560 కిలోల కొకైన్ సీజ్.. నలుగురు అరెస్టు

ఓవైపు బారులుదీరిన కొండలు.. మరోవైపు ఆహ్లాదాన్ని పంచే ఆకుపచ్చని పంట పొలాలు. కాలుష్యానికి దూరంగా ఊరంతా పరుచుకున్న స్వచ్ఛమైన గాలి! ఊరంటే ఇలా ఉండాలి అనిపించేలా ఉంటాయి ఆ గ్రామాలు! ఇదంతా నాణేనికి ఓ వైపు మాత్రమే. ఆ ఊర్లలో కుటుంబాలను కదిలిస్తే గుండెను తడిపేసే కథలు వినిపిస్తాయి. మరో 'ఉద్దానం' వ్యథలను తలపిస్తాయి. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుమల్లంక గ్రామంలో ప్రతి ఇంటిలో ఓ కిడ్నీ వ్యాధిగ్రస్థుడు ఉన్నాడు. ఎ.కొండూరు మండలంలోని పలు గ్రామాలు, తండాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. కిడ్నీ బాధితుల కష్టాలను తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో పర్యటించినప్పుడు ఈ వాస్తవాలు వెలుగు చూశాయి.

ఇది మరో ఉద్దానం!

ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో వేలల్లో కిడ్నీవ్యాధి కేసులు



ఆంధ్రజ్యోతి విజిట్

ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెం మండలం అనుమల్లంక గ్రామం

నీరు కాదు.. విషం తాగుతున్న బాధితులు
భూగర్భ జలాల్లో మెటాలిక్ ఎలిమెంట్సే కారణం
ఏడేళ్ల క్రితం తొలి కిడ్నీ కేసు వెలుగులోకి..
20 వేల మంది బాధితులు.. వెయ్యి మంది మృతి
డయాలసిస్ స్టేజీలో 700 మంది
జనాభాలో ప్రతి 15 మందిలో ఒకరికి వ్యాధి
చాలా కుటుంబాల్లో అందరికీ వ్యాధి
కొందరు చనిపోగా, చావుతో మరికొందరి పోరు
గత మూడు నెలల్లో 10 మంది మృత్యువాత
వైసీపీ నిర్వాకంతో జల్ జీవన్‌కు దూరం
పింఛను రూల్స్ కఠినతరంతో మరిన్ని కష్టాలు
'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెలుగులోకి..

(ఆంధ్రజ్యోతి - గంపలగూడెం, ఎ.కొండూరు)
ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని ఎ.కొండూరు, గంపలగూడెం మండలాలు మరో ఉద్దానాన్ని తలపిస్తున్నాయి. ఈ మండలాల్లో సుమారు 20వేల మంది కిడ్నీ బాధితులు ఉన్నారు. రెండు మండలాల జనాభా 1.30 లక్షల మంది కాగా, ప్రతి 15 మందిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. గంపలగూడెం మండలంలోని అనుమల్లంక గ్రామం, వినగడప తండా; ఎ.కొండూరు మండలంలోని దీప్లానగర్ తండా, పెద్ద తండా తదితర 15 తండాలు, లక్ష్మీపురం, కోమటికుంట గ్రామాలు కిడ్నీ



ఎ.కొండూరులో ఓ బాధితుడికి డయాలసిస్ చేస్తున్న దృశ్యం

మిగతా 12వ పేజీలో..

పిల్లల ట్యాబ్.. రూ.కోట్లు గాయబ్

» రూ. 1,306 కోట్లు వృథా చేసిన జగన్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బైజూస్ కంటెంట్ పేరుతో నాటి వైసీపీ ప్రభుత్వం రూ.1,306 కోట్లు వృథా చేసింది. రెండేళ్లపాటు ఆనాడు విద్యార్థులు, టీచర్లకు ఇచ్చిన 9,52,925 ట్యాబ్‌లు ఎక్కడున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇన్ని లక్షల ట్యాబ్‌లు నాడు పంపిణీ చేయగా, ఇటీవల పదో తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈపై అంచనా పరీక్ష కోసం 77వేల ట్యాబ్‌లు ఏర్పాటుచేయడానికి నానా తంటాలు పడ్డారు. అంటే వాటి పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా బైజూస్ ట్యాబ్‌లను విద్యార్థులు ఎక్కడా వినియోగించడం లేదు. గత ప్రభుత్వంలోనే వాటిని వాడటం విద్యార్థులు మానేశారు. మరోవైపు కంటెంట్ ఇచ్చిన బైజూస్ సంస్థ ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. ఆ సంస్థ యజమాని బైజూ రవీంద్రన్ మనీలాండరింగ్ కేసులో ఇరుక్కుని కంపెనీ దాదాపుగా బోర్డు తిప్పేసే పరిస్థితికి చేరింది. విజయవాడలో ఉన్న బైజూస్ ఆఫీసుకు బోర్డు తప్ప ఇంకేం మిగల్లేదు. దీంతో ఇప్పుడు రూ.1,306 కోట్లతో కొనుగోలు చేసిన ట్యాబ్‌లను ఏంచేయాలో అర్థంకావట్లేదు. ఈ ఏడాది విద్యార్థులకు కొత్తగా ట్యాబ్‌లు ఇవ్వరు. గతంలో ఇచ్చిన ట్యాబ్‌లు ఏంచేయాలో తెలియదు. మొత్తంగా బైజూస్ ట్యాబ్‌లకు పెట్టిన వందల కోట్ల పరిస్థితి బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారింది.

ఎలా వచ్చాయి ట్యాబ్‌లు?

వాస్తవానికి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వాలనే ఆలోచన జగన్ ప్రభుత్వానికి లేదు. జగన్ ఆవేశంగా చేసిన ఓ ప్రకటన నుంచి ఈ ట్యాబ్‌లు పుట్టుకొచ్చాయి. మొదట 9 నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇస్తామని జగన్ ప్రకటించారు. దానిపై కసరత్తు చేసిన ప్రభుత్వం చివరికి ల్యాప్‌టాప్‌లు ఇవ్వలేం అని తేల్చేసింది. మార్కెట్‌లో రూ.40వేలకు పైగా ఉన్న ల్యాప్‌టాప్‌ను రూ.15వేలకు ఇవ్వాలని ప్రభుత్వం అడిగింది. కనీసం రూ.25వేలు లేకుండా ఇవ్వలేమని కంపెనీలు స్పష్టంచేశాయి. దీంతో ఇక అవి కొనడం సాధ్యం కాదని నిర్ణయానికి వచ్చాక మాట తప్పిన విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు ట్యాబ్‌లను తెరపైకి తెచ్చారు. ఏటా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తామని, రెండేళ్లు ఇచ్చారు. 2022లో మొదటిసారి జగన్ పుట్టిన రోజైన డిసెంబరు 21న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆ సంవత్సరంలో 4,59,564 మంది విద్యార్థులు, వారికి బోధించే 59,176 మంది టీచర్లకు ట్యాబ్‌లు ఇచ్చారు. ఒక్కో ట్యాబ్‌కు రూ.12,800 వెచ్చించారు. మొత్తంగా రూ.686 కోట్లు ఖర్చు చేశారు. 2023లో 4,34,185 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చారు. ఒక్కో ట్యాబ్‌ను రూ.14,279తో కొనుగోలు చేశారు. మొత్తంగా రెండేళ్లలో రూ.1,306 కోట్లు ఖర్చు చేశారు.

వారి యూజర్లు.. వీరికి కమీషన్లు

2022లో ట్యాబ్‌లు ఇచ్చేముందు బైజూస్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. కొవిడ్ సమయంలో పాపులర్ అయిన బైజూస్ కంపెనీ తమ కంటెంట్ ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చింది. అప్పట్లో రాష్ట్రంలో 40లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. ట్యాబ్‌లు ఇచ్చిన విద్యార్థులతో పాటు మిగిలిన విద్యార్థులకు కూడా కంటెంట్ ఇచ్చినట్లు చూపించి యూజర్ల సంఖ్యను భారీగా చూపించుకునే ప్రయత్నం బైజూస్ చేసింది. దీన్ని అదనుగా తీసుకున్న ప్రభుత్వ పెద్దలు కమీషన్లతో ట్యాబ్‌లు కొనుగోలు చేశారు. లక్షల సంఖ్యలో ట్యాబ్‌లు కొనుగోలు చేస్తున్నప్పుడు తక్కువ ధరకు వస్తాయి. కానీ కమీషన్లు ఇచ్చే వారి నుంచి బహిరంగ మార్కెట్ ధరకే ట్యాబ్‌లు కొనుగోలు చేశారు. మొదట నిధులు ఎప్పుడు ఇస్తారనేది చెప్పకుండా, కాంట్రాక్టరును ఎంపిక చేశాక ముందుగానే నిధులు ఇస్తామని నిబంధనలు మార్చేసింది. ముందే నిధులు ఇస్తామంటే రూ.10వేలకే తాము ట్యాబ్‌లు ఇస్తామని కొన్ని కంపెనీలు ముందుకొచ్చినా వాటిని పట్టించుకోకుండా, ఎక్కువ ధరకే కొనుగోలు చేసింది.

యూట్యూబ్ వీడియోలకు ట్యాబ్‌లు

అన్ని వందల కోట్లు ఖర్చు చేసి జగన్ ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లు చివరికి పిల్లలు యూట్యూబ్‌లో వీడియోలు చూసుకోవడానికి, వీడియో గేమ్‌లు ఆడుకోవడానికి పనికొస్తున్నాయి. ఇంకా కొంత మంది అయితే అసలు అవి ఎక్కడున్నాయో కూడా మర్చిపోయారు. కేవలం కొవిడ్ కాలంలో లాక్‌డౌన్ కారణంగా బడులు మూసేసిన సమయంలో బైజూస్ లాంటి ఈ-కంటెంట్‌ను విద్యార్థులు ఉపయోగించుకున్నారు. కానీ బడులు తెరుచుకున్న వెంటనే రూ. వేలు పెట్టి కంటెంట్ కొనుగోలు చేసినవారు కూడా దానిని పక్కన పడేశారు. అలాంటి పరిస్థితి ఉంటుందని తెలిసినా కొవిడ్ అనంతరం వందల కోట్లతో బైజూస్ కోసం ట్యాబ్‌లు కొనుగోలు ఎందుకు చేశారో అప్పటి సీఎం జగన్‌కే తెలియాలి.

ఢిల్లీలో రూ.2వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

న్యూఢిల్లీ, అక్టోబరు 2: దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.2,000 కోట్లు విలువ చేసే 560 కేజీల కొకైన్‌ను దక్షిణ ఢిల్లీ, మెహ్రౌలీలో సీజ్ చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. దీని వెనుక ఆఫ్ఘన్ జాతీయులు నడుపుతున్న అంతర్జాతీయ ముఠా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. సీజ్ చేసిన కొకైన్‌ను ఢిల్లీ, నేషనల్ కేపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్)లో పంపిణీ చేయడానికి సిద్ధం చేసినట్లు సమాచారం. రెండు నెలల క్రితం లభ్యమైన చిన్న క్లూ ఆధారంగా ప్రత్యేక జట్టు తీగ లాగుతూ వెళ్లింది. రెండు రోజుల క్రితం... శనివారం తిలక్‌నగర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు ఇద్దరు ఆఫ్ఘన్ జాతీయులను అరెస్టు చేశారు. అరెస్టయిన హష్మి మహమ్మద్ వారిస్, అబ్దుల్ నయీబ్ వారిస్ నుంచి పోలీసులు 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. విచారణ సందర్భంగా వారి నుంచి లభ్యమైన సమాచారం ఆధారంగానే భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 26 ఐఫోన్లు సీజ్ చేసిన కస్టమ్స్

స్థానిక అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు మంగళవారం ఓ మహిళ నుంచి 26 సరికొత్త ఐఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు బుధవారం ఓ ప్రకటన చేశారు. 'హాంకాంగ్ నుంచి వచ్చిన 30 ఏళ్ల పైబడిన మహిళను క్షుణ్ణంగా తనిఖీ చేశాం. టిష్యూ పేపర్‌లో చుట్టి, వానిటీ బ్యాగులో దాచిపెట్టిన ఐఫోన్ 16 మాక్స్ ప్రో ఫోన్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నాం. ఆమెను అరెస్టు చేయలేదు. ఇది కేవలం ఒక సంఘటనా? లేక అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాలను అక్రమ రవాణా చేసే ముఠా దీని వెనుక వుందా? అన్న దిశగా విచారణ కొనసాగుతోంది. సీజ్ చేసిన ఫోన్ల విలువ సుమారుగా రూ.30.66 లక్షలు ఉండొచ్చ'ని కస్టమ్స్ విభాగం తన ప్రకటనలో వివరించింది.

వారాణసీ ఆలయాల్లో సాయిబాబా విగ్రహాల తొలగింపు

వారాణసీ, అక్టోబరు 2: వారాణసీ నగరంలోని పలు ఆలయాల్లో ఉన్న సాయిబాబా విగ్రహాలను సనాతన్ రక్షక్ దళ్ కార్యకర్తలు మంగళవారం తొలగించారు. స్థానికంగా ఉన్న ప్రముఖ బడా గణేశ్, పురుషోత్తమ ఆలయాలతో సహా మొత్తం 14గుడుల్లోని సాయిబాబా విగ్రహాలను తొలగించినట్లు తెలుస్తోంది. హిందూ మత గ్రంథాల్లో సాయిబాబా ప్రస్తావన ఎక్కడా లేదని, ఆయన విగ్రహాలు ఆలయాల్లో ఉండకూడదని వారు కొంత కాలంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆలయాల్లో ఉన్న సాయిబాబా విగ్రహాలను తీసేయాలని ఆలయ నిర్వహణాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మహారాష్ట్రలోని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బాబా విగ్రహాల తొలగింపుపై అభ్యంతరం తెలిపారు.

ప్రశాంత్ కిశోర్ సొంత పార్టీ జన్ సురాజ్

పట్నా, అక్టోబరు 2: మాజీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బిహార్‌లో తన సొంత పార్టీ జన్ సురాజ్‌ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. దీంతో సుదీర్ఘకాలంగా సొంత పార్టీని ప్రారంభించాలన్న ఆయన లక్ష్యం నెరవేరింది. రానున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ అన్ని సీట్లకూ పోటీ చేయనున్నట్లు సమాచారం. అధికారంలోకి వస్తే మద్యనిషేధాన్ని పూర్తిగా ఎత్తివేస్తామని ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. ప్రస్తుతం బిహార్‌లో సాగుతోన్న కులం, ఎన్నికల తాయిలాల రాజకీయాన్ని మార్చి రాష్ట్రానికి ఉజ్వల భవిత కల్పించడమే తమ లక్ష్యమని ఆయన చెబుతున్నారు. జన్ సురాజ్ పార్టీ ప్రారంభ కార్యక్రమానికి మాజీ కేంద్రమంత్రి దేవేంద్ర ప్రసాద్ యాదవ్, పవన్ వర్మ, మాజీ ఎంపీ మోనజీర్ హసన్ వంటి వారు హాజరయ్యారు. మాజీ ఐఎఫ్ఎస్ అధికారి మనోజ్ భారతిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు.

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ పరిసరాల్లో బుధవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని నుంచి మయన్మార్ వరకూ ఉపరితల ద్రోణి కొనసాగుతుంది. వీటి ప్రభావంతో ఈనెల నాలుగో తేదీన ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఇది బలపడుతుందా?, లేదా?...అనే దానిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. కాగా ఉత్తరాదిలో అనేక ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమించాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో మహారాష్ట్ర, గుజరాత్‌లో అనేక ప్రాంతాల నుంచి రుతుపవనాలు నిష్క్రమిస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ రెడీ

నెతన్యాహు సీరియస్ వార్నింగ్.. ఇరాక్ గగనతలంలో ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు!

» ఇజ్రాయెల్‌పై క్షిపణులను అడ్డుకున్న దేశాల్లో.. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్

» సిరియా, గాజాపై ఐడీఎఫ్ దాడులు

» లెబనాన్ భూతల దాడుల్లో ఇజ్రాయెల్‌కు ఎదురుదెబ్బ.. 8 మంది మృతి

» ఐరాస చీఫ్‌పై ఇజ్రాయెల్ నిషేధం



ఇరాన్ క్షిపణి శకలంపై ఆడుకుంటున్న ఇజ్రాయెల్ పిల్లలు

టెల్‌అవీవ్, అక్టోబరు 2: ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల దాడితో.. పశ్చిమాసియా భగ్గుమంటోంది. ప్రతిదాడికి సిద్ధమంటూ ఇజ్రాయెల్ వర్గాలు చేస్తున్న ప్రకటనలపై అమెరికా, ఐరోపా సహా.. ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పశ్చిమాసియాలోని తమ బేస్‌లలో ఉన్న సిబ్బందిని అమెరికా అప్రమత్తం చేయగా.. మూడు ఫైటర్ స్క్వాడ్రన్లను అదనంగా తరలించింది. ఫ్రాన్స్, బ్రిటన్‌లు కూడా అదే దిశలో చర్యలు తీసుకుంటున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ముదరకుండా చర్యలు తీసుకుంటూనే.. ముందుజాగ్రత్త చర్యలకు సన్నద్ధమవుతున్నాయి. మరోవైపు.. హమాస్ టార్గెట్‌గా గాజాలో, హిజ్బుల్లా టార్గెట్‌గా లెబనాన్‌లో.. ఇతర ఉగ్రవాద సంస్థలే లక్ష్యంగా ఇజ్రాయెల్ క్షిపణి దాడులను ఉధృతం చేసింది. లెబనాన్‌లో భూతల దాడులు ప్రారంభించిన రెండోరోజు.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హిజ్బుల్లాతో ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది సైనికులను కోల్పోయింది. హిజ్బుల్లాకు చెందిన 30 మంది ఫైటర్లు కూడా దుర్మరణంపాలయ్యారు. సిరియాలో రెండు, గాజాలో 51 చొప్పున మరణాలు నమోదయ్యాయి. అటు.. పశ్చిమాసియాపై కమ్ముకుంటున్న యుద్ధమేఘాలపై ఐక్యరాజ్య ఐక్య రాజ్య సమితి(ఐరాస) భద్రతామండలిలో పలుదేశాలు ప్రవేశపెట్టిన తీర్మానాలపై బుధవారం వాడివేడిగా చర్చలు జరిగాయి.

గుణపాఠం చెబుతాం: నెతన్యాహు

తమ దేశంపై క్షిపణుల వర్షం కురిపించిన ఇరాన్‌పై.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం రాత్రి ఇరాన్ జరిపిన క్షిపణుల దాడిని ఓ విఫల ప్రయత్నంగా అభివర్ణించిన ఆయన.. టెహ్రాన్‌కు గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. "ఇజ్రాయెల్‌పై ఎవరు దాడి చేసినా.. మేము వారిని వదిలిపెట్టేదిలేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కాట్జ్ ఏకంగా ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌ను టార్గెట్‌గా చేసుకున్నారు. మంగళవారం రాత్రి నాటి దాడిపై గుటెర్రెస్ ఇరాన్ పేరును నేరుగా ఉచ్చరించకుండా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను ఖండించారు. ఇరాన్ దాడిని గెటెర్రస్ ఖండించకపోవడంతో.. ఆయనను ఇజ్రాయెల్‌లో నిషేధిస్తున్నట్లు కాట్జ్ చెప్పారు. "ఐరాస చీఫ్ మద్దతు లేకున్నా.. ఇజ్రాయెల్ తమ పౌరులను కాపాడుకోగలదు. జాతి గౌరవాన్ని మేం కాపాడుకుంటాం" అని వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే.. ఇరాన్ జరిపిన దాడిని ఖండిస్తూ గుటెర్రస్ కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. మరోవైపు మంగళవారం అర్ధరాత్రి దాటాక ఇరాక్ గగనతలంలో ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు కనిపించాయని అరబిక్ వార్తా సంస్థలు కథనాలను ప్రసారం చేశాయి. దీనిపై ఇరాక్ స్పందిస్తూ.. ఇజ్రాయెల్ తమ గగనతలాన్ని వినియోగించుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. కాగా, ఇరాన్ దాడిలో ఇజ్రాయెల్‌కు కలిగిన నష్టమెంత? ఈ ప్రశ్నలకు అటు ఇరాన్ గానీ, ఇటు ఇజ్రాయెల్ గానీ స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు.


లెబనాన్‌లో ఎదురుదెబ్బ!

లెబనాన్‌లో భూతల దాడులను ప్రారంభించిన రెండోరోజు ఐడీఎఫ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. లెబనాన్‌లోని పశ్చిమ బాల్బెక్ వద్ద ఉన్న అల్-సయాదా పట్టణంలో ఓ భవనంలో నక్కిన హిజ్బుల్లా ఉగ్రవాదులు బలగాలపైకి మోర్టార్ షెల్స్, రాకెట్లతో దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఐడీఎఫ్ ఎగోజ్ యూనిట్‌కు చెందిన కమాండర్ కెప్టెన్ ఈటాన్ ఇట్జాక్ ఓస్టర్(22) సహా 8 మంది చనిపోయారు. మరో ఐదుగురు గాయపడ్డట్లు ఐడీఎఫ్ అధికారికంగా ప్రకటించింది. బుధవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా హిజ్బుల్లా ఉగ్రవాదులను ఐడీఎఫ్ గుర్తించలేకపోయినట్లు వివరించింది. వెంటనే స్పందించిన ఐడీఎఫ్ జరిపిన ఎదురుకాల్పుల్లో 30 మంది హిజ్బుల్లా ఫైటర్లు హతమైనట్లు తెలిపింది. మరోవైపు, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ బుధవారం ఖతార్ రాజధాని దోహాకు చేరుకున్నారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య మధ్యవర్తిత్వ దేశాల్లో ఖతార్ కూడా ఉంది.

మూడో ప్రపంచయుద్ధం అంచున ఉన్నాం: ట్రంప్

ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి నేపథ్యంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రపంచం మూడో ప్రపంచ యుద్ధం అంచున ఉందని, ఈ పరిస్థితులను నియంత్రించడంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దారుణంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. "మాకు(అమెరికాకు) సరైన నాయకత్వం లేదు. మా దేశాన్ని ఎవరూ పాలించడం లేదు. ఉనికిలో లేని వ్యక్తి మాకు అధ్యక్షుడిగా ఉన్నారు" అంటూ బైడెన్‌పై మండిపడ్డారు. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ కూడా ఎన్నికల కోసం నిధుల సమీకరణలో బిజీగా ఉన్నారని విమర్శించారు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇరాన్‌ను కిమ్మనకుండా చేశానని గుర్తుచేశారు.

లోకం తీరు



అమెరికాకు ఇరాన్ వార్నింగ్

ఇజ్రాయెల్‌పై పోరులో కల్పించుకోవద్దంటూ అమెరికాకు హెచ్చరికలు చేసినట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి. స్విట్జర్లాండ్ ద్వారా ఈ సందేశాన్ని పంపినట్లు వివరించాయి. ఒకవేళ ఇజ్రాయెల్ ప్రతిస్పందనకు దిగితే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశాయి. పశ్చిమాసియాలో అమెరికా, ఐరోపా దేశాల వల్లే అశాంతి నెలకొందని ఇరాన్ సుప్రీం లీడర్ సయ్యద్ అలీ హుస్సేన్ ఖమేని ఆరోపించారు. ఆ దేశాలను ఇక్కడి నుంచి పారదోలితేనే పశ్చిమాసియాలో శాంతి సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు బుధవారం ఖమేని కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. కాగా, ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడిని జీ7 దేశాధినేతలు ముక్త కంఠంతో ఖండించారు. అదే సమయంలో ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి చేస్తే.. దాన్ని మాత్రం తాము సమర్థించబోమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు.

భారతీయులు.. జాగ్రత్త


లెబనాన్, ఇరాన్, ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని భారత విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మూడు దేశాల్లోని తమ పౌరుల క్షేమ సమాచారం కోసం అక్కడి భారత రాయబారులతో మాట్లాడి నిరంతరం వివరాలను తెలుసుకుంటున్నట్లు పేర్కొంది.

వచ్చిన క్షిపణిని వచ్చినట్టే..

ఇరాన్ దాడిని సమర్థంగా అడ్డుకున్న ఇజ్రాయెల్

ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులు ఒక వైపు! వాటి రాకను అల్లంత దూరంలోనే పసిగట్టి అప్రమత్తమైన ఇజ్రాయెల్ క్షిపణి రక్షణ వ్యవస్థ యారో పంపిన ఇంటర్‌సెప్టార్లు మరోవైపు!! ఒకదాన్నొకటి ఢీకొనడంతో భారీ శబ్దాలు.. పేలుళ్లు!!

..'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 2' పేరుతో ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల పరంపరను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ అమెరికా సాయంతో సమర్థంగా అడ్డుకుంది! ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిపడ్డ 400కుపైగా మిసైళ్లలో అత్యధిక క్షిపణులను.. వచ్చినదాన్ని వచ్చినట్టే నేలకూల్చామని ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్) వర్గాలు వెల్లడించాయి. అయితే.. కొన్ని మిసైళ్లు మాత్రం తమ ఎయిర్‌బేస్‌లను తాకాయని, వాటివల్ల కొన్ని కార్యాలయాలు, నిర్వహణ (మెయింటెనెన్స్) ప్రదేశాలు దెబ్బతిన్నాయి తప్ప పెద్దస్థాయిలో విధ్వంసం జరగలేదని, పలుప్రాంతాల్లో పెద్ద పెద్ద గుంటలు మాత్రం పడ్డాయని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. తమ వైమానిక దళం ఆపరేషన్స్‌కు ఎలాంటి విఘాతం వాటిల్ల లేదని.. తమ యుద్ధవిమానాలకుగానీ, డ్రోన్లు, ఇతర విమానాలు, ఆయుధాలు, కీలక మౌలిక సదుపాయాలకుగానీ ఎలాంటి డ్యామేజీ జరగలేదని తేల్చిచెప్పాయి. ఇరాన్ చెబుతున్నట్టుగా అవి హైపర్‌సానిక్ మిసైళ్లు కావని పేర్కొన్నాయి. కాగా.. ఇరాన్ ప్రయోగించిన ఒక బాలిస్టిక్ క్షిపణి శకలం వచ్చి మీదపడడంతో.. గాజా స్ట్రిప్‌లోని జెరికో వద్ద వర్క్ పర్మిట్‌తో పనిచేస్తున్న సమేహ్ అల్ అసలీ (37) అనే పాలస్తీనా కార్మికుడు మృతి చెందాడు. అతడి మృతదేహం పక్కనే పడి ఉన్న క్షిపణి శకలం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అదే క్షిపణి శకలాల కారణంగా మరో నలుగురు పాలస్తీనియన్లు కూడా గాయపడ్డారు. క్షిపణుల దాడిలో ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. కాగా.. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లలో కొన్నింటిని తమ గగనతలంలో అడ్డుకున్నట్టు జోర్డాన్ ప్రకటించింది. నిజానికి ఇరాన్ ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా ఇదే తరహాలో ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. కానీ, ఇజ్రాయెల్ తన 'యారో' రక్షణ వ్యవస్థతో వాటిని సమర్థంగా కూల్చేసింది. ఆ దాడుల్లో దక్షిణ ఇజ్రాయెల్‌కు చెందిన ఏడేళ్ల బాలిక గాయపడింది.



భారత్‌పై తీవ్ర ప్రభావం!

(మొదటి పేజీ తరువాయి)

ఎగుమతులు, గల్ఫ్ దేశాల్లో కొన్ని లక్షల మంది భారతీయులు పని చేస్తుండటం.. వీటన్నింటిపైనా ప్రభావం కనిపించే అవకాశం ఉంది.

చమురు: పెట్రోల్, డీజిల్ తదితర చమురు అవసరాలకు మనం పశ్చిమాసియా మీదే అత్యధికంగా (దిగుమతుల్లో దాదాపు 80%) ఆధారపడి ఉన్నాం. అక్కడి నుంచి వచ్చే చమురు సరఫరాలో ఏ కొంచెం ఇబ్బందులు తలెత్తినా మన మీద తక్షణం ప్రభావం పడుతుంది. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ ధరలకు అనుగుణంగానే దేశంలో పెట్రో ధరలను సవరిస్తున్న సంగతి తెలిసిందే. చమురు ధరలు పెరిగితే రవాణాఛార్జీలు పెరిగి నిత్యావసరాల ధరలు పెరిగిపోతాయి.

వాణిజ్యం: పశ్చిమాసియాతో భారత్‌కు వాణిజ్యపరంగా సన్నిహిత సంబంధాలున్నాయి. మన దేశం నుంచి అక్కడికి యంత్రాలు, ఔషధాల తదితర పలు రకాల ఉత్పత్తులు ఎగుమతి అవుతుంటాయి. అక్కడి నుంచి మనకు చమురు, సహజ వాయువు, ఎరువులు దిగుమతి అవుతాయి. ప్రస్తుతం ద్వైపాక్షిక వాణిజ్యం 1,95,000కోట్ల డాలర్లుగా (రూ.16,36,949 కోట్లు) ఉంది. దీంతోపాటు గల్ఫ్ దేశాల నుంచి భారత్‌లోకి గణనీయమైన స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయి. భారత్‌లోని మౌలిక సదుపాయాల (ఇన్‌ఫ్రా) కంపెనీలు, టెక్ స్టార్టప్‌లు తదితర రంగాల్లో గల్ఫ్ పెట్టుబడులు ఉన్నాయి. పలు గల్ఫ్ దేశాలతో భారత్.. 'ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌'ల దిశగా ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఒప్పందాలు కుదిరితే వాణిజ్యం, పెట్టుబడులు మరింత పెరుగుతాయి. కానీ, పశ్చిమాసియాలో అస్థిర పరిస్థితులు తలెత్తితే వీటన్నింటిపైనా తీవ్ర ప్రభావం చూపుతాయి.



ఉపాధి: గల్ఫ్ దేశాల్లో దాదాపు 90 లక్షల మంది భారతీయులు పని చేస్తున్నారు. వారి ద్వారా వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం భారత్‌కు లభిస్తోంది. ప్రస్తుత ఉద్రిక్తతలు కొనసాగితే ఇన్ని లక్షల మంది భారతీయుల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకమవుతుంది. వారు ఉద్యోగాలు కోల్పోయి భారత్‌కు తిరిగి వస్తే.. వారికి ఉపాధి ఏమిటన్న కొత్త సవాళ్లు ఎదురవుతాయి.

విదేశాంగ విధానం: ప్రస్తుతం భారత్‌కు అటు ఇరాన్‌తోనూ ఇటు ఇజ్రాయెల్‌తోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. 2010 నుంచి ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు తీవ్రతరం కావటానికి ముందు వరకూ.. ఆ దేశం నుంచి గణనీయమైన స్థాయిలో భారత్‌కు చమురు దిగుమతులు ఉండేవి. ఇక, ఇజ్రాయెల్ నుంచి టెక్నాలజీ, మిలిటరీ సామగ్రి దిగుమతి అవుతున్నాయి. ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పెరిగిపోతే.. తటస్థ వైఖరిని భారత్ కొనసాగించటం కత్తి మీద సాము అవుతుంది. ఇజ్రాయెల్‌కు బలమైన దన్నుగా ఉన్న అమెరికా, పశ్చిమ దేశాలు.. ఈ మేరకు భారత్‌పై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. మరోవైపు, ఇరాన్‌కు అనుకూలంగా రష్యా, చైనా రంగంలోకి దిగితే పరిస్థితి మరింత జటిలంగా మారుతుంది.

కేటీఆర్ వల్లే చైతన్య, సమంత విడాకులు

» అధికారంలో ఉన్నప్పుడు కొందరు హీరోయిన్ల ఫోన్లనూ ట్యాప్ చేయించి.. బెదిరించారు

» తాను డ్రగ్స్ వాడుతూ వారికీ అలవాటు చేశారు

» తెలంగాణ మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు

» ఖండించిన నాగార్జున కుటుంబం, సమంత

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో నాగచైతన్య సమంత విడాకులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆరే వంద శాతం కారణమంటూ మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రచురించలేని భాషలో ఆమె చేసిన మరిన్ని ఆరోపణలు.. తీవ్ర దుమారం రేపాయి. గాంధీభవన్‌లో బుధవారంనాడు మీడియాతో మాట్లాడిన సురేఖ.. పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌తో పడలేక ఇద్దరు, ముగ్గురు హీరోయిన్లు పెళ్లిళ్లు చేసేసుకున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కొంత మంది హీరోయిన్ల ఫోన్లనూ ట్యాప్ చేయించారని.. వారి మాటలను రికార్డ్ చేసి బెదిరించారని ఆరోపించారు. తాను డ్రగ్స్ వాడడమే కాక వారికి కూడా అలవాటు చేశారని ఆరోపించారు. మంత్రిగా ఉన్నప్పుడు ఎంతో మంది సినీ యాక్టర్ల జీవితాలతో ఆడుకుని, వారిని డ్రగ్స్ కేసులో ఇరికించిన కేటీఆర్.. తాను మాత్రం తప్పుకొన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సినీ నటులతో రేవ్ పార్టీలు నిర్వహించి.. వారిని బ్లాక్ మెయిల్ చేసి వారి జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ కేసులను తమ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. అయితే, మంత్రి వ్యాఖ్యలను నాగార్జున, అమల, నాగచైతన్య, సమంత ఖండించారు. అమల తీవ్రమైన పరుష పదజాలంతో సురేఖపై ట్విటర్‌లో విరుచుకుపడ్డారు. మరోవైపు.. మంత్రి కొండా సురేఖకు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. తనపై చేసిన ఆరోపణలను తక్షణం వెనక్కి తీసుకోవాలని.. 24 గంటల్లోగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే చట్టప్రకారం ముందుకు వెళ్తానని.. పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

అబద్ధం.. అసంబద్ధం..

నాగచైతన్య, సమంత విడాకులకు కేటీఆరే కారణమంటూ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని నటుడు అక్కినేని నాగార్జున.. మంత్రి కొండా సురేఖను 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. "రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలను.. మీ ప్రత్యర్థులను విమర్శించడానికి వాడుకోవద్దు. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించండి. బాధ్యత గలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం" అని ఆవేదన వెలిబుచ్చారు. ఆయన భార్య అమల అక్కినేని.. కొండా సురేఖపై మరింత పరుష పదజాలంతో 'ఎక్స్'లో విరుచుకుపడ్డారు. ఒక మహిళా మంత్రి ఇలా రాక్షసిలా మారి.. ఎలాంటి ఆధారాలూ లేకుండా పాపిష్టి, కల్పిత, నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. పరువుగా బతికే పౌరులను.. మంత్రి రాజకీయ యుద్ధంలో బలిపశువులుగా వాడుకోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని నిప్పులు చెరిగారు. అంతేకాదు.. "మిస్టర్ రాహుల్ గాంధీ, మీరు వ్యక్తుల గౌరవమర్యాదలకు విలువ ఇచ్చేవారైతే, దయచేసి మీ నాయకులను అదుపులో పెట్టండి. మీ మంత్రితో ఈ విషపూరిత వ్యాఖ్యలను వెనక్కితీసుకునేలా చేసి నా కుటుంబానికి క్షమాపణ చెప్పించండి. ఈ దేశ పౌరులను కాపాడండి" అని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

పరస్పర అంగీకారంతోనే విడాకులు

తామిద్దరం పరస్పర అంగీకారంతోనే, సామరస్యపూర్వకంగా విడాకులు తీసుకున్నామని.. అది తమ వ్యక్తిగత వ్యవహారం తప్ప అందులో ఎలాంటి రాజకీయ కుట్రకూ తావు లేదని సమంత, నాగచైతన్య వేర్వేరు ప్రకటనల్లో స్పష్టం చేశారు. తమ విడాకులకు గల కారణాలను బయటపెట్టాలనుకోవడం లేదని, దాని గురించి ఊహాగానాలు చేయడం మానుకోవాలని సమంత తన ఇన్‌స్టా ఖాతా వేదికగా వివరణ ఇచ్చారు. 'మంత్రిగా మీ మాటలకు సమాజంలో ఒక విలువ ఉంటుందని మీరు గ్రహించాలి. ఇతరుల వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడేటప్పుడు బాధ్యతగా, హుందాగా ప్రవర్తించాలని మిమ్మల్ని వేడుకుంటున్నాను. ఇకపై నా వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడడం మానేయండి' అని హితవు పలికారు. ఇక.. విడాకులనేవి అత్యంత బాధాకరమైన, దురదృష్టకరమైన నిర్ణయమని నాగచైతన్య 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. మంత్రి సురేఖ తమపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యం, హాస్యాస్పదమే కాక ఆమోదయోగ్యం కూడా కావని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాలో పతాకశీర్షికల కోసం సెలబ్రిటీల వ్యక్తిగత జీవిత నిర్ణయాలను వాడుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వెలిబుచ్చారు. ఇక.. "ఏమిటీ సిగ్గులేని రాజకీయాలు? సినిమా రంగంలో పనిచేసే ఆడవాళ్లంటే చిన్నచూపా?" అని నటుడు ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. అక్కినేని కుటుంబంపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలు షాకింగ్‌గా ఉన్నాయని రచయిత కోన వెంకట్ అన్నారు. "ఆమె ప్రతీ మాటను నేను ఖండిస్తున్నాను. సీఎం రేవంత్ ఈ విషయంపై సీరియస్‌గా దృష్టిసారించాలని కోరుతున్నాను. ఇటువంటి అవమానకరమైన, బాధ్యతారాహిత్యమైన మాటలు మాట్లాడినందుకు మంత్రి సురేఖ చేత క్షమాపణలు చెప్పించాలని ఆశిస్తున్నాను. మంత్రి సురేఖ అర్థం పర్థం లేని మాటలను ఖండించాలని సినీ పరిశ్రమను అభ్యర్థిస్తున్నాను" అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.



ఢిల్లీలోని ఓ బడిలో చెత్తను ఊడుస్తున్న ప్రధాని మోదీ

దేశ శ్రేయోవృద్ధికి స్వచ్ఛ భారత్

» వెయ్యేళ్ల తర్వాతా గుర్తుండి పోతుంది: మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 2: స్వచ్ఛ భారత్ మిషన్‌తో దేశ శ్రేయోవృద్ధికి సరికొత్త మార్గం ఏర్పడిందని ప్రధాని మోదీ అన్నారు. 21వ శతాబ్దంలో అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ప్రజా ఉద్యమం స్వచ్ఛ భారత్ మిషనేనని పేర్కొన్నారు. దీని ప్రభావం ప్రజారోగ్యంపైనా, వారి జీవన విధానాలపైనా సానుకూల ప్రభావం చూపిస్తోందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వచ్ఛ భారత్ కింద చేపట్టిన రూ.10 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. అదేవిధంగా పలు రాష్ట్రాల్లో 'అమృత్ 2.0' మిషన్ కింద ఏర్పాటు చేసిన మురికినీటి శుద్ధి ప్లాంట్లను ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ మిషన్ వెయ్యేళ్ల తర్వాత కూడా గుర్తుండిపోతుందన్నారు. పరిశుభ్రత అనేది వారసత్వంగా మారాల్సిన అవసరం ఉందని మోదీ నొక్కి చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం మహాత్మా గాంధీని ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని విపక్ష కాంగ్రెస్‌పై మోదీ ఈ సందర్భంగా నిప్పులు చెరిగారు. దేశంలో స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించిన తర్వాత ప్రతి ఇంటికీ మరుగు దొడ్డి ఉండాలన్న సంకల్పంతో పనిచేశామని, పదేళ్లలో 12కోట్ల మరుగుదొడ్లు నిర్మించామని మోదీ తెలిపారు. 2014-19 మధ్య డయేరియా మరణాలు తగ్గుముఖం పట్టి 3లక్షల మంది జీవితాలను స్వచ్ఛ భారత్ నిలబెట్టిందని డబ్ల్యూహెచ్‌వో కూడా పేర్కొన్నట్టు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్‌కు పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు ప్రశంసించారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు




ముస్తాబైన ఇంద్రకీలాద్రి

విజయవాడ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఇంద్రకీలాద్రిని విద్యుత్ దీపాలతో మిరుమిట్లు గొలిపేలా అలంకరించారు. తొలి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిస్తారు. తెల్లవారుజామున 3 గంటలకు అర్చకులు అమ్మవారికి స్నపనాభిషేకాలు నిర్వహిస్తారు. తొమ్మిది గంటల నుంచి అమ్మవారు బాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. దసరా మహోత్సవాల నిర్వాహణకు మొత్తం 6 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇంద్రకీలాద్రి ప్రాశస్త్యం తెలియజేసేలా లేజర్ షోను ఏర్పాటు చేస్తున్నారు. దుర్గాఘాట్ వద్ద నవహారతులను ప్రారంభించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఈ హారతులు ప్రత్యేక ఆకర్షణగా ఉండనున్నాయి. ఈసారి ఉత్సవాల్లో పోలీసులు సరికొత్త ప్రయోగం చేయనున్నారు. సైబర్ నేరాలు, రహదారి భద్రతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఈ నేరాల నుంచి ఎలా తప్పించుకోవచ్చన్న అంశాలను వివరించనున్నారు.



శ్రీశైలంలో ఏర్పాట్లు పూర్తి

శ్రీశైలం, అక్టోబరు 2: నంద్యాల జిల్లా శ్రీశైలం మహాక్షేత్రం దసరా మహోత్సవాలకు ముస్తాబయింది. గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉత్సవాలలో స్వామి, అమ్మవార్లకు విశేష అర్చనలు, రుద్రయాగం, చండీయాగం, జపపారాయణలు, అమ్మవారి ఉత్సవమూర్తికి నవదుర్గ అలంకరణలు, స్వామి, అమ్మవార్లకు వివిధ వాహన సేవలు నిర్వహించనున్నారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, ప్రత్యేక క్యూలైన్ల నిర్వహణ, ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో సుందరీరణ, గ్రామోత్సవాన్ని తిలకించేందుకు ప్రధాన ఆలయానికి ముందుభాగాన ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఉత్సవాలలో తొలిరోజు గురువారం స్వామి, అమ్మవార్లకు భృంగివాహన సేవ, అమ్మవారికి శైలపుత్రి అలంకారం చేయనున్నారు.



విద్యుద్దీపాలంకరణతో వెలుగులీనుతున్న శ్రీవారి ఆలయం

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

తిరుమల, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ జరగనుంది. దీనిలో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని సుందరంగా అలంకరించి విశేష సమర్పణ కావిస్తారు. అనంతరం రాత్రి 7 గంటలకు మాడవీధులగుండా ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత రంగనాయక మండపంలో ఆస్థానం నిర్వహిస్తారు. యాగశాలలో అర్చకస్వాములు కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) నిర్వహిస్తారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి. ఇక, శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనాలతో వాహన సేవలు ప్రారంభంకానున్నాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు కంకణ భట్టాచార్యులుగా గోవిందాచార్యులు వ్యవహరిస్తారు.

గాంధీభవన్ ప్రాంగణంలో ఆక్రమణల తొలగింపు



గాంధీభవన్ ప్రాంగణంలో ఆక్రమణదారులు వేసిన కంచెను తొలగిస్తున్న పూర్ణచంద్ర గాంధీ, గాంధేయవాదులు

నిడమర్రు, అక్టోబరు 2: గాంధీ జయంతి సందర్భంగా గాంధీభవన్ ప్రాంగణంలోని ఆక్రమణలను గాంధేయ వాదులు తొలగించారు. బుధవారం ఏలూరు జిల్లా నిడమర్రు పెదనింద్రకొలను గ్రామంలో జరిగిందీ ఘటన. మహాత్ముని స్మారకంగా చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు 1981లో ఇక్కడ గాంధీ భవన్‌ను నిర్మించినట్టు ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి రాష్ట్ర చైర్మన్ కాజా పూర్ణచంద్రగాంధీ తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌ను సందర్శించారు. ఈ భవనం ప్రాంగణంలోని 2 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారని సర్వోదయమండలి ప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించడంతో ఆక్రమణలకు సంబంధించి మ్యూటేషన్‌ను రద్దుచేశారని ఆయన తెలిపారు. అయినప్పటికీ ఆక్రమణదారులు ఆ స్థలం చుట్టూ కంచెను నిర్మించారన్నారు. కంచెను గాంధేయవాదులు, సర్వోదయ మండలి నాయకులు తొలగించారు. కార్యక్రమంలో కాజా పూర్ణచంద్ర గాంధీ కూడా పాల్గొనడంపై గాంధేయవాదులు హర్షం వ్యక్తం చేశారు. గాంధీభవన్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీలో.. సర్వం సారే!

మంత్రికి తెలియకుండానే ముఖ్య కార్యదర్శి మంత్రాంగం

- రూ.290 కోట్ల రోడ్ల మరమ్మతు పనులకు అనుమతులు
- ఈఎన్‌సీతో కలిసి కీలక నిర్ణయం
- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కనీసం ఫైలు కూడా పెట్టని వైనం
- ఆరా తీసిన ముఖ్యమంత్రి కార్యాలయం
- ముఖ్య కార్యదర్శిపై చర్యలకు సిద్ధం

ప్రభుత్వం మారినా.. మంత్రికి తెలియకుండానే ఫైళ్ల ఆమోదానికి చక్రం తిప్పే సంస్కృతి కొందరు ఉన్నతాధికారుల్లో పోలేదు. రాష్ట్రంలో విపత్తు నిధుల కింద చేపట్టే రహదారి మరమ్మతు పనులను రోడ్లు-భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి గుట్టుగా ఆమోదించేశారు. ఈ పరిణామం ఇప్పుడు ఆర్అండ్‌బీలో పెద్ద వివాదాన్నే రాజేసింది. కార్యదర్శి, ఈఎన్‌సీ చేతులు కలిపి.. మంత్రికి మాటమాత్రమైనా చెప్పకుండా, ఆయన ఆమోదానికి ఫైలు పంపించకుండానే కీలక నిర్ణయం తీసుకోవడం కలకలం రేపింది. ఇది బయటకు పొక్కడంతో సీఎం కార్యాలయం (సీఎంవో) జోక్యం చేసుకున్నట్లు తెలిసింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రోడ్లు-భవనాల(ఆర్అండ్‌బీ) శాఖకు సంబంధించి ప్రభుత్వ స్థాయిలో ఏ విధాన నిర్ణయం తీసుకోవాలన్నా విధిగా ఫైలు ముఖ్య కార్యదర్శికి వెళ్లాలి. అక్కడి నుంచి మంత్రి ఆమోదానికి దానిని పంపించాలి. రహదారి మరమ్మతులకు పరిపాలనా ఆమోదం ఇచ్చేవి, టెండర్లకు సంబంధించిన ఫైళ్లు.. ఆమోదం కోసం ఇంజనీర్-ఇన్-చీఫ్(ఈఎన్‌సీ) ఆఫీసు నుంచి ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శికి వెళ్తాయి. ఆ తర్వాత మంత్రి ఆమోదం విధిగా తీసుకోవాలి. ఇది బిజినెస్ రూల్. ఇవన్నీ తెలిసిన అధికారులు రహదారి మరమ్మతు పనులకు పరిపాలనా ఆమోదం ఇచ్చే విషయంలో ఏకపక్షంగా వ్యవహరించినట్లు వెలుగుచూసింది. రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం ఇటీవల ప్రభుత్వం 291 కోట్ల నిధులను ఆర్అండ్‌బీకి కేటాయించింది. విపత్తు శాఖ ఆమోదంతోనే ఆ నిధులను కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.. అందుకయ్యే ఖర్చు ఎంత.. ఏ పనికి ఎంత మేర అంచనాలు రూపొందించారు.. టెండర్లు మొదలైన అంశాలపై ప్రతిపాదనలు రూపొందించి ఆమోదించాలని ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేకు ఈఎన్‌సీ నయీముల్లా ఫైలు పంపించారు. ఇందులో రాష్ట్ర ప్రధాన రహదారులు(స్టేట్ హై వేస్), జిల్లా ప్రధాన రోడ్లు(ఎండీఆర్) ఉన్నాయి. సగటున ఒక్కో కిమీ మరమ్మతుకు ఎంత ఖర్చవుతుంది.. వర్క్‌లు ఏ ప్రాతిపదికన కాంట్రాక్టర్లకు ఇవ్వబోతున్నారో కీలక అంశాలు అందులో ఉన్నాయి. ఈ ప్రతిపాదనల ఫైలుకు దండే ఇటీవల ఆమోదం తెలిపారు. ఆ తర్వాత దానిని ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి పంపించాలి. ఆయన ఆమోదంతో పనులు చేపట్టడానికి ఉత్తర్వులివ్వాలి. అయితే ఫైలు మంత్రికి పంపలేదు. తన స్థాయిలోనే ఆమోదించి ఫైలును తిరిగి ఈఎన్‌సీకి పంపించారు. ఈఎన్‌సీ నయీముల్లా ఈ విషయాన్ని గుర్తించారు. కానీ మంత్రి ఆమోదం తీసుకోవాలన్న విషయం ముఖ్య కార్యదర్శికి నివేదించలేదు. ఫైలు రాగానే వెనువెంటనే పనులు కాంట్రాక్టర్లకు అప్పగించేలా నిర్ణయాలు తీసుకున్నారని తెలిసింది. రోజులు గడుస్తున్నా ఫైలు తన వద్దకు రాకపోవడంతో మంత్రి తన పీఎస్‌తో వాకబు చేయించినట్లు సమాచారం. ఈఎన్‌సీ అప్పుడు మంత్రికి ఫోన్‌చేసి.. మరమ్మతు పనులకు ముఖ్య కార్యదర్శి దండే ఆమోదముద్ర వేసేశారని అసలు విషయం చెప్పారు. దీంతో జనార్దన్‌రెడ్డి విస్తుపోయినట్లు తెలిసింది. 'నాకు ఫైలు పెట్టకుండానే ఎలా ఆమోదించారు? నాకు ఫైలు ఎందుకు పంపించలేదు? ఇదెప్పుడు జరిగింది' అని ఈఎన్‌సీని వివరాలు కోరినట్లు సమాచారం. తనను కాదని అధికారుల స్థాయిలోనే ఇలా ఎలా నిర్ణయాలు తీసుకుంటారని నిలదీసినట్లు తెలిసింది. ఈ విషయం సీఎం కార్యాలయం(సీఎంవో) దృష్టికి కూడా వెళ్లింది. సీఎంవోలోని ఓ కీలక అధికారి మంత్రికి ఫోన్‌చేసి రహదారి మరమ్మతు పనుల ఆమోదం ఎంత వరకు వచ్చింది.. ఆ ఫైలు ఆమోదించారా అని అడుగగా.. జరిగిన పరిణామాలను జనార్దన్‌రెడ్డి ఆయనకు వివరించినట్లు సమాచారం. ముఖ్యమంత్రో, మరొకరో తనను అడిగితే ఏమని సమాధానం చెప్పాలి.. అని మంత్రి తీవ్ర అసంతృప్తికి గురయినట్లు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక, వివరణ ఇవ్వాలని ఈఎన్‌సీకి మంత్రి మెమో జారీ చేశారని.. వ్యక్తిగతంగా కలిసి వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. ముఖ్య కార్యదర్శిపై ప్రభుత్వ స్థాయిలో చర్యలు ఉంటాయని తెలిసింది.

బదిలీల్లో గోల్‌మాల్..

ఆర్అండ్‌బీ బదిలీల్లో కీలక ఇంజనీరింగ్ అధికారి ఒకరు తన అనుచరులు, అస్మదీయులను క్వాలిటీ కంట్రోల్, జాతీయ రహదారుల విభాగంలో పోస్టింగులు ఇప్పించినట్లు సమాచారం. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ), సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ)ల్లో తనకు రెగ్యులర్‌గా మూటలు ముట్టజెప్పేవారిని ఏరికోరి కీలక పోస్టులు కట్టబెట్టారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణ చేయగా రూ.వేల కోట్ల పనులు జరుగుతున్న కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల ఎన్‌హెచ్ విభాగాల్లో తన మనుషులకు పోస్టింగులు ఇప్పించారని ఇప్పటికే గుర్తించారు. త్వరలో వీటిపై సమీక్ష చేయనున్నారు.

నేటి నుంచి టెట్

- రోజూ రెండు సెషన్లలో నిర్వహణ
- 4,27,300 మంది అభ్యర్థులు... 108 పరీక్షా కేంద్రాలు

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయి. 3వ తేదీ నుంచి ఈనెల 21 వరకు పరీక్షలు జరుగుతాయి. టెట్ కోసం 4,27,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారికోసం ఇతర రాష్ట్రాల్లో, రాష్ట్రంలో కలిపి మొత్తం 108 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, బరంపూర్, గంజాంలలోనూ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు చాలావరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రతిరోజూ 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులను గంటన్నర ముందే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డుల్లో ఏదో ఒక గుర్తింపు కార్డును అభ్యర్థులు తప్పనిసరిగా తీసుకెళ్లాలి. అభ్యర్థికి బదులుగా మరొకరు పరీక్షకు హాజరైనా, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా ఏపీ పబ్లిక్ పరీక్షల చట్టం కింద చర్యలు తీసుకుంటారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అనుమతించరు. హాల్ టికెట్లలో పొరపాట్లు ఉంటే పరీక్షా కేంద్రంలో డిపార్ట్‌మెంటల్ అధికారి వద్ద సరిచేసుకోవచ్చు.



విశాఖలో బుధవారం రీజనల్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉక్కు కార్మిక సంఘ ప్రతినిధులు

వారం రోజుల్లో ఆన్‌లైన్ పాస్‌లు

- ఆర్ఐఎన్ఎల్ అంగీకారం
- కొలిక్కి వచ్చిన ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమస్య

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ఉద్రిక్తతకు దారితీసిన 4 వేల మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశం బుధవారం ఓ కొలిక్కి వచ్చింది. దీనిపై కార్మిక సంఘాల నాయకులు మంగళవారం ఉదయం నుంచి బుధవారం తెల్లవారుజాము మూడు గంటల వరకూ వర్క్స్ ఈడీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. మరోవైపు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాలు విశాఖపట్నంలో బుధవారం ర్యాలీ నిర్వహించాయి. సమస్యను పరిష్కరించాలంటూ కార్మిక సంఘాలు ప్రాంతీయ లేబర్ కమిషనర్ కేజే మొహంతిని బుధవారం కలిశాయి. ఆయన ఇరు వర్గాలను పిలిచి కొన్ని గంటల పాటు చర్చించారు. తొలగించిన వారి పేర్లన్నీ వారం రోజుల్లో పునరుద్ధరించాలని, నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆర్ఐఎన్ఎల్ ప్రతినిధులకు ఆయన సూచించారు. ప్లాంటులో ఉత్పత్తికి ఆటంకం కలగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కార్మిక సంఘాలు నడుచుకోవాలని నాయకులకు హితవు పలికారు. ఈ చర్చలతో కాంట్రాక్టు కార్మికుల సమస్య పరిష్కారం అయినట్టేనన్నారు. ఈ చర్చల్లో ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ,టీఎన్‌టీయూసీ తదితర సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి: షర్మిల

కూర్మన్నపాలెం(విశాఖపట్నం), అక్టోబరు 2: విశాఖ ఉక్కు కర్మాగారంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిర్వహించిన రాస్తారోకోలో ఆమె పాల్గొని సంఘీభావం తెలిపారు. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సందర్శించి, కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, పెద్దఎత్తున కాంట్రాక్టు కార్మికుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అయినా.. చిన్నారి దక్కలేదు

- 11 పోలీసు బృందాలు జల్లెడపట్టినా ఫలితం శూన్యం
- చెరువులో మృతదేహం లభ్యం
- నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన అస్పియా



పుంగనూరు, అక్టోబరు 2: ఆరేళ్ల చిన్నారి కోసం.. నలుగురు డీఎస్పీలు, పలువురు సీఐలు, ఎస్ఐలు, నిపుణులతో కూడిన 11 పోలీసు బృందాలు నాలుగు రోజులుగా రేయింబవళ్లు గాలించాయి. రెండు డాగ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగి వీధి వీధీ జల్లెడపట్టాయి. అయినా.. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఆరేళ్ల చిన్నారి అదృశ్యం కేసు విషాదాంతమైంది. 4 రోజుల క్రితం కనిపించకుండా పోయిన చిన్నారి అస్పియా(6) బుధవారం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో విగతజీవిగా కనిపించింది. పుంగనూరు ఉబేదుల్లా కాంపౌండ్‌లోని ఫైనాన్స్ వ్యాపారి అజ్మతుల్లా కుమార్తె అస్పియా గత ఆదివారం రాత్రి 7గంటల సమయంలో కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సవాలుగా భావించిన ఎస్పీ మణికంఠ.. పాప ఆచూకీ కనిపెట్టేందుకు నలుగురు డీఎస్పీలు, పలువురు సీఐలు, ఎస్ఐలతో 11 పోలీసు బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. రెండు డాగ్ స్క్వాడ్ బృందాలు కూడా చుట్టుపక్కల వీధుల్లో గాలించాయి. చిన్నారి తండ్రి ఫైనాన్స్ వ్యాపారి కావడంతో అనుమానితులుగా ఉన్న వారిని కూడా విచారించారు. అయితే 4 రోజులైనా చిన్న క్లూ కూడా లభించకపోవడంతో ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో బుధవారం పుంగనూరు ఎన్ఎస్‌పేటలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి నాలుగేళ్ల బాలుడికి చాక్లెట్ ఇస్తామని పిలుస్తుండగా గమనించిన కుటుంబీకులు అనుమానం వచ్చి వెంబడించారు. దీంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. వారికోసం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద వెతుకుతుండగా నీటిలో బాలిక మృతదేహం తేలుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి.. తల్లిదండ్రుల సాయంతో అది అస్పియాదిగా నిర్ధారించారు. కాగా, బాలిక శరీరంపై గాయాలేమీ లేవని వైద్యులు తెలిపారు. అయితే బాలిక అక్కడకు ఎలా వెళ్లింది.. ఆమె ప్రమాద వశాత్తు నీళ్లలో పడిందా.. లేక ఎవరైనా బాలికను కిడ్నాప్ చేసి చంపేశారా..? అనే విషయాలు దర్యాప్తులో తేలనున్నాయి.

మతం, కులం పేరుతో దేశాన్ని విభజిస్తున్న బీజేపీ

- బాగుపడాలంటే సెక్యులర్ పార్టీ రావాలి
- లడ్డూ వివాదంపై తొలి నుంచీ సీబీఐ విచారణను కోరుతున్నాం
- అవసరమైతే రాహుల్ ఉక్కు ఉద్యమంలో పాల్గొంటారు: షర్మిల



విశాఖ జీవీఎంసీ ఎదుట గాంధీ విగ్రహానికి బుధవారం వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్ షర్మిల

విశాఖపట్నం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): దేశాన్ని మతం, కులం ప్రాతిపదికన విభజించి బీజేపీ పాలిస్తోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ ఫాసిస్టు శక్తుల నుంచి ఈ దేశాన్ని కాపాడాలంటూ మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విశాఖలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి షర్మిల పూలమాలలు వేసి నివాళులర్పించి, వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఒకప్పటి బ్రిటీష్ పాలకుల విధానమైన విభజించి, పాలించు సిద్ధాంతాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు అమలు చేస్తోంది. గాంధీ సిద్ధాంతాలను విస్మరించి గాడ్సే సిద్ధాంతాలను పాటిస్తుంది. దేశంలో ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని, సిద్ధాంతాలను అమలు చేస్తోంది. దేశంలోని బీజేపీ పాలన తొలగిపోవాలని కోరుకుంటూ.. టీడీపీ, జనసేన, వైసీపీలు బీజేపీకి మద్దతివ్వడాన్ని నిరసిస్తూ గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలను సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టాం. దేశం బాగుపడాలంటే సెక్యులర్ పార్టీ పాలన రావాలి. దేశంలో ప్రజల మధ్య ఐక్యత, ప్రేమ, సోదర భావం కొనసాగాలని గాంధీ కలలు కన్నారు. వాటిని సాకారం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. తిరుపతి లడ్డూ వ్యవహారంలో తొలి నుంచీ మేం సీబీఐ విచారణ కోరుతున్నాం. లడ్డూ వివాదంలో రాష్ట్ర ప్రభుత్వ విధానం సరిగా లేదు. సిట్ విచారణ కంటే సీబీఐ విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. మతాన్ని రాజకీయాలకు వినియోగించకూడదనే విషయాన్నే కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో చెబుతోంది. ఏపీలో మతం పేరుతో రాజకీయాలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోంది. లడ్డూ వ్యవహారంపై విచారణ బాధ్యతను సుప్రీంకోర్టు కేంద్ర సంస్థలకు అప్పగిస్తుందని భావిస్తున్నాం' అని షర్మిల అన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రియాంక దండి, కార్యదర్శి చోడదాసి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం అంచున...!

ఇజ్రాయెల్ మీద ఇరాన్ ఆర్నెల్ల క్రితం చేసిన దాడికీ, ఇప్పుడు జరిగిన దానికీ తేడా స్పష్టం. ఏప్రిల్‌లో వందలాది క్షిపణులు, డ్రోన్లు ఇజ్రాయెల్ మీదకు పంపి అంతకుపక్షం రోజుల ముందు సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్ భవనంమీద క్షిపణి దాడితో రివల్యూషనరీ గార్డ్ అత్యున్నతస్థాయి కమాండర్లతో సహా పన్నెండుమందిని ఇజ్రాయెల్ చంపివేసినందుకు ప్రతీకారం తీర్చుకుంది. కానీ, ఆ దాడిలో ఇజ్రాయెల్‌కు జరిగిన నష్టం అతి స్వల్పం. కక్షతీర్చుకొనే తన లక్ష్యం నెరవేరిందని, ఆపరేషన్ ముగిసిందని ఇరాన్ వెంటనే ఓ ప్రకటన చేసింది. ఇది ప్రతీకాత్మక దాడేకానీ, ప్రతీకారం కాదని అందరికీ అర్థమైంది. తమ పొరుగుదేశాలకు ఈ దాడికి సంబంధించి డెబ్బయ్‌రెండు గంటల ముందస్తు సమాచారాన్ని అందచేశానని కూడా ఇరాన్ అప్పట్లో ప్రకటించింది. ఇజ్రాయెల్, దాని మిత్రదేశాలకు ఆత్మరక్షణకు తగినంత సమయమూ లభించింది, మరోపక్క ఇరాన్ తన శపథాన్ని నిలబెట్టుకున్నట్టూ అయింది. ముప్పైమూడేళ్ళ తరువాత ఇజ్రాయెల్‌మీద జరిపిన ఆ చర్యతో, ఎంత రెచ్చగొట్టినా ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్‌మీద దాడికిదిగదన్న భ్రమలు కూడా తొలగిపోయాయి. ఆర్నెల్లక్రితంతో పోల్చితే ఇప్పటిదాడి తీవ్రమైనది. ఈ మారు ఖరీదైన క్షిపణులను ఇరాన్ ఉపయోగించిందని, ఇజ్రాయెల్ రక్షణఛత్రాన్ని దాటిమరీ ఆ దేశాన్ని దెబ్బకొట్టాలన్న కసి అందులో ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. హిజ్బొల్లా సీనియర్ నాయకుడు హసన్ నస్రల్లాను హతమార్చడమే కాక, లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ యుద్ధట్యాంకర్లు చొరబడుతున్న తరుణంలో ఈ దాడి జరిగింది. దీనికితోడు ఇరాన్ ప్రజలను దుర్మార్గులైన వారి పాలకుల నుంచి అతిత్వరలోనే విముక్తి చేస్తానంటూ నెతన్యాహూ వీరోచిత వ్యాఖ్యలు కూడా చేశారు. ఇరాన్‌లో ఆవగింజంత ప్రదేశం కూడా తన ఆయుధానికి దూరంగా ఉండలేదని హెచ్చరికలు చేశారు. పశ్చిమాసియాలో ప్రతీ అంగుళం తన రాడార్‌లో ఉందన్నారు. హమాస్, హిజ్బొల్లాల తరువాత, ఇరాన్ పాలకుల పనిపట్టడమే లక్ష్యంగా నెతన్యాహూ అడుగులు పడుతుంటే సహనంగా ఉండటం అసాధ్యం. మొత్తానికి యుద్ధాన్ని విస్తరించాలన్న నెతన్యాహూ వ్యూహమైతే నెరవేరుతున్నట్టు ఉంది.

గతంలో ఇరాన్ దాడిచేసిన తరువాత అమెరికా చెప్పిన మేరకు ఇజ్రాయెల్ కూడా వెంటనే ప్రతీకారం తీర్చుకొనే పనిలో పడలేదు. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నం. యాభైయేళ్ల తరువాత ఇజ్రాయెల్‌కు దక్కిన అవకాశాన్ని వదులుకోకూడదని, ప్రతీకారం పేరిట ఇరాన్ అణుస్థావరాలనుంచి చమురుకేంద్రాలవరకూ దేనినీ వదలకుండా సర్వమూ నేలమట్టం చేయాలని ఇజ్రాయెల్ కీలకనేతలంతా తీర్మానిస్తున్నారు, తదనుగుణంగానే పాలకులు కూడా సంసిద్ధత ప్రకటిస్తున్నారు. ఇరాన్‌కు రక్షణకవచంలాగా వ్యవహరించే హిజ్బొల్లా తీవ్రంగా దెబ్బతినివున్న ప్రస్తుత స్థితిలో ఇజ్రాయెల్‌కు ఇది మరింత సులభం. ప్రతీకారం తప్పదంటూ ఇజ్రాయెల్ పక్షాన అమెరికా దానిమిత్రదేశాలు ఇరాన్‌కు చేస్తున్న హెచ్చరికలను, తరలివెడుతున్న యుద్ధ విమానాలు, నౌకలను, ఇరాన్‌కు అనుకూలంగా రష్యా బరిలోకి దిగుతున్న సూచనలను గమనించినప్పుడు పరిస్థితి కట్టుతప్పుతున్న విషయం స్పష్టమవుతోంది. అమెరికా అధ్యక్షస్థానంలో నోరులేని బైడెన్ ఉండగానే తాను అనుకున్నది చేసుకుపోవాలని నెతన్యాహూ ఆలోచన. ఇజ్రాయెల్ మీద హమాస్ అమానుషదాడికి ప్రతీకారంగా ఆరంభించిన యుద్ధానికి ఏడాది పూర్తవుతున్న తరుణంలో దానిని అక్కడికే పరిమితం చేయాలని నెతన్యాహూ అనుకోవడం లేదు. గాజాను దుంపనాశనం చేసి, హమాస్‌ను తీవ్రంగా దెబ్బతీసినప్పటికీ, బందీలుగా ఉన్న మిగతా ఇజ్రాయెలీలను హమాస్‌నుంచి విడిపించలేదన్న అప్రదిష్ట ఆయనకు తప్పడంలేదు. ఈ దశలో హిజ్బొల్లా అధినేతను మట్టుబెట్టిన తరువాత నెతన్యాహూకు ఇంట్లో కాస్తంత గౌరవం పెరిగిందని అంటారు. ఈ వేడిలోనే గాజా, లెబనాన్, యెమన్, సిరియా, ఇరాన్ వరకూ యుద్ధాన్ని విస్తరించి శత్రుసంహారం పూర్తికావించాలన్నది ఆయన ఆలోచన కావచ్చు. ఇజ్రాయెల్ సైనికస్థావరాలమీదా, మొసాద్ కార్యాలయంమీదా క్షిపణులు ప్రయోగించిన తరువాత, కక్ష తీరింది, ఇక చాలు అన్న అర్థంలో ఇరాన్ ఓ ప్రకటన చేసింది. కానీ, ఇరాన్‌ను ఎప్పుడు ఎలా దెబ్బతీయాలన్నది కాక, అది ఏ స్థాయిలో ఉండాలన్నదే ఇజ్రాయెల్ ఆలోచిస్తోందని వార్తలు వస్తున్నాయి. యుద్ధం విస్తరిస్తూ దౌత్యానికి తావులేని దిశగా పరిణామాలు వేగంగా మారుతున్న స్థితిలో మిగతా ప్రపంచం ముందుకు రావడం అవసరం.

‘ఎర్రగుర్తులు’ పెట్టడానికి ఎందుకు తొందర?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం, తెలంగాణ సర్కారుకు రాష్ట్ర హైకోర్టు తగిన విధంగా వడ్డింపులు చేశాయి. రెండు చోట్లా జరిగినవి వేరు వేరు అయినా, వాటి మంచి చెడ్డలు ఏమయినా, న్యాయ సందేశంలో ఉమ్మడి అంశం ఒకటే, “అత్యుత్సాహం మంచిది కాదు.” పాలకులు వాళ్ల రాజకీయ అవసరం కోసమో, ‘అభివృద్ధి’ పందెంలో భాగంగానో తూకం తప్పి దూకుడుగా పరుగులెత్తుతారు. స్పీడ్ బ్రేకర్లుండడం వారికి, ప్రజలకూ కూడా ఆరోగ్యకరం.

రాజకీయానుభవం, నాయకత్వ ప్రతిభ తప్ప పాలనానుభవం లేని రేవంత్‌రెడ్డి ఆలోచనలో కొంత అవగాహన లోపిస్తే అర్థం చేసుకోవచ్చు. మంచీచెడ్డా చెప్పవలసిన సచివులు, సహచరులు, సలహాదారులు వారి విధి నిర్వహణలో విఫలం కావడం ఏ మాత్రం క్షమించలేని విషయం. ఆక్రందనల, శాపనార్థాల వీడియోలు వైరల్ కాకముందే, ఆత్మహత్యలు జరగక ముందే ‘గాలి మార్పు’ను వార్తాహరులు గమనించి, ఏలికల చెవిన వేసి ఉండవలసింది. వారం వారం రేటింగ్ ఇచ్చే అభిప్రాయసేకరణలు మన దేశంలో జరగవు కానీ, జరిగితే కనుక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ రెండు వారాల కిందటికీ, ఇప్పటికీ చాలా మారి ఉంటుంది. బలమైన ప్రతిపక్షం, కాచుక్కూర్చున్న జాతీయపక్షమూ ఉన్నచోట, ఇంత అజాగ్రత్త పనికిరాదు.

చినుకు పడగానే చిరాకుగా తయారయ్యే హైదరాబాద్ ట్రాఫిక్‌కు కారణం, వర్షపునీరు ప్రవహించే దారులు మూసుకుపోవడమేనని, చిన్నాచితకా జలాశయాల చుట్టూ ఆక్రమణలూ, ఎవరికివారు మట్టి గుమ్మరించి పెంచుకునే ఎత్తులతో అష్టావక్రంగా తయారయిన వీధులూ వానాకాలం నగరజీవితాన్ని నానా ఛిద్రం చేస్తున్నాయని ప్రజలలో గుర్తింపు పెరిగింది. ప్రతి ఏటా, వర్షం కురియగానే పాత చెరువులు ప్రత్యక్షమై, ఆక్రమణలను బహిరంగపరుస్తున్నాయి. ప్రముఖ సినీనటుడి ఉల్లంఘన మీద బుల్‌డోజర్ నడిపిస్తే జనం ఓహో అనుకున్నారు. ఎడాపెడా బిల్డింగులు కూలుస్తుంటే, ఎంతటివారినైనా ఖాతరుచేయని బుల్‌డోజర్‌గా కళ్లు విప్పార్చి చూశారు. ఆ రెండు రోజుల సాహసం తెచ్చిన ప్రతిష్ఠ మీద హైదరాబాద్ ప్రజలు కొంతకాలం హైడ్రాను భరించారు. ఆ తరువాత కొంత ‘దృశ్యం’ మారుతూ వచ్చింది. పేదవాళ్లుగా, దిగువ మధ్యతరగతి జీవులుగా కనిపిస్తున్న మనుషులు బేలగా, దీనంగా ఆర్తనాదాలు చేస్తుంటే చూడడం కష్టం. ప్రభుత్వం చెబుతున్న ఆదర్శానికి వాస్తవానికీ పొంతన కుదరనప్పుడు, పెదవి విరుపు మొదలయింది. కోర్టును ఖాతరు చేయని కూల్చివేతలు సహజంగానే అహంకారాన్ని ధ్వనించాయి.

హైదరాబాద్‌లో ఉండిన జలమార్గాలు, జలాశయాలు అన్నీ మూసీ ప్రవాహ వ్యవస్థలోనివే. నగరానికి ఒక ఎత్తు పల్లాల, చెట్టూ చేమల నైసర్గికత ఉంటుంది. నీరు పల్లానికి ప్రవహిస్తుంది. మనుషులు తమ అవసరాల కోసం కొన్ని చోట్ల నీటిని నిలుపుకుంటారు. తక్కిన నీటిని జాగ్రత్తగా వెలుపలికి పంపాలి. ఇది కూడా నదేనా, అని వెక్కిరించే వాళ్లుంటారు కానీ, ఇది నాలుగువందలేళ్ల పైచిలుకు చరిత్రలో అనేకమార్లు తన ఉధృతరూపాన్ని ప్రదర్శించింది. 1908, మనకు తెలిసిన తాజా ‘ముచికుందానది జలప్రళయము’. ఆ తరువాత నగరానికి వరద నివారణ వ్యవస్థ ఒకటి ఏర్పడింది. అప్పటి జనాభాను, నగరభూభాగాన్ని దృష్టిలో పెట్టుకున్నది ఆ వ్యవస్థ ప్రణాళిక. నాలుగు దశాబ్దాలు గడిచేసరికి చాలనితనం ఎదురైంది. సంస్థాన కాలంలో ఉండిన పట్టింపు, విధాన వేగం, హైదరాబాద్‌కు స్వతంత్ర భారతంలో లభించలేదు. అందరూ ఈ నగరాన్ని ఆబగా అనుభవించాలనుకోవడమే తప్ప, దీని మీద పడిన ఒత్తిడిని, పెరుగుతున్న మంచినీటి కొరతను, మురుగునీటి తీవ్రతని తగ్గించాలని చూడలేదు. నగరాన్ని తాము గొప్పగా తీర్చిదిద్దామని చెప్పుకోవాలన్న ఆత్రుతే తప్ప, హైదరాబాద్ ఆత్మ కాంక్రీట్ అరణ్యంలో, సహజీవన రాహిత్యంలో అణగారిపోతున్నదన్న గుర్తింపు ఏలికలకు లేకపోయింది. ఈ అవకతవక బీభత్స గందరగోళ అభివృద్ధిలో, టౌన్ ప్లానింగ్ ఎగిరిపోయింది, నాలుగు గజాల నేలలో నిలబడడం నిరుపేదలకు ప్రాణావసరమైంది, వెంచర్లు వెంచర్లుగా కంచెలు కట్టి కబ్జాచేయడం పెద్దలకు దర్జా అయిపోయింది. దళారులు, అవినీతి ఉద్యోగులు, రాజకీయ నాయకులు, అసాంఘిక శక్తులు హైదరాబాద్‌ను అంగుళం అంగుళంగా ఆరగించారు. ఎత్తుపల్లాలు తారుమారయ్యాయి, వాననీటికి దారులు మూసుకుపోయాయి, చెరువులు కుంచించుకుపోయాయి, మూసీ ఒక పాయ అయిపోయింది. దాని కడుపు బస్టాండ్ అయింది.



> అన్నిటికంటె ముందు ప్రభుత్వం గ్రహించవలసింది, ప్రజలు ఈ సుందరీకరణ ప్రాజెక్టుకు శత్రువులు కాదు. మీరు పొరుగు దేశంతో యుద్ధం చేయబోవడం లేదు. ప్రజలను భాగస్వాములను చేసుకోండి. ఇందులో వారికి కూడా ప్రయోజనం ఉంటుందని చెప్పండి, ప్రయోజనం ఉండేట్టు చూడండి. అధికారులను ఇళ్లపైకి తోలి భయపెట్టకండి. ఆత్మహత్యలకు, గుండెపోట్లకు ఆస్కారం ఇవ్వకండి. మూసీ లాంటివారే జనం కూడా. దారులు మూస్తే, ముంచేస్తారు!

చేయాలి. మూసీని బాగుచేయాలి. ముక్కులు తెరుచుకునే లాగా, కళ్లకు పండగ లాగా చేయాలి. దాని దారి నిండా నీళ్ల పరవళ్లు తొక్కాలి. రెండు పక్కలా చెట్లు బారులు తీరాలి. పడవల మీద విహరించాలి. అలసిన మనసుల సాయంత్రాలన్నీ అక్కడ సేదతీరాలి. ఇటువంటి కలలన్నీ కేసీఆర్‌కూ, రేవంత్‌రెడ్డికి మాత్రమే ఉండవు. హైదరాబాద్ ఇల్లైనవారందరికీ, ఇష్టపడేవారందరికీ అవే కలలు. కానీ, ఈ కలల్ని ఝుళిపించి, జీవితాలను కకావికలం చేయబోయే ముందు అధికారపక్షాలు, ప్రతిపక్షాలు అన్నీ కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి!

ఈ నగరాన్ని వికృతపరచిందెవరు? నిందలు వేస్తున్నది ఎవరిమీద? నట్టింట్లో చెరువు తిష్ఠ వేయాలని ఎవరికి ఉంటుంది? ఒకనాటి వేల చెరువులు ఏమయ్యాయి? దయలేని వ్యవస్థ, మెతుకు కోసం అవస్థ కాకపోతే, మురికిగుంటగా మారిన ముచికుంద కడుపులో ఎవరు మాత్రం ఎందుకు తలదాచుకుంటారు? ప్రియురాలిని చూడడానికి వెళ్లే రాకుమారుడిని ఉక్కిరిబిక్కిరి చేసి వంతెన కట్టించిన అలనాటి మూసీ ప్రవాహం ఏది? నదిని చేపల్లాగా, ఈ నగరాన్ని మనుషులతో నింపమని కులీ కుతుబ్ షా దేవుణ్ణి ప్రార్థించాడు కదా, మరి నదిని కొరుక్కుతింటున్న ఈ తిమింగలాలు ఎక్కడివి? వాటిని ఎవరు కాపాడుతున్నారు?

మూసీ కేవలం హైదరాబాద్‌దే కాదు. ఇప్పుడు దామగుండం నేవీ రాడార్‌తో పచ్చదనాన్ని రాల్చుకోబోతున్న అనంతగిరి కొండల్లో పుట్టి, తెలంగాణ సరిహద్దులో వాడపల్లి దగ్గర కలిసే కృష్ణ దాకా దీనిది చాలా పెద్ద ప్రయాణం. నగరంలోకి అమాయకంగా, స్వచ్ఛంగా వచ్చిన మూసీ, విషతుల్యమై, పాషాణప్రాయమై, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లోకి ప్రవహిస్తుంది. మూసీ నీటితో ఆ జిల్లాల్లో 64 చెరువులు నిండుతాయట. ఈ నదీ ప్రక్షాళన నగరవాసులకే కాదు, ఆ జిల్లాల్లోని రైతాంగానికి చాలా అవసరం. కానీ ఈ మంచి పనిని మనుషులను వెళ్లగొట్టడంతో, ఇళ్లు కూలగొట్టడంతో ఎందుకు ప్రారంభిస్తున్నారు? అలీబాబా నలభై దొంగల లాగా, ఇళ్ల మీద ఎర్ర గుర్తులెందుకు పెడుతున్నారు? మురికి మూలం ఎక్కడో గుర్తించడంతో మొదలు పెట్టాలి కదా, మనుషులతో మాట్లాడడంతో మొదలు పెట్టాలి కదా?

మూసీ మీద జరిగిన అఘాయిత్యాలలో ముఖ్యమైనది దాని ప్రారంభ కేచ్‌మెంట్ ఏరియాలో నియంత్రణ లేని నిర్మాణాలు. న్యాయస్థానం కల్పించుకుని 111 జీవో ద్వారా రక్షణ కల్పించినప్పటినుంచి, దాన్ని ఎట్లా ఎత్తివేద్దామా అని ఆలోచిస్తూ వస్తున్న నేతలు. అసలు మూసీకి క్యాచ్‌మెంట్ ఎందుకు, ఆ అవసరాన్ని తీసేస్తే, 111 కూడా తీసేయవచ్చును కదా అన్న ఆలోచన బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చింది. మూసీ పునరుద్ధరణ, ప్రక్షాళన ఆలోచన ఆ ప్రభుత్వానిదే. కానీ, తరువాత దాన్ని కాళేశ్వరం గొలుసు జలాశయాలతో ముడిపెట్టారు. కేశవాపూర్ చెరువు నుంచి ఉస్మాన్, హిమాయత్ సాగర్‌లకు నీరు తరలిస్తే, ఈ క్యాచ్‌మెంట్ గొడవ ఉండదని, 111 పీడ విరగడ అవుతుందని ఆలోచన. నోబెల్ బహుమతి ఇవ్వదగ్గ గొప్ప ఆలోచన! మూసీని నలువైపులా మూసేసి, కేశవాపూర్ పైపులతో నీరు నింపవచ్చు, క్యాచ్‌మెంట్ ఏరియా అంతటా యథేచ్ఛగా రియలెస్టేట్‌ను వర్ధిల్లచేస్తే, హైదరాబాద్ జంట జలాశయాలు నియంత్రిత వ్యవస్థలు అవుతాయి, సమస్యలు ఏవీ ఉండవు అన్నది ఆ ఆలోచనకు వివరణ. కానీ, నీటికి జ్ఞాపకశక్తి అమోఘం. దారులు మూసేసినప్పుడే కదా అది వెల్లువయ్యేది. క్యాచ్‌మెంట్ ఏరియా అంతటా అరాచకంగా భవనాలు నిర్మిస్తే, కొండల్లో పుట్టిన నీరు ఎక్కడికి పోతుంది? ఏ దారీ లేకపోతే ఫోర్త్ సిటీకి పోతుంది. ప్రమాదం బదిలీ అవుతుంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ప్రభుత్వం వారూ, ముందు కాస్త ఆగి, ఊపిరి పీల్చుకోండి. ఏదో మునిగిపోతున్నట్టు కొంపలు కూల్చే కార్యక్రమం చేయడం కాకుండా, మొత్తం విషయాన్ని స్థిమితంగా ఆలోచించడంతో పని మొదలుపెట్టాలి. రివర్ బెడ్ అని మీరు సక్రమంగా గుర్తించిన ప్రాంతంలో ఉన్నవారి విషయంలో ఏ చర్యా తీసుకోకుండా నిలిపివేయండి. మీరు తక్కిన అన్ని పనులూ చేసి, మూసీలో మంచినీరు ప్రవహించే రోజున వారిని, అవసరమైతే మాత్రమే, తగిన న్యాయ పరిహారంతో తరలించండి. ఎన్నికల సమయంలో ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని వాగ్దానం చేశారు కదా, ఆ విలువలో భాగంగా, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి. నిపుణులతో, ప్రజాకార్యకర్తలతో, మేధావులతో మాట్లాడండి. నది వెంట ఉన్నవారు, నదితో ముడిపడినవారు, నగరానికి వెలుపల నది లబ్ధిదారులు అందరితో విస్తృత స్థాయిలో సంప్రదింపుల ప్రక్రియ చేపట్టండి. నిర్వాసితులయ్యేవారు కానీ, ఏదో రకంగా ఎంతో కొంత కోల్పోయేవారిని గుర్తించి, వారి సామాజికార్థిక సమాచారాన్ని సేకరించి, క్రోడీకరించండి. వృత్తి ఆక్రమణదారులతో కఠినంగా ఉండండి. పలుకుబడి, ధనమదంతో ఉల్లంఘనలకు పాల్పడేవారితో నిర్దాక్షిణ్యంగా వ్యవహరించండి. మూసీ నదీగర్భం, బఫర్ జోన్‌కు సంబంధించిన పటాలను, ప్రాజెక్టు పూర్తి నివేదికను, ప్రభుత్వం వారి ఇతర ఆలోచనలను బహిరంగపరచి, చర్చకు ఆహ్వానించండి. ఏదీ దాపరికంతో చేయకండి. ఏదైనా అంతర్జాతీయ లేదా విదేశీ ఆర్థిక సంస్థ గనుక ప్రభుత్వం మీద కూల్చివేతలకు ఒత్తిడి చేస్తుంటే ఆ విషయం కూడా ప్రజలకు చెప్పండి, అనుమానాలకు, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకండి. ఈ సుందరీకరణ ప్రాజెక్టుకు ఖర్చు ఎంత పెట్టగలరో ముందే ఒక అవగాహన ఏర్పరచుకుని, ఆ తరువాత పరిహార, పునరావాస కల్పనల గురించి ఆలోచించండి. మీరు చెబుతున్న ప్రకారం మూసీకి ఇరుపక్కలా ఉన్న నివాస భవనాలను భూసేకరణ పరిధిలోకి తీసుకువస్తే, లక్షా యాభైవేల కోట్లు ఏ మూలకూ సరిపోవు. గణితం బాగా తెలిసిన అధికారులను, కన్సల్టెంట్‌లను నియమించుకోండి.


> ఈ మంచి పనిని మనుషులను వెళ్లగొట్టడంతో, ఇళ్లు కూలగొట్టడంతో ఎందుకు ప్రారంభిస్తున్నారు? అలీబాబా నలభై దొంగలలాగా, ఇళ్ల మీద ఎర్ర గుర్తులెందుకు పెడుతున్నారు? మురికి మూలం ఎక్కడో గుర్తించడంతో మొదలు పెట్టాలి కదా, మనుషులతో మాట్లాడడంతో మొదలు పెట్టాలి కదా?

అన్నిటికంటె ముందు ప్రభుత్వం గ్రహించవలసింది, ప్రజలు ఈ ప్రాజెక్టుకు శత్రువులు కాదు. మీరు పొరుగు దేశంతో యుద్ధం చేయబోవడం లేదు. ప్రజలను భాగస్వాములను చేసుకోండి. ఇందులో వారికి కూడా ప్రయోజనం ఉంటుందని చెప్పండి, ప్రయోజనం ఉండేట్టు చూడండి. అధికారులను ఇళ్లపైకి తోలి భయపెట్టకండి. ఆత్మహత్యలకు, గుండెపోట్లకు ఆస్కారం ఇవ్వకండి. మూసీ లాంటివారే జనం కూడా. దారులు మూస్తే, ముంచేస్తారు!

అజ్ఞానం కాదు, హిపోక్రసీ!

ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా “2026 కల్లా మావోయిస్టులను ఏరిపారేస్తాం’ అన్న మాటకు వ్యతిరేకంగా సీపీఐ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ‘మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా?’ అంటూ ఆంధ్రజ్యోతిలో (సెప్టెంబర్ 24) రాసిన వ్యాసం చూస్తే నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. మొత్తం పార్టీని పణంగా పెట్టి గెల్చుకున్న ఆ ఒక్క సీటుకే ఇక్కడేదో రష్యా విప్లవం వచ్చినట్లు ఈ కమ్యూనిస్టు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇక్కడ కార్ల్ మార్క్స్, మావో సేటుంగ్ వంటివారి ఆత్మలన్నీ లేచి కూర్చున్నాయి.

‘ప్రశ్నించే గొంతులు’ అంటూ సాంబశివరావు మోకాలికీ, బోడిగుండుకూ లంకె పెట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలు తుపాకీ గొట్టంలో ఉండవని ఆయనకు తెలియనిదా? నిజానికి నక్సలిజం, పీపుల్స్‌వార్ పుట్టిన, పెరిగిన నాటి పరిస్థితులు ఇప్పుడు ఈ దేశంలో లేవు. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో దేశం ముందుకు దూసుకుపోతోంది. వ్యవస్థలోని లోపాలను సరిచేయకుండా కొందరు యుద్ధానికి సిద్ధం అంటున్నారు. భిన్న సంస్కృతులు, అనేక విశేషాలు గల భారతదేశంలో మనమున్న ఈ సమాజంలో మావోయిజం నడుస్తుందా? మావో పుట్టిన చైనా ఇవాళ అన్ని సిద్ధాంతాలను పక్కన బెట్టి ప్రత్యామ్నాయ అభివృద్ధిలో దూసుకుపోతోంది.



> ఎందరో పార్లమెంటేరియన్ల గురించి చెప్పిన కూనంనేని సాంబశివరావు ఇప్పుడు మావోయిస్టులను కూడా ఆ పార్లమెంటుకు రమ్మని చెప్పాలి. అడవిలో ఉండి, దేశంపై తిరగబడతాం అంటే సాధ్యపడదు. రష్యాలో స్టాలిన్ కూడా మొదట తన దేశ జాతీయవాదం, తరువాతే కమ్యూనిజం కావాలన్నాడు.

మన దేశంలో దండకారణ్యంలో మిగిలిన దళిత, బహుజన కులాలకు చెందిన మావోయిస్టులు మరణించడమో, లొంగిపోవడమో, పోలీసు బలగాలను దెబ్బ తీయడమో చూస్తాం. కానీ మహానగరాల్లో కూర్చొని అడవిలోని వాళ్ళను రెచ్చగొడుతున్న ఈ అర్బన్ నక్సల్స్ గురించి మనం ఆలోచించడం మానేశాం. నగరాల్లో కూర్చొని స్వయంప్రకటిత మేధావులుగా చలామణి అవుతూ, మావోయిజం వ్యాప్తిచేస్తున్న వాళ్ళ మీద ఊపా కేసులు పెట్టారని సాంబశివరావు బాధపడటం అజ్ఞానమా, అమాయకత్వమా? ఊపా భారత రాజ్యాంగం ద్వారా వచ్చింది అన్న విషయం రోజూ రాజ్యాంగం పట్టుకుతిరిగే వాళ్ళను అడిగితే చెప్తారు కదా! అమాయకులను అరణ్యంలోకి పంపి 1980 నుంచి 2005 వరకు తెలుగు ప్రాంతాల్లోనే ఎన్నో ప్రాణాలు గాల్లో కలిపిన మేధోవర్గం కుటుంబాల్లో ఒక్కరి కుమారుడైనా మరణించాడా?

వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చర్చల పేరిట అడవుల్లోని అన్నలను హైదరాబాద్‌కు పిలిపించారు. వాళ్ళ ముఖాలను టీవీలు, పత్రికల ద్వారా లోకానికి తెలిపి వాళ్ళకు నిలువనీడ లేకుండా చేశారు. ఆ తర్వాత ఎన్‌కౌంటర్లలో ఎందరో నక్సల్స్ మరణించారు. కానీ రోజూ పేపర్లలో వచ్చే వ్యాసాలు, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోనూ, అప్పుడప్పుడూ ప్రెస్ క్లబ్‌లలోనూ జరిగే కార్యక్రమాలు చూస్తే మనం ఉన్నది మావోయిస్టుల రాజ్యంలోనేనేమో అన్న అనుమానం కలుగుతుంది. ఈ మహానగర మావోయిస్టులంతా గుబురు గడ్డాలు పెంచుకొని, రీడింగ్ గ్లాసెస్ పెట్టుకొని విశ్వవిద్యాలయాల్లో మేధావుల్లా నటిస్తూ దేశ వ్యతిరేక చర్యలకు ఆజ్యం పోస్తున్నారు. మావోయిస్టులతో సంబంధాలున్న నేరంపై గతంలో అరెస్టయిన జి.ఎన్.సాయిబాబా సన్నిహితుడు రోనా విల్సన్ గురించి విన్నాక దేశం నివ్వెరపోయింది. మావోయిస్టులకు సంబంధించి పట్టణ, అటవీ ప్రాంతాలు, అంతర్జాతీయ నెట్‌వర్క్ సమన్వయం చేసే బాధ్యతను ఈ రోనా విల్సన్ చూడడం వెనుక ఏ కుట్ర దాగి ఉందో చెప్పలేం.

ప్రతి రోజూ కమ్యూనిస్టులంతా ‘మతతత్వంపై మా పోరాటం’ అంటారు. వీళ్ళు ముస్లిం లీగ్, మజ్లిస్, ఆజాంఖాన్‌ల మతతత్వంపై ఎన్నడూ పోరాటం చేయరు. వాళ్ళ కార్యవర్గాల్లో బహుజనులకు స్థానం ఉండదు. నంబూద్రిపాద్ మొదలుకొని కూనంనేని సాంబశివరావు వరకు ఒకే సామాజిక వర్గం వారు అధిష్ఠానాల్లో ఉంటుంటారు. అంతెందుకు– తెలుగునాట ‘కామ్రేడ్’లు అంతా ఎవరో ఈ ‘కామ్రేడ్’ పదం విడదీస్తే తెలుసుకోవచ్చు. అమరుల కుటుంబాల చావుడప్పుల వద్ద పిడికిలి బిగించి లాల్‌సలాం చెప్పే వరవరరావు ఎవరు? దున్నేవాడిదే భూమి అని గద్దర్ అద్భుతంగా గానం చేశాడు. ‘ఊరు మనదిరా ఈ వాడ మనదిరా’ పాటను గొప్పగా ప్రచారం చేశాడు. ‘దొర ఏందిరో వాని పీకుడేందిరో’ అని కాలికి గజ్జెకట్టి గంతేసాడు. కానీ ఇంటి ప్రక్కనున్న ‘దొరను’ అంతే గొప్పగా గౌరవించాడు. ఆయనపై పన్నెత్తుమాట పాట పాడలేదు. కాలెత్తి గజ్జె కదపలేదు. ఆయన భూమిలో ఎర్రజెండా పాతలేదు. ఆఖరుకు తన కుమారుడు కాంగ్రెస్‌లో చేరుతుంటే ఆపలేదు. జీవితాంతం కాంగ్రెస్ చేసిన ఎన్‌కౌంటర్లు కళ్ళారా చూసిన గద్దర్ చివరికి కాంగ్రెస్ పార్టీకి ప్రీతిపాత్రుడవటం మహా ఆశ్చర్యం! ఇదంతా ఎటువంటి మావోయిజమో సాంబశివరావు చెప్పాలి.

టీవీల్లో, సామాజిక మాధ్యమాల్లో చెలరేగిపోతున్న హిందూమత వ్యతిరేకుల వెనుక ఉన్నది ఈ మహానగర మావోయిస్టులే! ఇపుడు తుపాకులతో, తూటాలతో సాధ్యం కావడం లేదు కాబట్టి విద్యార్థుల మనసుల్లో విషబీజాలు నాటుతున్నారు. అఫ్జల్‌గురులను, యాకూబ్‌మెమన్‌లను ఆరాధించే కన్హయ్య కుమార్, ఉమర్ ఖలీద్, షెహ్లా రషీద్‌లను ఈ అర్బన్ నక్సల్స్ సృష్టిస్తున్నారు. ‘అధికారాన్ని ఆక్రమించు’ అన్న స్టాలిన్ మాటలను ఈ గ్యాంగుల వెనుక ఉన్న పెద్దలు ప్రోత్సహిస్తున్నారు. కుల తత్వాన్ని సమన్వయంతో కాకుండా సంఘర్షణతో ఎదుర్కోవాలని రెచ్చగొడుతున్నారు.

ఎందరో పార్లమెంటేరియన్ల గురించి చెప్పిన కూనంనేని ఇప్పుడు మావోయిస్టులను కూడా ఆ పార్లమెంటుకు రమ్మని చెప్పాలి. అడవిలో ఉండి, దేశంపై తిరగబడతాం అంటే ఏ దేశంలోనూ సాధ్యపడదు. రష్యాలో స్టాలిన్ కూడా మొదట తన దేశ జాతీయవాదం, తరువాతే కమ్యూనిజం కావాలన్నాడు. దేశంపై తిరగబడి ప్రజాస్వామ్యం పాటించిన నాయకుల పేర్లు ఉదహరించడం కూనంనేనికే చెల్లింది. పార్టీలు, ప్రభుత్వాలు ఓట్ల కక్కుర్తితో ఈ మేధో ఉగ్రవాదాన్ని చూసీ చూడనట్లు వదిలేస్తే అది భస్మాసుర హస్తం కావడం ఖాయం.

• పి. భాస్కరయోగి

ఇన్ని సంఘాలు అవసరమా?

ప్రభుత్వంలోని వివిధ శాఖల ఉద్యోగుల హక్కులు, బాధ్యతల కోసం అనేక సంఘాలు ఏర్పాటయ్యాయి. ఈ సంఘాలకు ప్రభుత్వం గుర్తింపు నిచ్చి, నాయకులకు అవసరాల రీత్యా చట్టబద్ధంగా ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. ఈ సంఘాలు అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా చేస్తున్నాయి. ఉదాహరణకు ఒక ఉపాధ్యాయ వ్యవస్థను తీసుకుంటే ఇందులో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 నుంచి 40 వరకు సంఘాలున్నాయి. ఇన్ని సంఘాలు అవసరమా? జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో కొన్ని అంశాల మీద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేదా కార్యదర్శి స్థాయి అధికారులు సమావేశాలు ఏర్పాటు చేస్తే వందలాది నాయకులు హాజరవుతున్నారు. ఇంతమంది అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అమలుపరచాలంటే అది సాధ్యమేనా? అలాగే కొన్ని సంఘాలకు ప్రాతినిధ్యం వహించే నాయకులు ప్రత్యక్షంగా కొన్ని రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఉద్యోగుల మనోభావాలను అస్సలు పట్టించుకోని సందర్భాలు కూడా ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం కచ్చితంగా ఉద్యోగ ఉపాధ్యాయుల అధికారిక సంఘం కోసం ఆ సంఘ సభ్యుల చేత ఎన్నిక నిర్వహించి సంఘాన్ని ప్రజాస్వామ్యయుతంగా తీర్చిదిద్దాలి. అప్పుడు ప్రతి వ్యవస్థలోను ఒకే ఒక సంఘం ఉంటుంది. ప్రభుత్వం కూడా వారితో చర్చలు జరిపి, విధానపరమైన నిర్ణయాలు సులభంగా తీసుకోవచ్చు. అంతేకాక అవాంఛనీయ భావజాలంతో ఏర్పడుతున్న సంఘాలను నియంత్రించవచ్చు.

– తరిగోపుల నారాయణస్వామి

రాజ్యాంగ సంస్థగా గ్రామసభ

పంచాయతీరాజ్- జిల్లాపరిషత్, మండల ప్రజాపరిషత్, గ్రామ పంచాయతీలతో కూడిన మూడంచెల నిర్మాణం. గ్రామ పంచాయతీని గ్రామసభ, న్యాయ పంచాయతీలుగా విభజించారు. పంచాయతీరాజ్ వ్యవస్థను ‘73వ రాజ్యాంగ సవరణ చట్టం–1992’ ద్వారా రాజ్యాంగబద్ధం చేశారు, ఇది ఏప్రిల్ 24, 1993 నుంచి అమలులోకి వచ్చింది. కేంద్రప్రభుత్వం ఆదేశాలను అనుసరించి సంవత్సరంలో నాలుగుసార్లు అంటే (1) జనవరి 26, (2) ఏప్రిల్ 14, (3) జూలై ఒకటి, (4) అక్టోబరు 3 తేదీలలో గ్రామసభలను నిర్వహించడానికి పంచాయతీరాజ్ కమిషనరు ఆదేశాలు జారీ చేశారు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(ఎ) ప్రకారం రాష్ట్ర శాసన సభల ద్వారా కొన్ని చట్టబద్ధమైన అధికారాలు గ్రామసభకు కల్పించారు. APPR చట్టం 1994లోని సెక్షన్లు 45, 161, 192 ద్వారా కొన్ని నిర్దిష్ట విధులు పంచాయతీరాజ్‌కు అప్పగించారు. అందువల్ల గ్రామ సభ ఒక రాజ్యాంగ సంస్థ, స్థానిక పరిపాలన వ్యవస్థలో ప్రాథమిక ప్రజాస్వామ్య కేంద్రం. గ్రామ అభివృద్ధి, వికేంద్రీకృత ప్రణాళిక ప్రాథమిక వేదికగా గ్రామసభ పనిచేస్తుంది. ప్రజల భాగస్వామ్యం, వివిధ అభివృద్ధి కార్యకలాపాల పర్యవేక్షణను నిర్వహిస్తుంది. సంబంధిత గ్రామానికి సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తుంది. పంచాయతీరాజ్ సంస్థల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తుంది. అట్టడుగు స్థాయిలో అనుబంధ విభాగాల మధ్యన సముచితమైన, ప్రభావవంతమైన పాత్రను పోషిస్తుంది. గ్రామాల పరిధికి చెందిన వివిధ ప్రభుత్వ విభాగాలు/ సంస్థలు, పంచాయతీరాజ్ సంస్థలు చేపట్టిన కార్యకలాపాల సామాజిక ఆడిట్‌ను నిర్వహించడానికి గ్రామస్థాయిలో గ్రామసభే నిజమైన వేదిక. ఈ విధంగా పారదర్శకత, జవాబుదారీతనం, ఏకీకరణలకు గ్రామ సభ సరైన వేదికగా ఉంటూ సామాజిక, ఆర్థిక, సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తోంది. గ్రామపంచాయతీ సర్పంచుల ఎన్నిక పార్టీ రహితంగా జరుగుతుంది. అందుకే గ్రామపంచాయతీ లబ్ధిదారుల ఎంపికను గ్రామసభ ద్వారా నిర్వహించడానికి గ్రామపంచాయతీలకు ప్రాధాన్యం ఇచ్చారు.

గ్రామసభలలో చర్చించాల్సిన అంశాలు ఏమిటంటే- ఖాతాల వార్షిక ప్రకటన, ఆడిట్ నివేదిక, మునుపటి సంవత్సర పరిపాలనకు చెందిన నివేదిక, ప్రస్తుత సంవత్సరానికి చెందిన కార్యక్రమాల వివరాలు, బడ్జెట్ లేదా వార్షిక కార్యక్రమం ద్వారా గుర్తింపబడని ఏదైనా కొత్త కార్యక్రమం, తాజా పన్నులు లేదా ఇప్పటికే ఉన్న పన్నుల పెంపు ప్రతిపాదనలు, పథకాలు, లబ్ధిదారులు, ప్రదేశాల ఎంపిక. వీటితో పాటు పంచాయతీ పరిధిలోని అన్ని స్థిర, చరాస్తుల వివరాల పట్టికలు, గ్రామ పంచాయతీ ఆమోదించిన బడ్జెట్ అంచనాల కాపీ; గ్రామ పంచాయతీ ఖాతాలపై ఆడిట్ నివేదిక కాపీ; పన్నులు, చెల్లించాల్సిన ఫీజుల బకాయిల్లో ఉన్న ఎగవేతదారుల జాబితా; గ్రామ పంచాయతీలో జరిగే నాలుగు గ్రామ సభలకు ఆయా సంబంధిత విభాగాల గ్రామస్థాయి/క్షేత్రస్థాయి సిబ్బంది సమాచారాన్ని అందించాలి. రాష్ట్రంలోని 13,321 గ్రామ పంచాయతీలు గ్రామసభను నిర్వహించాలి. అక్టోబర్ 3వ తేదీ గ్రామసభ లబ్ధిదారుల కార్యక్రమాల అమలులో పురోగతిపై సమీక్షా కార్యక్రమాలు; చేపట్టిన ప్రజా పనుల నివేదిక; సామాజిక-ఆర్థిక పురోగతి నివేదికలు నేరుగా అందించబడిన సేవల సమీక్ష, వివిధ అంశాల పట్ల దిద్దుబాట్లు ఏదైనా ఉంటే అవన్నీ చర్చించి, నిర్ణయాలు తీసుకుంటారు. అయితే గ్రామసభలు అంత స్ఫూర్తిదాయకంగా నిర్వహించడం లేదన్నది వాస్తవం. గ్రామపంచాయతీ సభలలో కోరం ఎలా పాటిస్తారో అదేవిధంగా గ్రామసభల్లో కూడా కోరం పాటించాలని నిబంధన లేకపోవడం వల్ల సర్పంచ్‌లు తమకు అనుకూలమైన ప్రజలను తీసుకొచ్చి గ్రామసభ నిర్వహిస్తున్నారు. దీంతో వాటికి ప్రాధాన్యం లేకుండా పోయింది.

> 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు వెంటనే పంచాయతీలకు జమ అయ్యేట్లు చర్యలు తీసుకోవాలి. పంచాయతీకి సంబంధించిన నిధుల జమ, ఖర్చు వివరాలను ఆన్‌లైన్ ద్వారా జరిగేట్లు తక్షణ చర్యలు తీసుకోవాలి. గ్రామ పంచాయతీ పరిధిలోకి గ్రామ సచివాలయం, వాలంటరీ వ్యవస్థను తీసుకురావాలి. స్థానిక సంస్థల్లో నిధుల వినియోగంలో జరిగే అవినీతిని నియంత్రించడానికి అంబుడ్స్‌మెన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలి. పంచాయతీ విభాగం అధికార వ్యవస్థను పటిష్ఠం చేయాలి.



గ్రామసభకు సకాలంలో సంబంధిత శాఖల క్షేత్రస్థాయి విధి నిర్వాహకులు అవసరమైన సమాచారాన్ని కనీసం ఒక వారం ముందుగా సంబంధిత పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలి. సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులు కూడా సమాచారాన్ని గ్రామసభకు సకాలంలో సమర్పించేలా చూడాలి. పంచాయతీ కార్యదర్శి మొత్తం సమాచారాన్ని సంచితపరచి, గ్రామసభ సభ్యులకు పంపాలి. డాక్యుమెంటేషన్‌లో భాగంగా గ్రామసభ ప్రొసిడింగుల వీడియో గ్రాఫ్ కోసం పంచాయతీ కార్యదర్శి ఏర్పాటు చేయాలి. గ్రామసభ ఫొటోగ్రాఫ్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎవరైనా సంబంధిత క్షేత్రస్థాయి విధి నిర్వాహకుడు గ్రామసభకు హాజరు కానట్లయితే, ఆ మేరకు గ్రామసభ తీర్మానాన్ని సంబంధిత శాఖ విభాగాధికారికి పంపాలి. ఆ శాఖ గ్రామసభ తీర్మానంపై తీసుకున్న చర్యని జిల్లా కలెక్టరుకు తెలుపుతూ గ్రామపంచాయతీకి సమర్పించాలి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 23న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలుకు సంబంధించిన గ్రామసభ 13,326 గ్రామపంచాయతీలలో ఒకేరోజు విజయవంతంగా నిర్వహించారు. ప్రపంచ రికార్డ్స్ యూనియన్ మేనేజర్ క్రిస్టఫర్ టైలర్ క్రాఫ్ట్ ప్రపంచ గుర్తింపు ధ్రువపత్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్‌కి అందజేశారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇది ఒక సువర్ణాధ్యాయం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి అభివృద్ధి మొదలుకావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటికే పంచాయతీరాజ్ సంస్థల అభివృద్ధి కోసం కేంద్రం నుంచి 400 కోట్ల రూపాయలు ఉపాధి హామీ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు 1987 కోట్లు వచ్చాయి. అంతేకాక 2027 నాటికి జలజీవన్ మిషన్ ద్వారా 95.4 లక్షలు మేరకు కుళాయిల ద్వారా రక్షిత నీరు సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం ద్వారా 215.8 కోట్లు ఇవ్వటానికి ఆమోదం తెలిపింది. నేటి ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్ఠత, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం కోసం అన్ని రకాల చర్యలు తీసుకురావాలని ఆసక్తి చూపించడం ముదావహం.

పంచాయతీరాజ్ చాంబర్ సర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ కేంద్రమంత్రిని కలిసి ఉపాధి హామీ నిధులను 90:10 నిష్పత్తిలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవడానికి అవకాశం కల్పించవలసిందిగా కోరింది. ఉపాధి హామీ కూలీలను గ్రామపంచాయతీకి అనుసంధానం చేసి గ్రామాల పరిశుభ్రతకు అవకాశం కల్పించాలని కోరింది. ఉపాధి హామీ సిబ్బందిని మండల పరిషత్, గ్రామ పంచాయతీ ఆధీనంలో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కూడా కోరింది. రాజ్యాంగ వ్యతిరేకంగా, చట్ట వ్యతిరేకంగా గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేసి, ఆ వ్యవస్థను గ్రామ పంచాయతీల, సర్పంచ్‌ల ఆధీనంలోకి తీసుకువచ్చి, ప్రజలకు ఉపయోగపడే విధంగా వ్యవస్థను రూపకల్పన చేయాలని; సచివాలయ వ్యవస్థ పునర్నిర్మాణం కోసం అధ్యయన కమిటీని ఏర్పాటు చేయాలని; వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి.


15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు వెంటనే పంచాయతీలకు జమ అయ్యేట్లు చర్యలు తీసుకోవాలి. పంచాయతీకి సంబంధించిన నిధుల జమ, ఖర్చు వివరాలను ఆన్‌లైన్ ద్వారా జరిగేట్లు తక్షణ చర్యలు తీసుకోవాలి. గ్రామ పంచాయతీ పరిధిలోకి గ్రామ సచివాలయం, వాలంటరీ వ్యవస్థను తీసుకురావాలి. స్థానిక సంస్థల్లో నిధుల వినియోగంలో జరిగే అవినీతిని నియంత్రించడానికి అంబుడ్స్‌మెన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలి. పంచాయతీ విభాగం అధికార వ్యవస్థను పటిష్ఠం చేయాలి. ఇ-పంచాయతీ కార్యక్రమం అన్ని జిల్లాల్లో అమలు చేయబడుతూ, ఇ-పంచాయతీ, నివాస స్కోరు కార్డ్ అనువర్తనాల మధ్య సంధానత ఉండేలా చర్యలు తీసుకోవాలి. అందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమ్యూనికేషన్స్ విభాగాన్ని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేయాలి. తద్వారా గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యానికి నిజమైన పునాది వేసినట్టు అవుతుంది.

■ టిఎంబి బుచ్చిరాజు
చైర్మన్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వెల్ఫేర్ ట్రస్ట్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



నేటి అలంకారం
శ్రీబాలాత్రిపురసుందరీదేవి



ఇంద్రలోకమా..
శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విద్యుత్ వెలుగులతో మెరిసిపోతున్న ఇంద్రకీలాద్రి..

ఏ విశ్వచైతన్యం సృష్టి అంతా నిండి ఉందో.. సకల చరాచర జగత్తు ఏ శక్తి నుంచి ఆవిర్భవిస్తుందో.. ప్రాణికోటి జీవానికి మూలరూపం ఏమిటో.. ఆవిర్భావం, అంతానికి మధ్యలో చైతన్యమంతా ఎక్కడ నిక్షిప్తమై ఉందో.. ఆమే శక్తి.. పరాశక్తి.. పదిరోజుల పాటు జరిగే శరన్నవరాత్రి వేడుకల్లో భక్తులను కటాక్షించేందుకు సిద్ధమైంది. దశావతారాల్లో అమ్మ దివ్యమంగళ స్వరూపాలను వీక్షించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తజనం తరలిరానుండగా, ఉత్సవ వెలుగులతో ఇంద్రకీలాద్రి అపర కైలాసక్షేత్రమై ఆహ్వానం పలుకుతోంది.





అంబరమై..

ఇంద్రకీలాద్రిపై నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- తొలిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మ దర్శనం
- నేటి ఉదయం 9 గంటల నుంచి దర్శనానికి అనుమతి
- కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లు
- నివేదనల కోసం మొత్తం ఆరుసార్లు దర్శనానికి బ్రేక్
- ప్రతిసారీ సుమారు అరగంటకుపైగానే నిలుపుదల
- కనకదుర్గానగర్‌లోనే అన్నదానం, ప్రసాదాలు

ఉత్సవకాంతులతో వెలిగిపోతున్న ఆలయ ప్రాంగణం



దుర్గాఘాట్‌లో నవహారతులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వంసిద్ధమైంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి గడియలు ప్రవేశించగానే ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. పది రోజుల పాటు అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఇంద్రకీలాద్రిని విద్యుత్ వెలుగులతో మరింత అందంగా ముస్తాబు చేశారు. ప్రధానాలయం పరిసర ప్రదేశాలను వివిధ రకాల పూలతో అలంకరించారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు. గత ఏడాది తొలిరోజు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, ఈ ఏడాది ఆ సంఖ్య 75-80 వేల వరకు వెళ్తుందని అంచనా. ముఖ్యంగా విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని తొలిరోజు ఎక్కువగా దర్శించుకుంటారు. సాధారణ భక్తులు వినాయకుడి ఆలయం నుంచి ఉన్న మూడు క్యూల్లో ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి వెళ్లాలి. ఓం మలుపు వద్ద ఈ మూడు క్యూలు ఐదుగా మారతాయి. వాటిలో ఒకటి రూ.500, వీఐపీ కోటాలో వచ్చిన వారికి, మరొకటి రూ.300, ఇంకొకటి రూ.100 భక్తులకు కేటాయించారు. మిగిలిన రెండు క్యూల్లో ఉచిత దర్శనం భక్తులు వెళ్లాల్సి ఉంటుంది.

ఆరుసార్లు దర్శనానికి బ్రేక్

తొలిరోజు మినహా మిగతా రోజుల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు. కాగా, రోజూ ఆరు వేర్వేరు సమయాల్లో దర్శనానికి బ్రేక్‌లు పడతాయి. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించే సమయాల్లో దర్శనానికి అనుమతించరు. ప్రతి నైవేద్యానికి 10-15 నిమిషాల సమయం పడుతుంది. మొత్తంగా అరగంట వరకు దర్శనం నిలుపుదల చేస్తారు. ఇక రోజూ సాయంత్రం అమ్మవారికి సమర్పించే మహానివేదన సందర్భంగా గంటపాటు దర్శనానికి బ్రేక్ ఇస్తారు.

నివేదనలు ఇలా..

రోజూ తెల్లవారుజామున 3 గంటలకు ఆలయం తెరిచాక అమ్మవారిని మేల్కొలుపుతారు. స్నపన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం అభిషేకం చేస్తారు. నివేదనగా అమ్మవారికి పాలను సమర్పిస్తారు. తర్వాత పరిమిత సంఖ్యలో ఉన్న అర్చకులు అమ్మవారిని అలంకరిస్తారు. ఈ కార్యక్రమాలు 6 గంటల వరకు సాగుతాయి. 7 గంటల వరకు అర్చన జరుగుతుంది. ఆ తర్వాత అమ్మవారికి పులిహోర, లడ్డూ, చక్రపొంగలి, బెల్లపు పొంగలి, శెనగలు నివేదనగా ఇస్తారు. దీని బాలభోగం అని వ్యవహరిస్తారు. దీనిని అమ్మవారికి సమర్పించే సమయంలో భక్తులను దర్శనానికి అనుమతించరు. తర్వాత 9 గంటలకు రాజభోగం సమర్పిస్తారు. అమ్మవారికి లడ్డూ, పులిహోర, రవ్వకేసరి, చక్రపొంగలిని నైవేద్యంగా పెడతారు. మధ్యాహ్నం 12-1 గంట మధ్యలో ప్రత్యేక నివేదన సమర్పిస్తారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు ప్రసాదాన్ని నివేదనగా పెడతారు. ఆయా సమయాల్లో 15 నిమిషాల పాటు దర్శనం ఆపుతారు. సాయంత్రం 6-7 గంటల మధ్య అమ్మవారికి మహానివేదన ఇస్తారు. ఇతర రోజుల్లో దీన్ని మధ్యాహ్నం 12 గంటలకు సమర్పిస్తారు. ఇది సమర్పించడానికి ముందు ప్రధాన ఆలయం పరిసర ప్రాంతాలను

- మిగతా 6లో

సీపీ పట్టువస్త్రాల సమర్పణ

దసరా మహోత్సవాల సందర్భంగా పోలీసు శాఖ తరఫున బుధవారం రాత్రి పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో పూజల అనంతరం సీపీ దంపతులు, ఇతర పోలీసు అధికారులు ఇంద్రకీలాద్రి చేరుకున్నారు. దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు వారికి స్వాగతం పలికి దర్శనం చేయించారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న సీపీ దంపతులు

దుర్గమ్మ భక్తులకు టెక్ సేవలు • అందుబాటులోకి దసరా యాప్ | దసరాకు 1,000 ఆర్టీసీ స్పెషల్స్ | నిబద్ధతతో పనిచేయండి • ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష | అన్ని ఏర్పాట్లు పూర్తి : ఈవో 6లో

హమ్మయ్య

చెత్తపన్ను రద్దుతో జిల్లావాసులకు ఊరట

- వైసీపీ హయాంలో బలవంతంగా విధింపు
- ఏడాదికి రూ.180 కోట్ల వసూలే లక్ష్యం
- ఒక్క వీఎంసీ నుంచే రూ.90 కోట్లు
- సీఎం చంద్రబాబు నిర్ణయంతో ఉపశమనం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో వేసిన చెత్తపన్నును రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనతో ఇరు జిల్లాల ప్రజలకు ఊరట లభించింది. ఈ రెండు జిల్లాల పరిధిలో ఏడాదికి సుమారు రూ.180 కోట్ల చెత్తపన్ను వసూలు లక్ష్యంగా, గత వైసీపీ ప్రభుత్వం భారాన్ని మోపింది. మురికివాడల్లో నివసించే వారిని, చిరువ్యాపారులను.. ఎవరినీ వదలకుండా వేసిన చెత్తపన్ను రద్దు ప్రకటనతో ఆయా వర్గాల్లో సంతోషం నెలకొంది.

సామాన్యులపై భారం పోయినట్టే..

రెండు జిల్లాల పరిధిలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు గుడివాడ, పెడన, ఉయ్యూరు, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు మునిసిపాలిటీల్లోని ఇళ్లపై 2021, అక్టోబరు నుంచి చెత్తపన్ను వసూళ్లు ప్రారంభించారు. ఏడాదికి రూ.180 కోట్ల ఆదాయాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిపై ప్రజలు, పౌరసంఘాల నుంచి తీవ్రస్థాయిలో నిరసనలు వెల్లువెత్తినా నాటి వైసీపీ ప్రభుత్వం బేఖాతరు చేసింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016ను అనుసరించి 2021, జూన్ నుంచి వీఎంసీ పరిధిలోని ఆరు మోడల్ వార్డుల నుంచి చెత్తపన్ను వసూలును ప్రారంభించారు. అక్టోబరు నుంచి విగిలిన అన్ని వార్డుల్లోనూ వసూళ్లు మొదలుపెట్టారు. ప్రతినెలా ఇంటి యజమానే కాకుండా అద్దెదారులు కూడా చెత్తపన్ను చెల్లించాలి. ఇళ్లు నాన్-స్లమ్ ఏరియా అయితే నెలకు రూ.120, స్లమ్ ఏరియా అయితే రూ.30 చెత్తపన్ను చెల్లించాలని అప్పట్లో నిర్ణయించారు. రోడ్డుపక్కన ఉండే ఫాస్ట్‌ఫుడ్, జ్యూస్ షాపులకు నెలకు రూ.300 చెల్లించాలనడంతో వారు గగ్గోలు పెట్టారు. చెల్లింపులు ఆలస్యమైతే జరిమానాగా రూ.15 వసూలు చేశారు. అప్పట్లో మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే వైసీపీ ప్రభుత్వం ఇలా వివిధ రకాల పన్నుల భారాన్ని విధించింది. తొలుత ఆస్తిపన్ను పెంచగా, ఆ తర్వాత చెత్తపన్ను విధించారు. అయితే, తాము అధికారంలోకి వస్తే చెత్తపన్ను రద్దు చేస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రద్దు చేస్తూ ప్రకటన చేశారు.

సున్నపురాయిపై రెవెన్యూ కవరింగ్

- మైనింగ్ మాఫియాకు సహకరించేలా ప్రకటనలు
- కలెక్టర్‌కు సమాచారం ఇవ్వకుండా తాత్సారం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొత్త మల్లవల్లిలో బయటపడిన సున్నపురాయి నిక్షేపాలపై స్థానిక రెవెన్యూ యంత్రాంగం మైనింగ్ మాఫియాకు సహకరించేలా వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. సర్వే నెంబర్ 165, 166లో 12 ఎకరాల విస్తీర్ణంలో బయటపడిన సున్నపురాయి నిక్షేపాలను మాఫియా తరలిస్తుండగా, అడ్డుకోవాల్సింది పోయి, ముందస్తు సమాచారం ఇచ్చేలా చేసి, యంత్రాలను ఖాళీ చేశాక రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లినట్టు తెలుస్తోంది. కళ్ల ముందు సున్నపురాయి నిక్షేపాలు కనిపించినా.. అవి సున్నపురాయి కాదని వాదించటం గమనార్హం. ఈ నిక్షేపాలకు సంబంధించి మైనింగ్ అధికారులకు, కలెక్టర్‌కు సమాచారం అందించాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. సంఘటనా స్థలంలో స్థానికులను విచారణ చేశామని, సాధారణ రాయి అని చెబుతున్నారని మీడియాతో అన్నారు. సున్నపురాయి గట్టిగా ఉంటుందని, ఇది అంత దృఢంగా లేదని చెబుతున్నారు. మైనింగ్ మాఫియాకు సహకరించేలా రెవెన్యూ అధికారుల వాదనలు ఉండటం గమనార్హం. మాఫియా కనుసన్నల్లో ఒక క్రషర్ కూడా పని చేస్తోంది. ఈ క్రషర్‌లోనే సున్నపురాయిని పొడి చేస్తున్నారు. ఈ క్రషర్‌వైపు రెవెన్యూ అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. మల్లవల్లిలోని ఓ ఫ్యాక్టరీకి ఈ సున్నపురాయి చేరుతోందని తెలుస్తోంది. దీనిపై రెవెన్యూ అధికారులు దృష్టిసారించకపోగా, మైనింగ్ మాఫియాకు సహకరించేలా వ్యవహరించటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

మచిలీపట్నానికి సీఎం చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. సుదీర్ఘకాలంగా ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న డ్రెయినేజీ, రహదారులు, డంపింగ్ యార్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇవ్వడంతో పాటు బందరు పోర్టు నిర్మాణం, మంగినపూడి బీచ్ అభివృద్ధి, రోల్డ్‌గోల్డ్, కలంకారీ పరిశ్రమలకు చేయూతనిస్తానంటూ భరోసా ఇవ్వడంతో స్థానికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. బుధవారం మచిలీపట్నంలో పర్యటించిన ఆయన చీపురుపట్టి రహదారులను శుభ్రం చేయడమే కాకుండా పారిశుధ్య కార్మికులతో సరదాగా మాట్లాడుతూ సమస్యలు తెలుసుకున్న తీరు అందరినీ ఆకట్టుకుంది.

మురిసిన బందరు



ప్రజావేదికపై పారిశుధ్య కార్మికురాలితో మాట్లాడిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంపై వరాల జల్లు కురిపించిన సీఎం చంద్రబాబు

ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం : కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ, మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు.. గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

చీపురు పట్టి.. రోడ్డును శుభ్రం చేసి..

సీఎం చంద్రబాబు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులతో కలిసి ఆంధ్ర జాతీయ కళాశాలకు ఎదురుగా ఉన్న రహదారిని చీపురుతో ఊడ్చి శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులతో కలిసి కూర్చుని టీ తాగుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కోనేరు సెంటర్‌లో డివైడర్లపై వేస్తున్న రంగులను పరిశీలించారు. ఆయన కూడా బ్రష్‌తో రంగులద్దారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు కఠారి జానకీలక్ష్మి, విజయలక్ష్మి, దుర్గాప్రసాద్, ఓసూరి శ్రీను మాట్లాడుతూ తామంతా విజయవాడ వరదల్లో పని చేశామన్నారు. స్పందించిన చంద్రబాబు.. పారిశుధ్య కార్మికులను చులకనభావంతో చూడటం సరికాదని, పరిశుభ్రత కోసం కష్టపడి పనిచేస్తున్న కార్మికులను గౌరవించటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం మచిలీపట్నం డంపింగ్ యార్డును పరిశీలించారు.

- బందరు పోర్టు నిర్మించి తీరుతామని హామీ
- డ్రెయినేజీ, రహదారులు, డంపింగ్ యార్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం
- మంగినపూడి బీచ్ అభివృద్ధికి చర్యలు
- రోల్డ్‌గోల్డ్, కలంకారీ పరిశ్రమలకు చేయూత

బందరు పోర్టు పనుల తనిఖీ

షెడ్యూల్‌లో లేకున్నా బందరు పోర్టు పనులు జరుగుతున్న ప్రాంతానికి సీఎం చంద్రబాబు ఆకస్మికంగా వెళ్లారు. ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. అక్కడి ఇంజనీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బందరు పోర్టు మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించి క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించారు. పోర్టు నిర్మించి తీరుతామని హామీ ఇచ్చారు. రూ.3,669 కోట్లతో బందరు పోర్టును పీపీటీ పద్ధతిలో నిర్మిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ రూ.860 కోట్లతో 24శాతం పనులు జరిగాయని తెలిపారు. ప్రస్తుతం నాలుగు బెర్తుల నిర్మాణం జరుగుతోందని, రానున్న రోజుల్లో 16 బెర్తులకు పోర్టును విస్తరిస్తామని వివరించారు.

సమస్యలపై మంత్రి, ఎంపీల వినతి

మచిలీపట్నం మండలంలో మరో తాగునీటి చెరువు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని మంత్రి కొల్లు రవీంద్ర సీఎంకు విజ్ఞప్తి చేశారు. అలాగే, మచిలీపట్నం అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైను నిర్మాణం చేయాలని, దీనివల్ల బందరు పోర్టు నుంచి సరుకులు ఎగుమతులు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి విజ్ఞప్తి చేశారు. కృష్ణానదికి 15 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ఇబ్బందులు లేకుండా కృష్ణా కుడి, ఎడమ కరకట్టలను బలోపేతం చేయాలని కోరారు. మచిలీపట్నం మెడికల్ కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నం పర్యటనకు ఒకరోజు ముందుగానే తాను ఫోన్ ద్వారా ఇక్కడి సమస్యలపై సర్వే నిర్వహించానని ముఖ్యమంత్రి

- మిగతా 6లో



• జోరువాన

విజయవాడ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులకు ఉపశమనం లభించింది. బుధవారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులొచ్చాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి వరకు విస్తారంగా వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. వరదలకు అతలాకుతలమైన అజిత్‌సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బెంజిసర్కిల్, సర్వీసు రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, భవానీపురం, కబేళా, చిట్టినగర్, ఎంజీ రోడ్డు, ఏలూరు రోడ్డు, గుణదల, ప్రభుత్వాసుపత్రి ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది.





చల్లపల్లి గాంధీజీ స్మృతివనంలో మహాత్మునికి నివాళులు

మహాత్ముని శాంతి సందేశాలే శరణ్యం

» ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, అక్టోబరు 2 : అణు యుద్ధపు అంచుల్లో ఉన్న ప్రపంచానికి మహాత్మాగాంధీ చెప్పిన శాంతి అహింసా మార్గాలే శరణ్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా చల్లపల్లి గాంధీజీ స్మృతివనంలో మహాత్ముని విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో రెండుసార్లు గాంధీజీ చల్లపల్లి వచ్చి ప్రసంగించటం స్థానిక ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. అనేక దేశాలు గాంధీ మార్గంలో పోరాడి విముక్తిపొందాయని తెలిపారు. మహాత్ముని బాటలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

మద్యం పాలసీకి వ్యతిరేకంగా ధర్నా

చల్లపల్లి : నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో చల్లపల్లిలో గాంధీజీ విగ్రహం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి మాట్లాడుతూ, మద్యం షాపుల సంఖ్య, సమయం కుదించాలని డిమాండ్ చేశారు. వారంలో ఒకరోజు డ్రైడే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం మద్యపానం నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్యంపై వచ్చే ఆదాయంలో రెండుశాతం మద్యం నష్టంపై ప్రచారం చేసేందుకు వినియోగించాలన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం షాపులను నిర్వహించాలనీ, ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 వరకు మాత్రమే షాపులకు అనుమతివ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నేతలు కంచర్ల ప్రభుకుమారి, వేములపల్లి నాగేంద్రమ్మ, కుర్రా అరుణకుమారి, ఆట్లూరి స్వరూప, కోటేశ్వరమ్మ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద కూటమి నేతలు

చల్లపల్లి టు మోపిదేవి సంకీర్తన పాదయాత్ర

మోపిదేవి : తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనకు సంబంధించి కూటమి నేతల ఆధ్వర్యంలో చల్లపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వరకు నగర సంకీర్తన పాదయాత్ర నిర్వహించారు. బుధవారం ఉదయం చల్లపల్లిలో వెంకటేశ్వరస్వామికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక పూజలు చేసి నగర సంకీర్తన పాదయాత్రను ప్రారంభించారు. చల్లపల్లి నుంచి మోపిదేవి వరకు కూటమి శ్రేణులు ఓం నమో నారాయణ మంత్రం జపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. 10 కిలోమీటర్ల మేర గ్రామాల ప్రజలు మద్దతు తెలిపారు. చివరగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.



సత్యాగ్రహ దీక్షలు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

» మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

గుడివాడ : ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా యూటీఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ శివారు ప్రాంతాల్లోని విద్యార్థులకు నూతన పాఠశాలను ఏర్పాటు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని, లేనిపక్షంలో ఉద్యమానికి సిద్ధమవుతామని బొడ్డు హెచ్చరించారు. దీక్షలకు సీపీఎం నేతలు ఆర్సీపీ రెడ్డి, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షులు పొంగులేటి జయరాజు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

6 నుంచి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక మహాసభలు

మచిలీపట్నం టౌన్ : విజయనగరంలో అక్టోబరు 6, 7, 8 తేదీల్లో నిర్వహించే విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు కోరారు. బుధవారం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాగరాజు మాట్లాడారు. ఏపీటీఎఫ్ సంఘం స్థాపించి 80 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కృష్ణాజిల్లా అధ్యక్షుడు కె.శేషగిరి, ప్రధాన కార్యదర్శి బి.లంకేష్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు టి.దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలపై దృష్టి సారించాలి : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : వ్యర్థాలతో కళాకృతులు రూపొందించిన విద్యార్థుల ఆలోచనలు స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నోబుల్ కళాశాలలో వ్యర్థాలతో విద్యార్థులు 800



కళాకృతులను ప్రదర్శించారు. ప్రదర్శనను మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ ప్రారంభించారు. డీఈవో తాహెరా సుల్తానా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్, సర్వశిక్ష ఏపీసీ శ్రీరాములు నాయక్, ఏడీ మనోహరనాయక్, సైన్స్ అధికారి జాకీర్‌హుస్సేన్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పాఠశాలలకు బహుమతులు ప్రదానం చేశారు.

నిబద్ధతతో పనిచేయండి



» దసరా ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

» మొత్తం 26 సెక్టారుల ఏర్పాటు

» రోజూ మూడు షిఫ్టుల్లో విధులు

వన్‌టౌన్, అక్టోబరు 2 : దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతి సెక్టారులోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి భక్తుల మనోభావాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో మెలగుతూ నిబద్ధతతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. దసరా ఉత్సవాల విధులకు నియామకమైన అధికారులు, సిబ్బందికి బుధవారం తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. దసరా మహోత్సవాలు ఈనెల 12న ముగుస్తాయని, అయితే ఆ తరువాత భవానీ దీక్షలు తీసుకున్న భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని, ఈ కారణంగా 15వ తేదీ వరకు కూడా ఉత్సవాల సంరంభం నెలకొంటుందని చెప్పారు. దసరా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు మొత్తం 26 సెక్టారులు ఏర్పాటు చేసి సీనియర్ అధికారులు, సిబ్బందిని బృందాలలో భాగస్వాములను చేసినట్టు చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు, రాత్రి 9 నుంచి ఉదయం 7 గంటల వరకు మూడు షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఎండోమెంట్, మునిసిపల్ కార్పొరేషన్, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ, తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. మునిసిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీఓ కె.చైతన్య, డీఆర్వో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

726 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు..

దసరా మహోత్సవాల్లో బందోబస్తు, ఇతర సేవలను అందించేందుకు ఎన్టీఆర్ జిల్లాలోని 12 కళాశాలలకు చెందిన 726 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పనిచేస్తారని విజయవాడ డీసీపీ మహేశ్వరరాజు చెప్పారు. కేవీఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 726 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అమ్మవారి సన్నిధిలో భక్తులకు సేవలు చేసేందుకు స్వచ్ఛందంగా రావటం అభినందనీయమన్నారు. వలంటీర్లకు అవసరమైన అన్ని సదుపాయాలను దేవస్థానం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ ప్రత్యేక అధికారి వెలగా జోషి, ఎన్ఎస్ఎస్ జిల్లా మాజీ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ తదితరులతో పాటు వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్పెషల్స్..

» రికార్డు స్థాయిలో 1000 బస్సులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) రికార్డు స్థాయిలో 1000 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 3 నుంచి 15 వరకు వెయ్యి బస్సులను నడపనున్నట్టు షెడ్యూల్ ప్రకటించింది. హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై, రాయలసీమ, స్థానికంగా 13 రోజుల పాటు స్పెషల్ బస్సులను నడపనుంది. హైదరాబాద్ మార్గంలో 353, రాజమండ్రి మార్గంలో 241, విశాఖపట్నం మార్గంలో 90, బెంగళూరు మార్గంలో 14, చెన్నై మార్గంలో 22, రాయలసీమ ఇతర మార్గాలలో 280 బస్సులు చొప్పున నడపాలని నిర్ణయించారు.

అదనంగా మరో 290 స్పెషల్ బస్సులు సిద్ధం

దసరాకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా ఆర్టీసీ అధికారులు మరో 290 అదనపు బస్సులను కూడా సిద్ధం చేసుకున్నారు. అల్ట్రాడీలక్స్, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను సిద్ధంగా ఉంచారు.

ప్రపంచానికే దిశా నిర్దేశం విజయవాడ

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, అక్టోబరు 2 : ప్రపంచానికే దిశ నిర్దేశించే సామర్థ్యం విజయవాడకు ఉందని 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాల్లో వినూత్న కార్యక్రమాలు చేపట్టి ప్రపంచానికి చాటి చెప్పాలని జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం బెంజ్‌సర్కిల్ వద్ద పింక్ టాయిలెట్స్‌పై కలెక్టర్ సృజన, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, నగరపాలక కమిషనర్ ధ్యానచంద్ర ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వచ్ఛ సంకల్పంతో ప్రతిగ్రామంలో, మున్సిపాలిటీల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ప్రజల భాగస్వామ్యంతోనే కార్యక్రమం సంపూర్ణమవుతుందన్నారు. విజయవాడ చైతన్యవంతమైన నగరం అని, ప్రపంచానికే దిశ నిర్దేశించే సామర్థ్యం వుందని దీనిలో భాగంగా పింక్ టాయిలెట్స్ వార్షికోత్సవం సందర్భంగా నగరంలో మరిన్ని పింక్ టాయిలెట్స్ రావాలని ఆశిస్తున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, గాంధీజీ ఆశయం స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత వల్ల ఆరోగ్యానికే కాదు నగరానికి తద్వారా రాష్ట్రానికి తద్వారా దేశానికి పరిశుభ్రమైన దేశంగా గర్వకారణమన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 1 వరకు నిరంతరాయంగా ప్రతిరోజు స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు, గోడలమీద పెయింటింగ్, మొక్కలు నాటడం కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు పింక్ టాయిలెట్స్ ఎలా ఉపయోగపడతాయి వాటి ప్రాముఖ్యతను కలెక్టర్‌తో పంచుకొన్నారు.



పింక్ టాయిలెట్‌ను ప్రారంభించిన కలెక్టర్ సృజన

డ్రెయిన్లు, పంట కాల్వలు తవ్వించండి

» సీఎం చంద్రబాబుకు గోపు వినతి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 2 : పూడిక తీతలు లేక పోవడంతో భారీ వర్షాలకు పంటకాల్వలు, డ్రెయిన్లు ముంపునకు గురవుతున్నాయని, పూడిక తీతలు తీయించి రైతులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబుకు కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ వినతిపత్రం సమర్పించారు.



గత ప్రభుత్వం పంట కాల్వలు, డ్రెయిన్లు పూడిక తీత పనులు సక్రమంగా చేపట్టలేదని, దీని వల్ల పంటలు మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కృష్ణా జిల్లాలో 22,234 ఎకరాల్లో రైతులు పంట నష్ట పోయారన్నారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి గత ప్రభుత్వం స్థలం మంజూరు చేసినా భవన నిర్మాణానికి అనుమతులివ్వలేదని బీజేపీ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు వాగ్దానం చేసిన సంగతి గుర్తుచేశారు.

ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

» 17 గ్రామాల్లో పీఎం జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ పథకం అమలు

» అన్ని వర్గాలతో సమానంగా గిరిజనులు ఎదగాలి : జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, అక్టోబరు 2 : ఆదివాసీల ఉన్నతి, సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ప్రధానమంత్రి మహాత్మాగాంధీ జయంతి రోజున ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ (పీఎం జుగా) పథకాన్ని ప్రారంభించడం జరుగుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పీఎం జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్‌పై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. తొలుత కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పథకం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదేళ్ల క్రితం మహాత్ముని జయంతి రోజున ప్రారంభమైన స్వచ్ఛ భారత్ మిషన్ ఓ ప్రజా ఉద్యమంలా కొనసాగి మంచి ఫలితాలిచ్చిందని, ఇదే స్ఫూర్తితో ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ అమలవుతుందని పేర్కొన్నారు. గిరిజనులు కూడా ఉన్నత స్థానాలకు చేరుకొనేలా చేయూతనివ్వాలనే ఉద్దేశ్యంతో పీఎం జుగా కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. పథకం అమలుకు గిరిజన జనాభా ఎక్కువగా వున్న ఎన్టీఆర్ జిల్లాలోని ఐదు మండలాల్లో, 17 గ్రామాలను గుర్తించడం జరిగిందని వివరించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కాచవరం, దాములూరు, మూలపాడు, జూపూడి, తుమ్మలపాలెం, పెనుగంచిప్రోలు, ముచ్చింతల, అనిగండ్లపాడు, కొలికుల్ల, కొనకంచి, నవాబ్‌పేట, శనగపాడు, ఎ.కొండూరు మండలంలోని కుమ్మరికుంట్ల, జగ్గయ్యపేట మండలంలోని బూదవాడ, జయంతిపురం, మైలవరం మండలంలోని కనిమెర్లతండ గ్రామాల్లో పథకం అమలుకానుందన్నారు. కార్యక్రమాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సృజన సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, నైపుణ్యాభివృద్ధి అధికారి నరేష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, గిరిజన సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన, అధికారులు

మురిసిన బందరు

(5వ పేజీ తరువాయి)

చంద్రబాబు తెలిపారు. డ్రెయినేజీ, రోడ్లు, డంపింగ్ యార్డు, తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. బీసీల కోసం కమ్యూనిటీ హాలు, మంగినపూడి బీచ్ అభివృద్ధి ఇలా అనేక సమస్యలు నా దృష్టికి వచ్చాయని, రానున్న రోజుల్లో వీటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా పేరున్న బందరు లడ్డూకు విస్తృత మార్కెట్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రోల్డ్ గోల్డ్, కలంకారీ పరిశ్రమను ఎంఎస్ఎంఈలో క్లస్టర్‌గా చేర్చి మరింతగా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. మచిలీపట్నం మెడికల్ కళాశాలకు పింగళి వెంకయ్య పేరును పెడతామని హామీ ఇచ్చారు. మచిలీపట్నం బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కార గ్రహీతలకు సన్మానం

స్వచ్ఛతా హీ సేవ - 2024 రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపికైన విశాఖపట్నం, మచిలీపట్నం కార్పొరేషన్ల కమిషనర్లు సంపత్‌కుమార్, బాపిరాజు, తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రాంకుమార్‌తో పాటు అనంతపురం జిల్లాకు చెందిన కె.ఎల్.ప్రభాకర్, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన అరుణశ్రీ, అన్నమయ్య జిల్లాకు చెందిన ధనలక్ష్మిలను సీఎం చంద్రబాబు సత్కరించారు.

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

ఆంధ్ర జాతీయ కళాశాలకు హెలికాప్టర్‌లో ఉదయం పదిన్నర గంటలకు చేరుకున్న సీఎం చంద్రబాబుకు మంత్రులు కొలుసు పార్థసారథి, పొంగూరు నారాయణ, శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్, వెనిగండ్ల రాము, కలెక్టర్ డి.కె.బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ తదితరులు ఘన స్వాగతం పలికారు.

అంబరమై..

(5వ పేజీ తరువాయి)

శుభ్రం చేస్తారు. మొత్తం ప్రక్రియ పూర్తికావడానికి గంట సమయం పడుతుంది. అప్పటి వరకు దర్శనానికి భక్తులను అనుమతించరు. మహానివేదన అనంతరం పంచహారతులు ఇస్తారు.

మూడు ఎగ్జిట్ పాయింట్లు

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు బయటకు వెళ్లడానికి మూడు ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. మూడు మార్గాల్లో భక్తులు బయటకు వెళ్లవచ్చు. ఇప్పటి వరకు అమ్మవారి దర్శనం పూర్తయ్యాక భక్తులు శివాలయం వైపునకు వెళ్లి అక్కడి నుంచి మెట్లు దిగి కనకదుర్గానగర్‌లోకి వెళ్లేవారు. ఈ ఏడాది అక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శివాలయం మెట్ల వద్ద అన్నదానం కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా శివాలయానికి ఉన్న కొన్ని మెట్లను తొలగించాల్సి వచ్చింది. దీంతో ఉన్న మెట్లకు అనుబంధంగా మహామండపం వైపునకు ఒక మార్గాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ 12 అడుగుల వెడల్పుతో తాత్కాలికంగా మెట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి భక్తులు కనకదుర్గానగర్‌లోకి వెళ్లవచ్చు. ఇదికాకుండా మహామండపం వద్ద తులాభారం పక్క నుంచి ఆలయం వరకు క్యూలైన్లు ఉన్నాయి. ఆలయం ఎదురుగా ఉన్న క్యూలైన్ బారికేడ్లను తొలగించారు. బయటకు వచ్చిన భక్తుల్లో కొంతమంది ఈ మార్గం గుండా మహామండపం మెట్ల వద్దకు పంపుతారు. అక్కడి నుంచి భక్తులు కనదుర్గానగర్‌లోకి వస్తారు. దీంతోపాటు మహామండపం లిఫ్టులకు పక్కన ఒక మెట్ల మార్గం ఉంది. దీని ద్వారా భక్తులను కిందకు పంపాలని నిర్ణయించారు. శివాలయం మెట్ల వద్ద మార్గం పూర్తిగా అనువుగా లేకపోవడంతో ఈ మూడు మార్గాల్లో భక్తులు కొండ దిగేలా ఏర్పాట్లు చేశారు.

కనకదుర్గానగర్‌లో ప్రసాదాలు

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న మెట్లమార్గం నుంచి బయటకు వెళ్లాల్సి ఉంటుంది. మెట్లు దిగిన భక్తులు మహామండపం ముందు నుంచి కనకదుర్గానగర్‌లోకి రావాలి. శివాలయం మెట్లకు ఎదురుగా నిర్మిస్తున్న ఉన్న ప్రదేశంలో అన్నప్రసాదం అందజేస్తారు. పులిహోర, లడ్డూల కౌంటర్లు ఎప్పటిలాగానే కనకదుర్గానగర్‌లోనే ఏర్పాటుచేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి : ఈవో

వన్‌టౌన్, అక్టోబరు 2 : శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు తెలిపారు. మహామండపం ఆరో అంతస్థులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలిరోజు ఉదయం 9 గంటల నుంచి, మిగతా రోజుల్లో వేకువ జామున 4 గంటల నుంచి, మూలానక్షత్రం రోజు అర్ధరాత్రి 2 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. రోజూ రాత్రి 11 గంటలకు దర్శనాలను నిలిపివేస్తామని తెలిపారు. మూలానక్షత్రం సందర్భంగా ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. 12వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయని, అయితే భవానీ దీక్షాధారులు దీక్షలు విరమించేందుకు పెద్ద సంఖ్యలో వస్తున్న కారణంగా 15వ తేదీ వరకు సంబరాలు కొనసాగుతాయని వివరించారు. రోజూ సాయంత్రం 4 గంటలకు నగరోత్సవం జరుగుతుందని, 12వ తేదీ విజయదశమి రోజు సాయంత్రం 6 గంటలకు కృష్ణానదిలో తెప్పోత్సవం జరుగుతుందని వివరించారు.



దుర్గమ్మ భక్తులకు

టెక్ సేవలు!

» అందుబాటులోకి దసరా యాప్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

దసరా సందర్భంగా దుర్గమ్మ సన్నిధికి తరలి వచ్చే భక్తుల సంఖ్య ప్రతియేటా పెరుగుతూ వస్తోంది. గత ఏడాది దసరా సందర్భంగా సుమారు 13 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరిలో అధికశాతం పొరుగు రాష్ట్రాలు.. పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారే. ఈసారి భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వీరికి దుర్గమ్మ దర్శనాన్ని సులభతరం చేసేందుకు దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం అధికారులు టెక్నాలజీని వినియోగించుకుంటున్నారు. దసరా ఉత్సవాలకు సంబంధించిన సమస్త సమాచారం భక్తులకు అందుబాటులో ఉంచేందుకు 'దసరా 2024' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో దర్శన వేళలు.. దర్శన టికెట్ల కొనుగోళ్ల కౌంటర్లు.. పార్కింగ్ ప్రదేశాలు వంటి వివరాలను పొందుపరిచారు. దీంతో పాటు వాట్సాప్ ద్వారా కూడా దసరా ఉత్సవాల వివరాలు పొందేలా ఏర్పాటు చేశారు. 94418 20717 వాట్సాప్ నంబరుకు హాయ్, అమ్మ అని మెసేజ్ చేస్తే భక్తులకు అవసరమైన సమాచారం తెలుసుకునేలా ఏర్పాటు చేశారు.

యాప్‌లో ఏముంటాయంటే..

దసరా 2024 యాప్‌లో దసరా నవరాత్రుల్లో అమ్మవారి దర్శన వేళలను పొందుపరిచారు. అలాగే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి దుర్గగుడి చెంతకు చేరుకునేందుకు వాహనసౌకర్యం ఎక్కడెక్కడ అందుబాటులో ఉందో తెలిపేలా వివరాలు ఉంచారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రసాదం కౌంటర్ల వివరాలు, అన్నదానం వివరాలు, దర్శనం టికెట్ల కౌంటర్లు ఎక్కడెక్కడ ఉన్నాయన్న వివరాలు, ఫస్ట్ ఎయిడ్ కేంద్రాల వివరాలు, మరుగుదొడ్లు, చెప్పుల స్టాండ్లు, సమాచార కేంద్రాలు.. వంటి సమస్త వివరాలను పొందుపరిచారు. భక్తులు ఎక్కడైనా ఏదైనా సమస్య ఎదుర్కొంటే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు కూడా ఉంది. అలాగే ఏవైనా సూచనలు చేయదలచినా దానికీ అవకాశం ఉంది.

న్యూస్ బాక్స్



డ్రెయిన్‌లో గాలిస్తున్న పోలీసులు
దాసరి భరత్ (ఇన్‌సెట్‌లో)

పెదలంక డ్రెయిన్‌లో

బాలుడి గల్లంతు

కృత్తివెన్ను, అక్టోబరు 2: బహిర్భూమికి అని చెప్పి వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు పెదలంక డ్రెయిన్‌లో పడి గల్లంతైన ఘటన బుధవారం మండల పరిధిలోని గరిశపూడి వద్ద చోటు చేసుకుంది. ఎస్సై పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గరిశపూడి గ్రామానికి చెందిన దాసరి భరత్ (17) అండర్ టన్నెల్ వద్ద బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు కాలుజారి పెదలంక డ్రెయిన్‌లో పడిపోయాడు. గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం దక్కలేదని ఎస్సై పైడిబాబు తెలిపారు. గురువారం కూడా గాలింపు చర్యలు కొనసాగుతాయన్నారు.

మహిళలపై అసభ్య ప్రవర్తన

» ప్రభుత్వాసుపత్రి ఉద్యోగికి దేహశుద్ధి

» పోలీసు కేసు నమోదు

విజయవాడ లీగల్, అక్టోబరు 2 : మహిళల రక్షణకు ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా నిందితుల ఆగడాలు ఆగడం లేదనడానికి ఈ ఘటనే ఉదాహరణ. సింగ్‌నగర్‌లోని గంగానమ్మ గుడిసెంటర్‌కు చెందిన హోచ్‌మెన్ పాత ప్రభుత్వాసుపత్రిలో సీనియర్ అసిస్టెంట్. ఆసుపత్రి ఆవరణలోని హోటల్‌లో పనిచేసే మహిళపై ఇతడి కన్ను పడింది. ఆమెను లొంగదీసుకొనే ప్రయత్నం చేశాడు. దీంతో బాధితురాలు గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పలు సెక్షన్ల కింద కేసునమోదు చేశారు. అక్కడే పనిచేస్తున్న మరో మహిళ పట్ల కూడా లైంగిక వేధింపులకు పాల్పడుతుండటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులు కోర్టులో విచారణలో ఉన్నాయి.

గతంలో వేధింపులకు గురిచేసిన మహిళ సోమవారం ఆసుపత్రికి వెళ్లగా అక్కడ హోచ్‌మెన్ మహిళతో కేసు రాజీ చేసుకొందామని సింగ్‌నగర్‌లోని తన ఇంటికి రావాలన్నాడు. ఆమె మరో మహిళతో కలిసి మంగళవారం హోచ్‌మెన్ ఇంటికి వెళ్లగా ఇద్దరు మహిళలపై అఘాయిత్యానికి ప్రయత్నించగా వదిలించుకుని చెప్పులతో హోచ్‌మెన్‌కు దేహశుద్ధి చేశారు. స్థానిక మహిళలు సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రంగంలోకి వైసీపీ నేతలు!

మహిళలపై లైంగికదాడికి యత్నించిన హోచ్‌మెన్‌ను రక్షించేందుకు 57, 61 డివిజన్లకు చెందిన వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. పోలీసు స్టేషన్‌కు చేరుకొని పోలీసులతో మంతనాలు జరిపారు. నిందితుడిని సాయంత్రానికి తీసుకొస్తామని చెప్పి ఇంటికి తీసుకెళ్లారు. అయితే బాధితుల ఫిర్యాదుపై సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేస్తారా.. లేక వైసీపీ నేతల ఒత్తిడికి తలొగ్గి కేసును నీరుగారుస్తారో వేచిచూడాలి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

మెగా మెడికల్ క్యాంపు



పాయకాపురం, అక్టోబరు 2 : స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో 64వ డివిజన్ కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి నగరపాలక సంస్థ పాఠశాలలో బుధవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మెడికల్ క్యాంపు ప్రారంభించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, నేతలు పరుచూరి ప్రసాద్, పలగాని భాగ్యలక్ష్మి, నాగరాజు, కాకొల్లు రవి, పాల్గొన్నారు.

జాతిపిత బాపూజీ సేవలు చిరస్మరణీయం

మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమం బుధవారం నగరంలో అనేక చోట్ల ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాలు, పాఠశాలలు, పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద గాంధీ చిత్రపటాలకు ఆయా విభాగాలకు చెందిన నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వన్‌టౌన్, అక్టోబరు 2: జాతిపిత మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం జరిగిన మహాత్మాగాంధీ 155వ జయంతి వేడుకలు సందర్భంగా పలువురు టీడీపీ, టీఎన్‌టీయూసీ నాయకులు పేర్కొన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పాల మాధవ, విద్యార్థి నాయకుడు చరణ్‌సాయి, సొంగా సంజయ్ వర్మ, రావెల శివప్రసాద్, సుకాసి సరిత, ఎర్నేని వేదవ్యాస్, లక్కు శాంతి, మీరా బి, చిట్టిబాబు, సతీష్ చంద్ర, తాజుద్దీన్, పెనుగొండ శ్రీను, కళాధర్, తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తొలుత గాంధీజీ చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మరక శ్రీనివాస్ యాదవ్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చెన్నుపాటి ఉషారాణి, గొల్లపూడి నాగేశ్వరరావు, సింగం వెంకన్న, పొన్నం రవికుమార్, పామర్తి కిషోర్ బాబు, చంటి శివరామ్ ప్రసాద్‌గౌడ్, అంజనేయ వాసు పాల్గొన్నారు.

● భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ నాయకులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. బోగవల్లి శ్రీధర్, ఉమాకాంత్, పచ్చిపులుసు ప్రసాద్, గుడివాడ నరేంద్ర రాఘవ, ముదిగొండ శివ, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

● కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నుంచి దేశాన్ని రక్షించాలని కోరారు. ఈ మేరకు ఓ వినతి పత్రాన్ని గాంధీ విగ్రహానికి అందచేశారు. నాయకులు ముప్పా మోహనరావు, ఏపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వి.గుర్నాథం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో



ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో



ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో



బెజవాడ బార్‌లో...

గవర్నర్‌పేట: మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలను పురస్కరించుకుని ఎంజీ రోడ్డులోని రామ్మోహన్ గ్రంథాలయంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు ఇరువురి నేతల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

● ఠాగూర్ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గాంధీజీపై దేశభక్తి గీతాలు ఆలపించారు. చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

● దుర్గాపురంలోని శ్రీవాణీ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో గాంధీ చిత్రపటానికి స్కూల్ కరస్పాండెంట్ ఏ. శేషుబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు స్కూల్ పరిసరాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు.

భవానీపురం: హెచ్‌బీ కాలనీలో పోలీస్ స్టేషన్ రోడ్డులోని ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం బాపూజీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యేమినేని వెంకటేశ్వర్లు, పమిడిపాటి పట్టాభి, రామారావు, యెనిగళ్ల సుబ్బారావు, శేషగిరిరావు, సంజీవరెడ్డిలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సరుకుల పంపిణీ

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ గెలాక్సీ సభ్యుల ఆధ్వర్యంలో భవానీపురంలోని శ్రీ వెంకటసాయి సేవా వృద్ధాశ్రమంలో రూ.5వేల విలువైన 25 కిలోల రైస్, నిత్యావసరాలు, దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ గుండా రమేష్, సెక్రటరీ నారిండి కిషోర్, ట్రెజరర్ ఎస్ఎంఎస్ కుమార్, నీలిశెట్టి చెన్నకేశవులు, పేర్ల సత్యనారాయణ, నాగేశ్వరావు, సుబ్బారావులు పాల్గొన్నారు.

బెజవాడ బార్‌లో ...

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో జాతిపిత మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలను న్యాయవాదులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా)లు ముందుగా గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బార్ కార్యవర్గసభ్యులు జీవీ రామశర్మ, కలతోటి క్రాంతి కుమార్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



వన్‌టౌన్, అక్టోబరు 2: కేబీఎన్ కళాశాలలో బుధవారం వరద బాధిత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. శకుంతల విద్యానిధి ఛైర్మన్ వంకదారు వాసుదేవరావు, వంకదారు రంగయ్యల ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ వంకదారు వాసుదేవరావు తమ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కోశాధికారి హరగోపాల్, హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబా వి జయకుమార్, కళాశాల కమిటీ సభ్యుడు రామకిషోర్, హిందూ హైస్కూల్స్ పరిపాలనా అధికారి డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హి సేవలో భాగస్వాములుకండి

మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర



గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

చిట్టినగర్, అక్టోబరు 2: గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు స్వచ్ఛతా హి సేవలో భాగస్వాములై తమ ఇంటి పరిసరాలతోపాటు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర పిలుపునిచ్చారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర పలువురు అధికారులతో కలసి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు ప్రధాన కార్యాలయంలో పలువురు అధికారులతో కలసి చీపుర్లు పట్టుకొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగులు వేసి పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరాన్ని ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ప్రజలకు మద్దతు, స్వచ్ఛతపై అవగాహన కల్పించే సెల్ఫీ స్టాండ్లలో పారిశుధ్య కార్మికులు వీఎంసీ సిబ్బందితో మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్రలు సెల్ఫీ దిగి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఎస్ఈ పీ. సత్యనారాయణ, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాత్ముడి అహింసావాదం ఆచరణీయం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గద్దె

పటమట, అక్టోబరు 2 : మహాత్మా గాంధీ అనుసరించిన అహింసావాదం గొప్పతనాన్ని నేటి తరానికి తెలియ జేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాయిబాబు, సత్యనారాయణ, రమేష్, కనగాల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

● సర్వోత్తమ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గోరా సైన్సు డైరెక్టర్ నియంత గోరా మాట్లాడుతూ మత దురంహకార ధోరణుల పరిష్కారానికి గాంధీజీ విధానాలు అనుసరణీయమన్నారు. గాంధీ సాహిత్య పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి రావి శారద, పాతూరి నాగభూషణం, శిక్షణాలయం విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాత్ముడి అహింసావాదం ఆచరణీయం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, అక్టోబరు 2 : మహాత్మా గాంధీ అనుసరించిన అహింసావాదం గొప్పతనాన్ని నేటి తరానికి తెలియ జేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాయిబాబు, సత్యనారాయణ, రమేష్, కనగాల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

● సర్వోత్తమ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గోరా సైన్సు డైరెక్టర్ నియంత గోరా మాట్లాడుతూ మత దురంహకార ధోరణుల పరిష్కారానికి గాంధీజీ విధానాలు అనుసరణీయమన్నారు. గాంధీ సాహిత్య పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి రావి శారద, పాతూరి నాగభూషణం, శిక్షణాలయం విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాత్ముని బోధనలు ఆదర్శప్రాయం

గాంధీ దేవాలయం వ్యవస్థాపకుడు జయప్రకాష్ ●గాంధీ దేవాలయంలో దీక్షల విరమణ

చిట్టినగర్, అక్టోబరు 2: విశ్వమానవాళికి మహాత్మా గాంధీ బోధనలు ఆదర్శప్రాయమని గాంధీ దేవాలయం వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాష్ అన్నారు. పాలఫ్యాక్టరీ సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కాలేజీ ఆవరణలో ఉన్న గాంధీ దేవాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత రాంపిళ్ల జయప్రకాష్ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీదీక్షలను స్వీకరించిన పలువురుతో మాలవిరమణ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లను నేర్చుకొని దేశానికి సేవ చేయాలని కోరారు. అనంతరం ప్రముఖ గాంధేయవాది ఉప్పులూరి లక్ష్మీనారాయణ పండితులు మహాత్మాగాంధీ ఆలయంలో గాంధీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన హనుమ, తమ్మిన సోనియా, ప్రముఖ వ్యాపారవేత్త తమ్మిన మారుతి, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బీ.వసంత్‌కుమార్, కార్యదర్శి కొండయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సభ్యులు టీ.రాజారావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జయప్రకాష్, గాంధేయవాది ఉప్పులూరి లక్ష్మీనారాయణ శర్మ

వృద్ధులకు పండ్లు పంపిణీ



గుణదల, అక్టోబరు 2: జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి వేడుకను పురస్కరించుకుని గుణదల్లోని మదర్ థెరెస్సా ప్రేమధాన్ సేవా ఆశ్రమంలో బుధవారం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఏపీ సర్వోదయ మండల్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎన్. రాంబాబు నాయుడు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరెస్సా ప్రేమధాన్ సేవ ఆశ్రమం నిర్వాహకులు సిస్టర్ మేరి, ఏపీ సర్వోదయ మండల్ ఉపాధ్యక్షులు వల్లూరు లత, కె.వరప్రసాద్, డాక్టర్ డి.దీనబందు, కోశాధికారి వై.సురేష్‌బాబు, ఎం.రాజేంద్ర ప్రసాద్, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

పాయకాపురం, అక్టోబరు 2 : గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను నున్న రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి కండ్రిక కాలనీలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కాళ్ల దేవయ్య అలియాస్ దేవాన్ష్, జ్ఞానదీప్, పోనమాల దనూష్‌లను తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి ఉండటాన్ని గుర్తించారు. ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి కేజీ 20 గ్రాముల గంజాయి, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనపరచున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆటోనగర్, అక్టోబరు 2: ఆటోనగర్ వందడుగుల మెస్సీయ ఫెలోషిప్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, థైరాయిడ్, బీఎండీ, 2డీ ఎకో వంటి పరీక్షలు నిర్వహించారు. రోగులకు రూ. 3లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెస్సీయ ఫెలోషిప్ ఛైర్మన్ సజ్జా రత్నకుమార్ మాట్లాడుతూ వరద బాధితులకు 15 రోజుల పాటు ఆహారం అందజేయడంతోపాటు 10 వేల దుప్పట్లు, చీరలు అందజేశామన్నారు. సంస్థ కో-ఆర్డినేటర్ సజ్జా జ్యోతి, వైద్యులు కె. మధు కృష్ణ, ఎస్.బాలకృష్ణ, రాకేష్ బొబ్బ, ఎస్.చేతన్, ప్రశాంత్‌బాబు, అక్కినేని శివరామ్, పి.వి సురేష్, సంస్థ నిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పటమట, అక్టోబరు 2 : నగరంలోని టైమ్ హాస్పిటల్ గడ్డం రత్తయ్య వీధిలో ఇమ్యూరాలజీ క్లినిక్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్, రుమటాలజీ టెస్ట్‌లను నిర్వహించారు. డాక్టర్ యోగిత మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి వలన అధికశాతం మంది మోకాళ్ల నొప్పులకు గురవుతున్నారని చెప్పారు. సరైన రీతిలో వైద్య చికిత్స తీసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురుకావన్నారు. ఆరుష్ రుమటాలజీ, ఇమ్యుటాలజీ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు.

చెత్తపన్ను రద్దు హర్షణీయం

యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్

పటమట, అక్టోబరు 2 : ఎన్నికల హామీలో భాగంగా గాంధీ జయంతి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు చెత్తపన్నును రద్దు చేసి మరొక హామీని నెరవేర్చారని టీడీపీ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. మచిలీపట్నంలో నిర్వహించిన స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అధికారులకు చెత్తపన్ను వసూలు చేయవద్దని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రజలకు మంచి చేసే నిర్ణయం తీసుకున్న చంద్రబాబుకు తూర్పు ప్రజల తరపున క్రాంతికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీ మహిళా ఆధ్వర్యంలో వైద్య శిబిరం

పటమట, అక్టోబరు 2 : మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో విజయవాడ ఓల్డ్ చెక్‌పోస్టు సెంటర్ సిద్ధిఖీయ షాదీఖానాలో బుధవారం అతిపెద్ద వైద్యశిబిరం నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పారూఖ్ షిబ్లీ, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు షమా సుల్తానా, మెహ్బూబ ఆయేషా, ఫాతిమా, అఫ్రోజ్‌లను సత్కరించారు.

నిత్యావసరాల కిట్లు పంపిణీ

భవానీపురం, అక్టోబరు 2 : 43వ డివిజన్ ఊర్మిళానగర్, రెడ్డి కాలనీ, ఏకలవ్యనగర్‌లో డోర్ నెంబర్ల వారీగా బాధితులకు బొమ్మసాని సుబ్బారావు పంపించిన నిత్యావసరాల కిట్లను డివిజన్ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు గురువారం స్వయంగా అందజేశారు. వెయ్యి మందికి పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కూటమి నాయకులు పగడాల కృష్ణ, కోటి, తాటి శ్రీకాంత్, కాకర్ల నవీన్, సందక వెంకట్రావు, యువరాజులు పాల్గొన్నారు.

నాలుగు మోటార్లు అందజేత

విద్యాధరపురం, అక్టోబరు 2: భవానీపురంలోని రైతుబజార్ పక్కన ఉన్న రామ్మోహన్ అపార్టుమెంటులో ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో నాలుగు కొత్త మోటార్లను బుధవారం బిగించారు. వరదల సమయంలో మంచినీటి మోటార్లు చెడిపోయిన విషయాన్ని ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎమ్మార్వోలకు తెలియజేశారు. దీనిపై స్పందించిన ఆయన కార్యాలయ ఇన్‌చార్జి శ్రీధర్‌తో మాట్లాడి నాలుగు కొత్త మోటార్‌లను అందచేసి, వాటిని టెక్నీషియన్ల ద్వారా అమర్చారు. అపార్టుమెంట్ సీనియర్ సిటిజన్ ప్రసాద్, సునీల్, జగన్మోహన్ రావు, కుమార్‌లు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 2 : బుడమేరు వరదల్లో మృతి చెందిన ఓ కార్మికుడి కుటుంబానికి తోటి కార్మికులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన కార్మికుడు కురుభక్త పోలినాయుడు బుడమేరు వరదలకు మృతి చెందాడు. రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో ముఠా పని చేస్తున్న పోలినాయుడు కుటుంబానికి తోటి కార్మికులు సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు చేతుల మీదుగా రూ. 55 వేలు పోలినాయుడు భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ వరదలలో మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 5 లక్షలు తక్షణమే పోలినాయుడు కుటుంబానికి అందించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో ఎం. సీతారాములు, సూరి, బి. రమణారావు, కె. దుర్గారావు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



విజయవాడ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో ఇద్దరు పోలీసులు ఇద్దరు సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్టుగా పొడవుకాళ్ల కళాకారులతో ప్రదర్శన చేయించారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు కరపత్రాలు, విజిటింగ్ కార్డులు పంపిణీ చేసి అవగాహన పెంపొందిస్తామని పోలీసులు తెలిపారు. వాటిపై ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలతోపాటు వాటి బారిన పడినప్పుడు 1930 నంబరుకు కాల్ చేయాలన్న అంశాలను అవగాహన కల్పిస్తారు.

అకాల వర్షంతో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

ఆటోనగర్, అక్టోబరు 2: అకాల వర్షంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు, పోలీస్ స్టేషన్ రోడ్డు, కామినేని నగర్‌లకు వర్షపు నీరు చేరాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన కూడలి వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపారు. సైడ్ డ్రెయినేజీ సమస్యల వల్లే రహదారిపై నీరు నిలుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

దిక్సూచి DIKSUCHI

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ సహా అహ్మదాబాద్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో బీ డిజైన్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. దీని వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల భాషలో నిర్వహిస్తారు. డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్ దశలు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత పొందినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేస్తారు. ప్రతి కేటగిరీలో సీట్ల సంఖ్యకు మూడు రెట్లమందిని మెయిన్స్‌కు అనుమతిస్తారు. ప్రిలిమ్స్, మెయిన్స్ స్కోర్ ఆధారంగా తదుపరి అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు.

ఎన్ఐడీలో బీ డిజైన్



బీ డిజైన్

విభాగాలు: యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.

సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 125 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థుల కోసం అహ్మదాబాద్ క్యాంపస్‌లో 19 సీట్లు, మధ్యప్రదేశ్ క్యాంపస్‌లో 11 సీట్లు, హరియాణా క్యాంపస్‌లో 11 సీట్లు అదనంగా ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2004 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. సీబీఎస్ఈ/ఐబీ/ఐసీఎస్ఈ/ఇతర గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2024-25 విద్యా సంవత్సరం నాటికి సైన్స్, ఆర్ట్స్, కామర్స్, హ్యుమానిటీస్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 15 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల 'జాయింట్ సర్వీసెస్ వింగ్ కోర్సు' ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) నుంచి కనీసం అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామ్ పాసైనవారు; బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే మూడేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఎగ్జామ్(లండన్/శ్రీలంక) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్-పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు. మెయిన్స్ ఎగ్జామ్‌ను స్టూడియో సెటప్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఇందులో మల్టిపుల్ టెస్ట్‌లు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 40 శాతం, మెయిన్స్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు రూ.5,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 3
- **ఎడిట్ విండో ఓపెన్:** డిసెంబరు 4 నుంచి 9
- **ప్రిలిమ్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 24 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **ప్రిలిమ్స్ తేదీ:** 2025 జనవరి 5న
- **ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 1న.
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

SCHOLARSHIP ALERT

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date to Apply: 15-10-2024. *Application mode:* Online applications only.
Short Url: ww.b4s.in/aj/TCPS27

Santoor Scholarship Programme

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.
Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.
Applicants must have: passed Class 10 from a local government school. passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And enrolled in a full-time graduate programme starting in 2024-25.
Note:
- The full-time graduate course must have a minimum duration of 3 years.
- Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply. Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum
Last Date to Apply: 15-10-2024
Application mode: Online applications only! Students can apply online at Buddy4study or download the application form from www.santoorscholarship.com.
Short Url: www.b4s.in/aj/SWS7

Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25

Description: Haleon India, makers of Sensodyne, invites applications for the 'Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25' to support meritorious and underprivileged BDS students across India.
Eligibility:
- Open to students pursuing their first year of the Bachelor of Dental Surgery (BDS) programme from government and government-funded colleges only.
- Applicants must have scored a minimum of 60% in their Higher Secondary Education.
- Successful applicants must maintain a 60% score in every semester/year to continue availing of the benefits during their 4-year course.
- The annual family income of the applicant from all sources must not be more than INR 8,00,000.

Prizes & Rewards: INR 4,20,000 for 4 years (INR 1,05,000 per year)
Last Date to Apply: 31-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SSPPS4

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి



నాని పక్కన కేజీఎఫ్ భామ

నాని నటిస్తున్న 32వ సినిమా 'హిట్.. ద థర్డ్ కేస్'. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కేజీఎఫ్ భామ శ్రీనిధి శెట్టి నటిస్తోంది. సినిమాలో ఆమె పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉందని దర్శకుడు చెప్పారు. ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతున్న షూటింగ్‌లో శ్రీనిధి జాయిన్ అయింది. నాని, శ్రీనిధిపై కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. వచ్చే ఏడాది మే ఒకటిన విడుదలయ్యే ఈ సినిమాను ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు.

క్రైమ్ క్యాన్సర్ లాంటిది.. పెరగనివ్వకూడదు

'వారంలో ఎన్‌కౌంటర్ జరిగిపోవాలి' అని రావు రమేశ్ అనగానే 'వారం అక్కర్లేదు.. మూడే రోజుల్లో డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరొస్తుంది' అంటూ స్టయిలిష్ నడకతో ఎంట్రీ ఇచ్చారు రజనీకాంత్. ఆయన హీరోగా నటించిన 'వేట్టయన్.. ద హంటర్' సినిమా ఈ నెల పదిన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం విడుదల చేసిన ట్రైలర్ ఆకట్టుకుంటోంది. అలాగే అమితాబ్, రానా, ఫాహద్ ఫాజిల్ పాత్రల్ని కూడా ఈ ట్రైలర్‌లో పరిచయం చేశారు. 'క్రైమ్ అనేది క్యాన్సర్ లాంటిది. దానిని పెరగనివ్వకూడదు' వంటి డైలాగులు, అద్భుతమైన విజువల్స్ అలరిస్తున్నాయి. 'నన్ను ఏ పోస్టులో తిప్పి కొట్టినా నేను మాత్రం పోలీస్ వాడినే సార్.. నా నుంచి వాడిని కాపాడడం ఎవరి వల్లా కాదు' అంటూ రజనీకాంత్ డైనమిక్‌గా చెప్పే డైలాగ్ ఈ సినిమా మీద అంచనాలు పెంచేసింది. మంజు వారియర్, రోహిణి, అభిరామి, రితికా సింగ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమాను టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించారు.

కోలుకుంటున్న రజనీకాంత్

● ఆయన ఆరోగ్యంపై ప్రధాని ఆరా

తీవ్ర అస్వస్థతకు గురై చెన్నై నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ క్రమంగా కోలుకుంటున్నారు. గురువారం డిశ్చార్జ్ అయ్యే అవకాశముందని ఆసుపత్రివర్గాలు వెల్లడించాయి. ఇంటికి చేరిన తర్వాత ఆయన వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సివుంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలావుండగా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రజనీ ఆరోగ్యం గురించి ఆయన సతీమణి లతా రజనీకాంత్‌కు ఫోన్ చేసి వాకబు చేశారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



శ్వాగ్ లాంటి సినిమా తీయడం కష్టం



'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణు, రీతూ వర్మ నటించిన చిత్రం 'శ్వాగ్'. టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిష్ణు మాట్లాడుతూ "ఇది చాలా పెద్ద కథ. ఇలాంటి కథను తెరకెక్కించడం అంత ఈజీ ఏం కాదు. ఇందులో నాలుగు పాత్రలు పోషించాను. హసిత్ ఈ సినిమాను చాలా బాగా హ్యాండిల్ చేశారు" అని చెప్పారు. "గూఢచారి', 'బేబీ' 'కార్తికేయ' వంటి సినిమాల్లా.. మార్కెట్ కంటే ఎక్కువ స్పాన్ ఉన్న చిత్రం 'శ్వాగ్. కచ్చితంగా ఘనవిజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది" అని నిర్మాత టీ.జీ.విశ్వప్రసాద్ అన్నారు. "నిర్మాత విశ్వప్రసాద్ మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. శ్రీవిష్ణు కథను హీరోగా భావించే సినిమా చేసే గొప్ప నటుడు" అని డైరెక్టర్ హసిత్‌గోలి చెప్పారు. "ఇందులోని ప్రతీ పాత్ర కొత్తగా ఉంటుంది. సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది" అని హీరోయిన్ రీతూ వర్మ తెలిపారు.

'గాంధీ' కోసం రెహమాన్ సంగీతం



బాలీవుడ్ డైరెక్టర్ హన్సల్ మెహతా దర్శకత్వంలో మహాత్ముడి జీవితం ఆధారంగా 'గాంధీ' సిరీస్ తెరకెక్కుతోంది. గాంధీ జయంతి సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన ఓ కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం షేర్ చేసుకుంది. ఈ సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారని ప్రకటించింది. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ 'దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ జీవిత కథను ఈ సిరీస్ స్ఫూర్తిదాయక రీతిలో ప్రజెంట్ చేస్తుంది. అటువంటి గొప్ప పోరాట యోధుడి బయోపిక్‌కు సంగీతం అందించటం ఆనందంగా ఉంది" అని అన్నారు. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్రన్ గుహ రాసిన 'గాంధీ బిఫోర్ ఇండియా' పుస్తకం ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కుతోంది. అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది.

ఇన్ ప్రోగ్రెస్

విలన్ ఎవరనేది సస్పెన్స్



'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రంతో పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా పరిచయమవుతున్నారు. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు. ఈ నెల నాలుగున విడుదలవుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను రానా విడుదల చేసి, సుదర్శన్‌కు అభినందనలు తెలిపారు. సస్పెన్స్ జానర్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాలో విలన్ ఎవరన్నది తెలియకుండా ట్రైలర్‌ను కట్ చేసిన విధానం దర్శకుని ప్రతిభను విదితం చేసింది. వరలక్ష్మి శరత్‌కుమార్, శ్రీదీక్ష, నాజర్, రఘుబాబు తదితరులు నటించారు.

ప్రేక్షకులు మెచ్చే ప్రేమకథ



శ్రీనివాస్ మహత్ దర్శకత్వంలో చంద్రహాస్ హీరోగా నటించిన చిత్రం 'రామ్‌నగర్ బన్నీ'. మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మిస్తున్నారు. ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు రామ్‌గోపాల్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'రామ్‌నగర్ బన్నీ' ప్రచార చిత్రాలతో సినిమాపై ఆసక్తి పెరిగింది. చంద్రహాస్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలి' అని ఆకాంక్షించారు. మా టీం అంతా ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు అని దర్శకుడు చెప్పారు. ప్రేక్షకులు 'రామ్‌నగర్ బన్నీ' చిత్రాన్ని ఆదరించాలని ప్రభాకర్ కోరారు. ప్రేక్షకులను ఆకట్టుకునే వినోదంతో పాటు మంచి ప్రేమకథ ఉన్న చిత్రమిది, ప్రేక్షకులను మెప్పిస్తుందని చంద్రహాస్ చెప్పారు.

దీక్ష.. పట్టుదల



కిరణ్‌కుమార్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ దర్శకత్వంలో పినిశెట్టి అశోక్‌కుమార్ నిర్మిస్తున్నారు. 'దీక్ష, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్‌తో చిత్రాన్ని తీశాం. హీరోగా కిరణ్‌కు ఎంతో పేరు తెచ్చే సినిమా ఇది. రాజ్‌కిరణ్ స్వరపరిచిన పాటలు ఆకట్టుకుంటాయి. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. మా నిర్మాత అశోక్‌కుమార్‌గారు వెనుకుండి మమ్మల్ని నడిపిస్తున్నారు' అని చెప్పారు సినిమాలో ఐటెం సాంగ్ చేసిన అక్సాఖాన్ మాట్లాడుతూ 'ఇందులో అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమాతో పాటు 16 భాషల్లో వస్తున్న 'మహిళా కబడ్డీ' సినిమాలోనూ ఆర్ కె గౌడ్ అవకాశం ఇచ్చారు' అని తెలిపారు.

ట్వెల్త్ ఫెయిల్‌కు ప్రీక్వెల్



విధువినోద్ చోప్రా దర్శకత్వంలో తెరకెక్కిన 'ట్వెల్త్ ఫెయిల్' బయోపిక్ ప్రేక్షకుల నుంచి ఎంతటి ఆదరాభిమానాలను అందుకుందో తెలిసిందే. విక్రాంత్ మస్సే ఇందులో ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ మనోజ్ కుమార్ శర్మగా.. కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో.. 'ట్వెల్త్ ఫెయిల్' సినిమాకు ప్రీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'జీరో సే రీస్టార్ట్' సినిమాను డిసెంబరు 13న విడుదల చేయనున్నట్లు విధువినోద్ చోప్రా ప్రకటించారు. "మొదటి భాగంలో ఉన్న నటీనటులే ఇందులోనూ కొనసాగుతారు. ఈ ప్రీక్వెల్ కథానాయకుడి బ్యాక్ స్టోరీపై ఫోకస్ చేస్తుంది. ఇందులో మనోజ్ కుమార్ జీవితాన్ని మార్చేసిన సంఘటనలను ఆసక్తికరంగా చూపించనున్నాం" అని చెప్పారు.

ఆ నేపథ్యంలో ఎవరూ చేయని సినిమా



'కరోనా సమయంలో ఆత్మహత్యలు చేసుకొనే వారి సంఖ్య పెరిగింది. అలాంటి ప్రయత్నం చేసినప్పుడు ఎవరైనా అడ్డుకుని వారిని ఆ ఆలోచనకు దూరం చేస్తే బాగుంటుంది.. అనే పాయింట్‌తో దర్శకుడు శివశేష రాసుకున్న కథ విన్నప్పుడు నాకు కొత్తగా అనిపించింది. ఇలాంటి నేపథ్యంలో ఎవరూ సినిమా చేయలేదనిపించి, నా సమర్పణలో 'కలి' చిత్రాన్ని నిర్మించాం' అన్నారు సీనియర్ జర్నలిస్టు రాఘవేంద్రరెడ్డి. ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన 'కలి' చిత్రం ఈ నెల నాలుగున విడుదల కానుంది. లీలా గౌతమ్ నిర్మాత. ఈ నేపథ్యంలో రాఘవేంద్రరెడ్డి చిత్ర విశేషాలను మీడియాకు వెల్లడిస్తూ 'శివరామ్ అనే మంచి వ్యక్తి తన జీవితంలో ఎదురైన కొన్ని ఇబ్బందుల వల్ల ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటాడు. ఆ సమయంలో ఒక అపరిచిత వ్యక్తి అతని ఇంటికి వస్తాడు. అతని రాకతో శివరామ్ జీవితం ఎలా మారింది అనేది 'కలి' కథ. ఎలాంటి సందేశాలు, ఉపోద్ఘాతాలు లేకుండా సినిమా తీశాం. నిర్మాణపరంగా ఎక్కడా రాజీపడలేదు.. ఇందులో బల్లి పాత్రకు ప్రియదర్శి, గోడ గడియారంకు అయ్యప్ప పి.శర్మ డబ్బింగ్ చెప్పారు' అని చెప్పారు రాఘవేంద్రరెడ్డి. దర్శకుడు శివ శేష ప్రతిభావంతుడనీ, పురాణాల మీద మంచి పట్టు ఉందని తెలిపారు. సినిమా మేకింగ్ మీద ప్యాషన్‌తో లీలా గౌతమ్ వర్మ నిర్మాణరంగంలోకి వచ్చారనీ, నిర్మాతగా అతనికి మంచి భవిష్యత్ ఉంటుందని రాఘవేంద్రరెడ్డి చెప్పారు.

దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ బాలాత్రిపురసుందరీదేవి
ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి, గురువారం



శరన్నవరాత్రి ఉత్సవాలలో మొదటి రోజున శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో బెజవాడ కనకదుర్గమ్మ భక్తులకు దర్శనవిస్తారు. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనదనీ, శ్రీ బాలా మంత్రం సమస్త దేవీమంత్రాల్లోకెల్లా అత్యున్నతమైనదనీ ఆధ్యాత్మికులు చెబుతారు. అందుకే శ్రీవిద్యోపాసకులకు మొట్టమొదటగా ఈ మంత్రాన్ని ఉపదేశిస్తారు. షోడశ విద్యలకు ఆమె అధిష్ఠాన దేవత. కాబట్టి ఉపాసకులు త్రిపురసుందరీదేవి అనుగ్రహం కోసం బాలార్చన చేస్తారు. త్రిపురాత్రయంలో బాలాత్రిపుర సుందరీదేవి మొదటి స్వరూపం. మహాత్రిపురసుందరీ దేవి నిత్యం కొలువుండే పవిత్రమైన శ్రీచక్రంలో తొలి ఆమ్నాయంలో ఉండే తొలి దేవత బాలాదేవి. అందుకే ముందుగా బాలాదేవి అనుగ్రహం పొందితేనే మహా త్రిపురసుందరీదేవి అనుగ్రహాన్ని పొందగలరని పెద్దలు చెబుతారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు పూర్ణ ఫలం అందించే అలంకారం బాలాత్రిపురసుందరీదేవి. ఈ తల్లిని ఆరాధిస్తే మనోవికారాలు తొలగిపోతాయనీ, సర్వ సంపదలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ రోజు రెండు నుంచి పదేళ్లలోపు బాలికలను అమ్మవారి స్వరూపంగా భావించి పూజిస్తారు. 'లలితా త్రిశతి' పారాయణ చేస్తారు.

నైవేద్యం: పాయసం, పులగం
అలంకరించే చీర రంగు: లేత గులాబీ రంగు
అర్చించే పూల రంగు: అన్ని రకాలు
పారాయణ: లలితా త్రిశతి





వాళ్ల జీవితం వ్యక్తిత్వ వికాస పాఠం

పొలంలో విత్తడం మొదలు అది ఇంటికి ధాన్యంగా చేరి, కంచంలో అన్నంగా మారే వరకు... ప్రతి దశలో మహిళా రైతు కూలీల శ్రమ వెలకట్టలేనిది. దేశానికి అన్నం పెట్టే ఆ అన్నపూర్ణల జీవితం నిండా కన్నీటి గీతాలు, పోరాట గాథలే.! వాటిని సజీవ చిత్రాలుగా మన కళ్లముందుంచారు పూణెకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ విద్యా కులకర్ణి. అందుకోసం తెలంగాణ, మహారాష్ట్ర, పంజాబ్ పల్లెల్లో రోజుల తరబడి తిరిగారామె. శ్రమైక జీవన సౌందర్యానికి అద్దంపట్టే ఆ దృశ్యకావ్యాలను 'కల్టివేటింగ్ ఫ్యూచర్స్' పేరుతో హైదరాబాద్‌లో ప్రదర్శించిన సందర్భంగా విద్యను 'నవ్య' పలకరించింది.

రైతు అనగానే తలకు వస్త్రాన్ని చుట్టి పొలంలో శ్రమిస్తున్న పురుషుడి రూపం మాత్రమే మన ఊహకు అందుతుంది. నిజానికి విత్తనాలు వేయడం మొదలు ఎరువు చల్లడం, కలుపు తీయడం, పంట కోయడం తదితర పనులన్నింటిలో మహిళల చాకిరి మాటలకు అందనిది. ఆ సంగతి మనందరికీ తెలిసినా, ఆమె శ్రమ పట్ల సమాజానికి పెద్దగా పట్టింపు ఉండదు. అన్నీరంగాల్లో ఉన్నట్టే ఇక్కడా వారి భాగస్వామ్యానికి తగిన గుర్తింపు, గౌరవం లేదు. మనం అంగీకరించినా, లేకున్నా వ్యవసాయ రంగానికి వెన్నెముక మహిళలు. దేశానికి గోరుముద్దలు తినిపిస్తున్న ఆ అమ్మలు ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా అంత సాధారణమైనవి ఏమీ కావు. ఒక్కొక్కరి జీవితం ఒకొక్క యుద్ధ క్షేత్రమైతే, అందులో వారు గెలవడానికి సాగిస్తోన్న పోరాటం అసామాన్యమైనది. నిజమైన ఈ హీరోల గాథలను లోకానికి తెలియజేయాలన్న సంకల్పంతో 'మహిళా కిసాన్ అధికార్ మంచ్' (మకాం) తెలంగాణ, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాల్లో క్షేత్ర స్థాయి అధ్యయనం సాగించింది. మహిళా రైతు, కూలీల జీవితాలను దృశ్యమానం చేయడానికి ఫొటోగ్రాఫర్‌గా మకాం బృందం వెంట నేనూ మూడు రాష్ట్రాలలోని కొన్ని గ్రామాలకు వెళ్లాను. ఆ సమయంలో నేను తీసిన ఫొటోలను 'కల్టివేటింగ్ ఫ్యూచర్స్' పేరుతో హైదరాబాద్‌లో రెండు రోజులు ప్రదర్శించాం. దానికి మంచి ఆదరణ లభించింది. మా ఫొటో ఎగ్జిబిషన్ చూసినవారంతా ఛాయా చిత్రాలన్నీ సజీవమైన దృశ్యకావ్యాలుగానూ, అత్యంత హృద్యంగానూ ఉన్నాయని కొనియాడుతుంటే ఎంతో సంతోషంగా అనిపించింది.

అదొక కొత్త అనుభూతి...

నా పల్లె అనుభవాలు చెప్పేముందు, నా నేపథ్యం గురించి ఇక్కడ కొంత ప్రస్తావించాలి. నేను పుట్టి, పెరిగిందంతా పూణెలోనే.! అక్కడే జర్నలిజం పూర్తి చేసి, స్థిరపడ్డాను. మూడు దశాబ్దాలుగా మహిళా హక్కుల ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉన్నాను. మొదట ఒకటిరెండు ఆంగ్ల పత్రికల్లో పాత్రికేయురాలిగా పనిచేసినా, ఫొటోగ్రఫీ మీద ఆసక్తితో ఫ్రీలాన్స్ ఫొటో జర్నలిస్టుగా మారాను. ఆ క్రమంలో



కొన్నిసార్లు గ్రామీణప్రాంతాలకూ వెళుతుంటాను. కానీ మకాం అధ్యయనం కోసం తెలంగాణ జిల్లాల్లో పది రోజులు, మహారాష్ట్రలో నెలరోజుల పాటు పల్లెల్లో తిరిగి మహిళా రైతు, కూలీలతో సంభాషించడం, వారి జీవితాలను చాలా దగ్గరగా చూడడం మాత్రం నాకు కొత్త అనుభూతిని కలిగించింది. ఇంకా చెప్పాలంటే, ప్రతి గ్రామీణ మహిళ జీవితం ఒక వ్యక్తిత్వ వికాస పాఠం. మంచిర్యాల జిల్లా వెంకటాపురం పరిధిలోని ఒక తండాలో... స్వయం సహాయక బృంద సభ్యురాళ్లు కొందరు సమష్టిగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మూడేళ్లుగా నిర్వహిస్తున్నారు. వారి నిబద్ధత, నిజాయితీ, పారదర్శకత చూసి ముగ్ధురాలినయ్యాను. నల్గొండ జిల్లాలోని ఒక గ్రామంలో మంజుల అనే రైతు... ఇల్లు, పొలాన్ని వదిలి భర్త వెంట పట్టణానికి వలస వెళ్లడం ఇష్టంలేక, ఒంటరిగా సొంతూరులో వ్యవసాయం చేస్తుండటం చూసి నిర్ఘాంతపోయాను. ఆమె సాహసం నన్ను కట్టిపడేసింది.

వారి స్థైర్యానికి హ్యాట్సాఫ్...

మహారాష్ట్రలోని కొన్ని జిల్లాలలో కుటుంబాలన్నీ దీపావళి తర్వాత చెరుకు కోతలకు ఉస్మానాబాద్, బీడ్, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు ఆరునెలల పాటు వలస వెళతాయి. అంత కాలం వారంతా చిన్న గుడిసెల్లో తలదాచుకుంటారు. అక్కడ మహిళా రైతు కూలీల భద్రత అతి పెద్ద ప్రశ్న. నీరు, మరుగుదొడ్డి లాంటి కనీస సౌకర్యాలు సరిగ్గాలేక వారెంత నరకం అనుభవిస్తున్నారో కళ్లారా చూశాం. గ్రామాల్లో ఒంటరి మహిళల జీవితం వర్ణనాతీతం. భర్తను కోల్పోయిన ఒక మహిళా రైతు... తాను ఒంటరిగా పొలానికి వెళుతున్నప్పుడు మనసులో కలిగే భయాందోళనల గురించి చెబుతుంటే నా మనసును మెలిపెట్టినట్టు అయింది. ఇరుగుపొరుగు సూటిపోటు మాటలు, అవమానాలు, లైంగిక వేధింపులు ఇక అవి చెప్పేవి కావు. అయినా, వాటన్నింటినీ పంటిబిగువున భరిస్తూ, ముందుకెళుతున్న వారి స్థైర్యానికి హ్యాట్సాఫ్! అప్పుల బాధతో భర్త ఆత్మహత్య చేసుకున్నా, పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్న సంకల్పంతో నాగలి పట్టిన ఆ తల్లుల మనోబలం ముందు విధినైతం తలవంచడం కళ్లారా చూశాను.

అందుకు నా వంతు ప్రయత్నం...



హరితవిప్లవానికి పుట్టినిల్లుగా చెప్పే రాజస్థాన్‌లోనూ రైతుల ఆత్మహత్యలు ఎక్కువ ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వ్యవసాయ పనులు యాంత్రీకరణ చెందిన రాష్ట్రం అది. ఇక అక్కడి రైతుల ఇళ్లు, పొలం చూసి ధనికులనుకొంటాం. కానీ పంటకు గిట్టుబాటు ధర లభించక, బ్యాంకు రుణాలు చెల్లించలేక యువ రైతులు ఊపిరి తీసుకొంటున్నారు. అలాంటి కుటుంబాల్లో మహిళలు బాధపడుతూ ఇంటికే పరిమితం అవ్వకుండా, పొలంబాట పడుతున్నారు. అప్పులు తీర్చుతూ, కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఇలా వ్యవసాయ రంగంలోని మహిళల భాగస్వామ్యాన్ని, వారి శ్రమశక్తిని కళ్లకు కడుతూనే... జీవితాల్లోని భిన్న పార్శ్వాలను నా కెమెరాతో బాహ్యప్రపంచానికి కొంత మేరకైనా చూపించగలగాను. అందుకు నాకు తృప్తిగా ఉంది. ప్రతి సంఘటన వెనుక ఒక వాస్తవం దాగి ఉంటుంది. దాన్ని వెలుగులోకి తేవడం ఫొటోగ్రాఫర్‌గా నా బాధ్యత. దాన్ని నిర్వర్తించడంలో నా వయసును కూడా లక్ష్యపెట్టను. ఇప్పుడు నాకు 61ఏళ్లు. అయినా ఈ ప్రయాణాలు నాకు ఎంతమాత్రం ప్రయాస కాదు. మన కనురెప్పను తాకని ఎంతో మంది శ్రమ జీవుల జీవన సౌందర్యాన్ని నా కెమెరా ద్వారా ఈ లోకానికి చూపించడానికి నావంతు ప్రయత్నిస్తాను.



• సాంత్వన్

కౌన్సెలింగ్

వరుస గర్భస్రావాలను ఆపేదెలా?

డాక్టర్! నా వయసు 29. పెళ్లై ఏడేళ్లయింది. ఈ ఏడేళ్లలో పలు సార్లు అబార్షన్లు అయ్యాయి. మొదటిసారి గర్భం దాల్చినప్పుడు, మూడు నెలలకే పిండంలో ఎదుగుదల లేదనే కారణంతో గర్భస్రావం చేయించుకోవలసి వచ్చింది. రెండోసారి కూడా ఇలాగే జరిగింది. ముందు కూడా ఇదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలున్నాయని వైద్యులు అంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించుకుని, పండంటి బిడ్డను కనే మార్గం లేదా?

- ఓ సోదరి, హైదరాబాద్.

రెండు, అంతకంటే ఎక్కువ సార్లు గర్భస్రావాలైతే, ఆ పరిస్థితిని రికరెంట్ ప్రెగ్నెన్సీ లాస్ అంటారు. ఇలాంటి వాళ్లు తప్పనిసరిగా కొన్ని పరీక్షలు చేయించుకోవాలి. మరీ ముఖ్యంగా జన్యుపరమైన కారణాలున్నాయేమో పరీక్షించుకోవలసి ఉంటుంది. అందుకోసం భార్యాభర్తలిద్దరి జెనెటిక్ అనాలసిస్ చేయించుకోవాలి.

కుటుంబంలో వరుస గర్భస్రావాలు జరుగుతున్న సందర్భాలు ఉన్నప్పుడు కూడా జన్యుపరమైన సమస్యగానే పరిగణించాలి. అలాగే ప్రెగ్నెన్సీకి వ్యతిరేకంగా శరీరంలో యాంటీబాడీస్ పెరగడం వల్ల గర్భస్రావం జరుగుతుందేమో కూడా తెలుసుకోవాలి.



అలాగే థైరాయిడ్, మధుమేహాలను కూడా పరీక్షించుకోవాలి. వీటితో పాటు రక్తం గడ్డకట్టే తత్వం ఎక్కువగా ఉన్నప్పుడు, బిడ్డకు రక్తసరఫరాలో అంతరాయం ఏర్పడి, గర్భస్రావం జరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఆ అంశాన్ని కూడా పరీక్షించుకోవాలి. ఈ పరీక్షలన్నీ చేయించుకుని, అసలు సమస్యను కనిపెట్టి, తగిన చికిత్సను ఎంచుకోగలిగితే, ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించే వీలుంటుంది. కాబట్టి మీరు మొదట ఈ పరీక్షలన్నీ చేయించుకుని, మూల కారణాన్ని కనిపెట్టి, గర్భం దాల్చే ప్రయత్నం చేయడం ఉత్తమం.

- డాక్టర్ మంజుల అనగాని
హెచ్ఓడి ఆఫ్ గైనకాలజీ, కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్.

సెలబ్ ఫిట్

అందానికి చక్కని అభినయం కూడా తోడైతే... ఆమే దివ్యా దత్తా. మూడు పదులు దాటిన కెరీర్... అరవైకి పైగా చిత్రాలు... నలభై ఏడేళ్ల వయసులోనూ తరగని గ్లామర్‌తో అలరిస్తోంది. జనసామాన్యానికి దగ్గరైన పాత్రలతో... విలక్షణ నటిగా... ప్రేక్షకుల చప్పట్లే కాదు... ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులూ గెలుచుకుంది. కష్టపడే తత్వం... శారీరక, మానసిక ఆరోగ్యం... ఇవే తన విజయ దరహాసానికి కారణం అంటుంది దివ్య.



దివ్యమైన రూపం

వయసు పైబడుతున్నకొద్దీ కథానాయికలకు అవకాశాలు తగ్గిపోతుంటాయి. కానీ దివ్యా దత్తా అందుకు మినహాయింపు. వయసుతో పాటు ఆమె పోషించే పాత్రల్లో కూడా పరిణతి కనబడుతుంది. 1994లో 'ఇష్క్ మే జీనా ఇష్క్ మే మర్‌నా'తో తొలిసారి వెండితెర మీద మెరిసిన దివ్య... ఆ మరుసటి ఏడాది 'వీర్‌గతీ'లో సల్మాన్‌ఖాన్‌కు జోడీగా నటించింది. ఆ సినిమా విజయం సాధించకపోయినా ఆమె నిరాశ చెందలేదు. ప్రధాన పాత్రల కోసం కూర్చోకుండా... ప్రాధాన్యమున్న పాత్రల్లో ఒదిగిపోయింది. 'వీర్ జారా, భాగ్ మిల్కా భాగ్, వెల్కమ్ టూ సజ్జన్‌పూర్, ఢిల్లీ6, హీరోయిన్' తదితర చిత్రాల్లో అద్భుతమైన నటనతో అభిమానులను సంపాదించుకుంది. మొన్నామధ్య విడుదలైన 'శర్మాజీ కీ బేటీ' చిత్రానికి మంచి ఆదరణ లభించింది. ప్రముఖుల ప్రశంసలు సైతం అందుకుంది. కాలంతో పాటు తనూ మారుతున్నానని, రోల్స్ ఎంపికలో శ్రద్ధ వహిస్తున్నానని, అందుకే భిన్నమైన కథలు వస్తున్నాయని ఓ సందర్భంలో చెప్పింది దివ్య. విశేషమేమంటే... హీరోల కోసం సృష్టించిన కొన్ని పాత్రలను తాను పోషించడం.

"కెరీర్ ఆరంభంలో వైవిధ్యమైన కేరెక్టర్లు అనేకం వచ్చేవి. అయితే నాకూ ఒక అభిరుచి ఉంటుంది కదా... 'ఇలాంటి రోల్స్ చేయాలి' అని. నిదానంగా అలాంటి కథలు రావడం మొదలయ్యాయి. అంటే నేను 'నో' చెప్పలేనివి. కానీ రాత్రికి రాత్రి ఇవన్నీ జరిగిపోలేదు. కొన్నేళ్ల కఠోర శ్రమ ఫలితం. ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఈ స్థాయికి చేరాను. అన్నిటి కంటే సంతృప్తిని, సంతోషాన్ని ఇచ్చింది ఏమిటంటే... మగ నటులను దృష్టిలో పెట్టుకొని, వారి కోసం రాసుకున్న కొన్ని పాత్రలు నేను చేయడం. ఇలాంటివి పరిశ్రమలో చాలా అరుదుగా జరుగుతాయి" అంటున్న దివ్య... స్వస్థలం పంజాబ్‌లోని లుథియానా. తల్లి నళిని దత్తా వైద్యురాలు. దివ్యకు ఏడేళ్లప్పుడు ఆమె తండ్రి మరణించారు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యతలను తల్లి నళిని తీసుకున్నారు. తన ఇద్దరు పిల్లలకూ ఏ లోటూ రాకుండా చూసుకున్నారు. 'ధీశాలి' అంటూ తన తల్లి గురించి దివ్య పలు సందర్భాల్లో చెప్పింది. 'మా అమ్మే నాకు స్ఫూర్తి. చిన్న వయసులోనే నాన్న మాకు దూరమైతే... ఒంటరిగా నన్ను, తమ్ముడినీ పెంచింది. వృత్తిలో ఎంత ధైర్యంగా, నిజాయతీగా ఉంటుందో... ఇంట్లో మాతో అంత సరదాగా గడిపేది' అంటూ గతంలో ఓసారి తన చిన్ననాటి రోజులు గుర్తు చేసుకుంది దివ్య. 'గిప్పి' చిత్రంలో పప్పీ పాత్రకు తన తల్లినే ప్రేరణగా తీసుకుంది. నళిని రాసుకున్న కవితలను దివ్య, ఆమె సోదరుడు కలిసి ఒక పుస్తకంగా అచ్చు వేయించారు.

దివ్య మామయ్య దీపక్ బారీ దర్శకనిర్మాత. లుథియానాలోని ఓ కాన్వెంట్‌లో చదివిన ఆమె... తొలుత పంజాబ్‌లో మోడలింగ్ చేసింది. లండన్ సంగీత ద్వయం బేస్‌మెంట్ జాక్స్ రూపొందించిన మ్యూజిక్ వీడియో 'రోమియో'లో నటించింది. అదే సమయంలో చిత్ర సీమలోకి అడుగు పెట్టింది. సినిమాలతో పాటు టీవీ, వెబ్‌సిరీస్‌లు కూడా చేసింది. ఎవర్‌గ్రీన్ నటిగా అభిమానుల ప్రశంసలు అందుకొంటున్న దివ్య... చేపట్టే ప్రాజెక్టుల విషయంలోనే కాదు... ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన జీవనశైలిపై కూడా ఎంతో శ్రద్ధ పెడుతుంది.

ఇదీ మెనూ...



ఆహార విషయంలో తన అమ్మమ్మ, తాతయ్యలే దివ్యకు ఆదర్శం. స్వచ్ఛమైన, తాజా ఇంటి వంటకు ఆమె ప్రాధాన్యం ఇస్తుంది. గోధుమ, పంచదార, ప్రాసెస్డ్, జంక్‌ఫుడ్స్‌కు దూరం. ఎప్పుడన్నా తీపి పదార్థాలు తినాలని అనిపిస్తే చెరుకు గడ తీసుకొంటుంది.

- ఉదయం లేవగానే సోంపు గింజలతో గ్లాసుడు గోరువెచ్చటి నీరు.
- బ్రేక్‌ఫాస్ట్‌లో పోహా/ఓట్స్, తాజా పండ్లు.
- మధ్యాహ్న భోజనంలో పప్పు, ఉడకబెట్టిన కూరగాయలతో జొన్న రొట్టెలు, సలాడ్.
- సాయంత్రం వేళ మఖానా, జీడిపప్పు, బాదం/ లేదంటే పండ్లు
- డిన్నర్‌కు పప్పు అన్నం లేదంటే సూప్

వర్కవుట్ ఇలా...

దివ్య దృష్టిలో ఫిట్‌నెస్ అంటే సిక్స్ ప్యాక్‌ల్లాంటివి తెచ్చుకోవడం కాదు. 'అద్దంలో నన్ను నేను చూసుకున్నప్పుడు ఆనందం కలగాలి. చికాకుగా అనిపించకూడదు. మన జీవనశైలిలో ఫిట్‌నెస్ అనేది కీలకం. అయితే ఎవరి శరీర తత్వాన్ని బట్టి వారు వ్యాయామాలు చేయాలి' అంటున్న దివ్య వారంలో ఐదు రోజులు జిమ్‌కు వెళుతుంది. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలో కూడా తనకు తెలుసంటారు దివ్య. 'అది అంత సులువైంది కాదు. కానీ సాధనతో అలవాటు చేసుకున్నా. బాగా ఒత్తిడి అనిపిస్తే దగ్గరలోని ఏదోఒక వస్తువుపై దృష్టి కేంద్రకరించి, పది అంకెలు లెక్కపెడతా. శరీరాన్ని ఎలాగైతే ట్రైన్ చేస్తామో... మనసును కూడా అలాగే నియంత్రణలో ఉంచుకోవాలి' అంటుంది ఆమె.

- ఉదయం లేవగానే ఇరవై నిమిషాలు కార్డియో
- వెయిట్‌లిఫ్టింగ్ తదితర వ్యాయామాలతో స్ట్రెంత్ ట్రెయినింగ్
- అధిక కేలరీలు కరిగించాల్సి వస్తే వర్కవుట్స్ తీవ్రతను పెంచుతుంది.
- ఆక్వా జుంబా దివ్యకు చాలా ఇష్టం
- ఒకవేళ జిమ్ అందుబాటులో లేకపోతే స్విమ్మింగ్, డ్యాన్సింగ్, యోగా.
- బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఏదైనా కారణంతో హోటల్ గదికే పరిమితం కావాల్సి వస్తే... సూర్య నమస్కారాలు చేయడం ఆమెకు అలవాటు.

ఈ పదేళ్ల చిన్నారి కాలుష్యాన్ని కడిగేస్తోంది

సముద్రాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ చెత్త పర్యావరణ నిపుణులను భయపెడుతోంది. ఇది ఇలాగే కొనసాగితే 2050 కల్లా సముద్రాల్లో ఒక్క చేప కూడా కనిపించదని వారు అంటున్నారు. అయితే ఈ మాటలను పట్టించుకునే వారే లేరు. కానీ చెన్నైకు చెందిన పదేళ్ల తారగై ఆరాధన మాత్రం మెరైన్ పొల్యూషన్‌ను తొలగించే బాధ్యతను తీసుకుంది. స్క్యూబా డైవర్‌గా మారి సముద్రంలో ప్లాస్టిక్‌ను ఏరివేసే పని ప్రారంభించింది. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'సేవ్ ద ఓషన్' పేరుతో పదకొండున్నర గంటలు ఈది రికార్డు నెలకొల్పింది. ఆ చిన్నారి విశేషాలు మరికొన్ని ఇవి...

'పర్యావరణ సమతుల్యత దెబ్బతినకూడదంటే సముద్రాలను కాపాడుకోవాలి. ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా క్లాత్ బ్యాగులు వాడాలి' అంటూ ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తుంది తారగై ఆరాధన. పదేళ్ల వయసులోనే పర్యావరణ కార్యకర్తగా మారి మెరైన్ లైఫ్ ప్రొటెక్షన్ కోసం పనిచేస్తుంది. ఇండియా యంగెస్ట్ పీఏడీఐ సర్టిఫైడ్ డైవర్‌గా ఆ చిన్నారి గుర్తింపు పొందింది. మెరైన్ ప్లాస్టిక్ పొల్యూషన్‌పై అవేర్‌నెస్‌ను కల్పించడం కోసం శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి ధనుష్‌కోడి వరకు ఈది అందరి మన్ననలు అందుకుంది. తారగై సర్టిఫైడ్ డైవర్‌గా మారడంలో ఆమె తండ్రి అరవింద్ తరుణ్‌శ్రీ కృషి ఉంది. తండ్రి స్ఫూర్తితోనే ఆమె ఈ రంగంలోకి వచ్చింది. అరవింద్ ప్రొఫెషనల్ స్క్యూబా డైవర్, ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్. తారగై ఎనిమిదేళ్ల వయసులోనే డైవింగ్ చేయడం మొదలుపెట్టింది. "తారగై పుట్టిన మూడో రోజే నీళ్లలో దింపాను. తొమ్మిదినెలలు వచ్చే సరికి నీళ్లపై తేలియాడింది. రెండున్నర ఏళ్లు వచ్చేసరికి ఈదడం నేర్చుకుంది" అని తండ్రి అరవింద్ చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు తారగై సముద్రంలో నుంచి 1200 కేజీల ప్లాస్టిక్‌ను తొలగించింది.



ఎనిమిదో యేటనే స్క్యూబా డైవింగ్

తారగై తన ఎనిమిదో పుట్టిన రోజున మొదటిసారి స్క్యూబా డైవ్ చేసింది. "మొదటిసారి స్క్యూబా డైవ్ చేసిన రోజు ఎప్పటికీ మరిచిపోలేను. ఆ రోజు నా ఎనిమిదో పుట్టిన రోజు. సముద్రంలో జెల్లీ ఫిష్, జాక్‌ఫిష్, కోరల్స్ చూడటం ఎంతో ఆనందాన్నిచ్చింది" అంటుంది తారగై. ప్రతి ఆదివారం తారగై బీచ్‌లను శుభ్రం చేసేందుకు వెళుతుంది. అదే సమయంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తూ ఉంటుంది. "అందరినీ నేను కోరేది ఒక్కటే. ప్లాస్టిక్ బదులుగా క్లాత్ బ్యాగ్‌ను ఇవ్వమని అడగండి. ఈ ఒక్క పని ఎంతో మార్పును తీసుకొస్తుంది" అని అంటుంది తారగై. కొవెలాంగ్ నుంచి నీలాంకరి వరకు 18 కి.మీ దూరం ఈది ప్రపంచరికార్డును నెలకొల్పింది. 'సేవ్ ద ఓసియన్' థీమ్‌తో ఈ రికార్డును సాధించింది. "నేను ఈదడం ప్రారంభించగానే వర్షం మొదలయింది. నీళ్లు బాగా చల్లగా ఉన్నాయి. కానీ ఏడుగంటల ప్రయాణాన్ని చాలా ఎంజాయ్ చేశాను" అని అంటుంది.



సముద్ర కాలుష్యంపై స్కూల్స్, బీచ్‌లలో అవేర్‌నెస్‌ను కల్పించడం కోసం తండ్రీ కూతుళ్లు ఇద్దరూ కలిసి ఒక డాక్యుమెంటరీ రూపొందించి విడుదల చేశారు. హవాయి మాంక్ సీల్స్ పసిఫిక్ లాగర్‌హెడ్ సముద్ర తాబేళ్ల వంటి అరుదైన కొన్ని రకాల జాతులు ప్లాస్టిక్ చెత్త వల్ల అంతరించి పోయే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఇండియా తీరప్రాంతం 33.6 శాతం మేర కోతకు గురైనట్టు అధ్యయనాల్లో వెల్లడయింది. ప్రకృతికి వ్యతిరేకంగా వెళ్లడం మంచిది కాదని, ప్లాస్టిక్ తయారీని నియంత్రించడం చాలా అవసరమని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. అందరూ తారగై ఆరాధనను స్ఫూర్తిగా తీసుకుని సముద్ర కాలుష్యాన్ని నివారించాల్సిన అవసరం ఉంది.

రూ.111 లక్షల కోట్లు

తొమ్మిది నెలల్లో పెరిగిన మార్కెట్ సంపద



న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో ఇప్పటివరకు భారత స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కనకవర్షం కురిపించింది. ఈక్విటీ సూచీల రికార్డు ర్యాలీతో మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.110.57 లక్షల కోట్లు పెరిగి మొత్తం 474.86 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. గతనెల 27న బీఎస్ఈ మార్కెట్ క్యాప్ ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.477.93 లక్షల కోట్లకు ఎగబాకింది. కానీ, గత మూడు సెషన్లలో వరుస నష్టాల కారణంగా సంపద కాస్త తగ్గుముఖం పట్టింది.

సెన్సెక్స్ 12,026 పాయింట్ల వృద్ధి

ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడుల దిక్సూచి సెన్సెక్స్ 2024 సంవత్సరంలో సెప్టెంబరు ముగిసే నాటికి ఏకంగా 12,026.03 పాయింట్లు (16.64 శాతం) పుంజుకుంది. 2024లో సూచీ పలు కీలక మైలురాళ్లను దాటేసింది. ఈ ఏడాది ఆరంభంలో 72,271 పాయింట్ల వద్దనున్న సెన్సెక్స్.. గత 9 నెలల్లో భారీగా ర్యాలీలో పురోగమిస్తూ ప్రస్తుతం 84,266 స్థాయికి చేరింది. గతనెల 27న సూచీ 85,978.25 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. దేశీయ ఆర్థిక మూలాలు బలంగా ఉండటంతోపాటు ద్రవ్య లభ్యత సమృద్ధిగా ఉండటం, రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు గణనీయంగా పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. గతనెలలో అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీరేట్లను ఒకేసారి అరశాతం తగ్గించడంతో సూచీ మరింత వేగంగా (83,000 నుంచి 85,000కు) ర్యాలీ తీసింది.

స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ 34% అప్

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మన మార్కెట్ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకున్నప్పటికీ, దేశీయ మ్యూచువల్ ఫండ్ల పెట్టుబడులు దన్నుగా నిలిచాయని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా అన్నారు. ముఖ్యంగా స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు ప్రధాన సూచీల కంటే అధిక రాబడులు పంచాయని, పలు కంపెనీల స్టాక్స్ ఇన్వెస్టర్లకు మల్టీ బ్యాగర్ లాభాలందించాయన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 12,645.24 పాయింట్లు (34.32 శాతం), స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 14,777.09 పాయింట్లు (34.62 శాతం) పెరిగాయి.

టాప్-5 లిస్టెడ్ కంపెనీలు

సంస్థ	రూ.లక్షల కోట్లు
రిలయన్స్ ఇండస్ట్రీస్	19.82
టీసీఎస్	15.50
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	13.16
భారతీ ఎయిర్‌టెల్	9.67
ఐసీఐసీఐ బ్యాంక్	8.98

గత ఏడాదిలో మార్కెట్ పనితీరు ఇలా..

2023 సంవత్సరంలో సెన్సెక్స్ 11,399.52 పాయింట్లు (18.73 శాతం) వృద్ధి చెందగా.. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.81.90 లక్షల కోట్లు పెరిగింది. గత ఏడాది నవంబరు 29న బీఎస్ఈ మార్కెట్ క్యాప్ తొలిసారిగా 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. కాగా, 5 లక్షల కోట్ల డాలర్ల మార్క్‌ను ఈ ఏడాది మే 21న అధిగమించింది.

కొంత దిద్దుబాటు తప్పదు..

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడంతోపాటు వచ్చే నెలలో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు కొంత దిద్దుబాటుకు లోనుకానున్నాయని ఈక్విటీ విశ్లేషకులు అన్నారు. అయినప్పటికీ, స్టాక్ ఆధారిత పెట్టుబడి అవకాశాలు లభించనున్నాయని, దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి మార్కెట్ దిద్దుబాటు కాలం సరైన సమయమని వారు పేర్కొన్నారు.

వడ్డీరేట్ల నిర్ణయంలో ఆహార ద్రవ్యోల్బణం కీలకమే

రఘురామ్ రాజన్



న్యూఢిల్లీ: కీలక వడ్డీరేట్లు నిర్ణయించే సమయంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని పరగణనలోకి తీసుకోరాదనే వాదనని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ తోసిపుచ్చారు. ఈ సూచనకు తాను పూర్తి వ్యతిరేకమన్నారు. అలా చేస్తే, ధరల కట్టడి కోసం ఆర్‌బీఐ అనుసరిస్తున్న విధానంపై ప్రజలకు నమ్మకం పూర్తిగా పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కీలక రెపోరేటు నిర్ణయించేటపుడు ఆహార ద్రవ్యోల్బణాన్ని మినహాయించాలని 2023-24 ఆర్థిక సర్వేలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ సూచించిన విషయం తెలిసిందే.

దీర్ఘకాలిక ప్రభావం: ఆహార ఉత్పత్తుల ధరలు స్వల్ప కాలంలో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేయకపోయినా, దీర్ఘ కాలంలో మాత్రం ఆ ప్రభావం తప్పక ఉంటుందని రాజన్ స్పష్టం చేశారు. వీటి ధరలు ఎక్కువ కాలం అధికంగా ఉంటే, డిమాండ్‌కు అనుగుణంగా వాటి ఉత్పత్తి కూడా కష్టమవుతుందన్నారు. ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు ఇతర వస్తువుల ధరల తగ్గింపుపై కేంద్ర బ్యాంకులు దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం మన దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం నిర్ణయంలో ఆహార ఉత్పత్తుల వాటా 46 శాతం వరకు ఉంది.

సెబీ చీఫ్‌పై ఆరోపణలు : సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌పై అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన తాజా ఆరోపణలపై రాజన్ స్పందిస్తూ సెబీ వంటి రెగ్యులేటరీ సంస్థల అధినేతల నడవడిక అనుమానాలకు తావు లేకుండా ఉండాలన్నారు. ఈ ఆరోపణలపై అనుమానాలకు తావు లేకుండా క్షుణ్ణంగా దర్యాప్తు జరగాలన్నారు. రెగ్యులేటరీ సంస్థల విశ్వసనీయత ఎంత గొప్పగా ఉంటే, అది ఆ సంస్థలకు, మార్కెట్లకూ అంత మంచిదన్నారు.

ఈ సారీ వడ్డీ రేట్లు యథాతథమే!

సోమవారం నుంచి ఎంపీసీ భేటీ

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) వచ్చే సోమవారం నుంచి మూడు రోజుల పాటు సమావేశమవుతోంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం బుధవారం కీల క రెపోరేటుపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. అయితే ఆహార ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగానే ఉన్నందున ఎంపీసీ ఈ సమావేశంలో కూడా రెపోరేటును యథాతథంగా 6.5 శాతం వద్దే కొనసాగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో కొత్తగా ఎంపీసీ సభ్యులుగా నియమితులైన రామ్ సింగ్, సౌగత భట్టాచార్య, నగష్ కుమార్ కూడా పాల్గొంటారు. ఎంపీసీలో వారికిదే తొలి సమావేశం.

గిలీడ్ సైన్సెస్‌తో డాక్టర్ రెడ్డీస్, హెటిరో ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెచ్ఐవీ చికిత్సలో ఉపయోగించే లెనాసెపవిర్ ఔషధాన్ని వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న 120 అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో తయారుచేసి, విక్రయించడానికి గిలీడ్ సైన్సెస్‌తో డాక్టర్ రెడ్డీస్, హెటిరో కంపెనీలు వేర్వేరుగా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ రెండూ రాయల్టీ రహిత, స్వచ్ఛంద లైసెన్సింగ్ ఒప్పందాలే. హెచ్ఐవీ చికిత్సలో ఇతర యాంటి రిట్రోవైరల్ ఔషధాలతో కలిపి ఉపయోగించేందుకు లెనాసెపవిర్‌కు అమెరికన్ ఎఫ్‌డీఏ అనుమతి ఇచ్చింది. ఈ లెనాసెపవిర్‌ను హెచ్ఐవీ (పీఆర్ఈపీ) వ్యాధి వ్యాప్తి నిరోధానికి కూడా ఉపయోగించవచ్చునా అన్న అంశంపై ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ లెనాసెపవిర్ ఔషధాన్ని గిలీడ్ సైన్సెస్ 2022 సంవత్సరంలో సన్‌లెంకా బ్రాండ్ పేరుతో అమెరికా, యూరప్ మార్కెట్లలో ప్రవేశపెట్టింది. హెచ్ఐవీకి సంబంధించి తాజాగా అందుబాటులో ఉన్న ఈ చికిత్సను 120 అల్పాదాయ, మధ్యాదాయ దేశాలకు విస్తరింపచేసేందుకు, తద్వారా వారు మరింత ప్రయోజనం పొందేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ (ఏపీఐ, సర్వీసెస్) దీపక్ సప్రా అన్నారు. భారత్ సహా ఆఫ్రికా, ఇతర అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో రోగులకు ప్రాణాధార ఔషధం అందించి మరింత ప్రయోజనం చేకూర్చేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని హెటిరో గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ బండి అన్నారు.

ఇన్వెస్టర్లకు ఫిబ్రవరి 1 నుంచి 3 ఇన్ 1 అకౌంట్

న్యూఢిల్లీ: సెబీ తాజా ఆదేశాల మేరకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి స్టాక్ బ్రోకర్లు తమ క్లయింట్లకు సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్‌కు యూపీఐ ద్వారా ఫండ్స్ బ్లాక్ చేసుకునే విధానం లేదా 3 ఇన్ 1 (సేవింగ్స్, డీమ్యాట్, ట్రేడింగ్) అకౌంట్‌ను ఆఫర్ చేయాల్సి ఉంటుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	535
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	523	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 78	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	116
వరంగల్	110	గుంటూరు	121
కరీంనగర్	110	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	113
కర్నూలు	110	నెల్లూరు	113
విశాఖపట్నం	110	అనంతపురం	113
గోదావరి	116		



ఈ ఏడాది మరో 600 శాఖలు

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: భారీ రెసిడెన్షియల్ టౌన్‌షిప్‌లు సహా కొత్తగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోనూ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకుంటామని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా మరో 600 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐ గత ఆర్థిక సంవత్సరంలో 137 శాఖలను ఏర్పాటు చేసింది. అందులో 59 బ్రాంచ్‌లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించింది. ఈ ఏడాది మార్చి నాటికి ఎస్‌బీఐ దేశవ్యాప్తంగా 22,542 శాఖలు, 65,000 ఏటీఎంలు, 85,000 మంది బిజినెస్ కరెస్పాండెంట్ల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. " మేం 50 కోట్ల మంది కస్టమర్లకు సేవలందిస్తున్నాం. ప్రతి భారతీయుడికి, ముఖ్యంగా ప్రతి భారతీయ కుటుంబానికి బ్యాంకర్ అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నాం" అని శ్రీనివాసులు శెట్టి అన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనింకా ఏమన్నారంటే..

- షేర్‌హోల్డర్లతోపాటు బ్యాంక్ సంబంధిత వర్గాలందరి దృష్టిలో ఎస్‌బీఐని అత్యుత్తమ, అత్యంత విలువైన బ్యాంక్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.
- డిపాజిటర్లను ఆకర్షించేందుకు ఎస్‌బీఐ పలు కొత్త పథకాలను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉంది. క్రమానుగత పెట్టుబడి (సిప్) వెసులుబాటుతో కూడిన రికరింగ్ డిపాజిట్ పథకం అందులో ఒకటి.
- ఆర్థిక వ్యవస్థ వేగంగా పురోగమిస్తున్న నేపథ్యంలో కస్టమర్లలో ఆర్థిక అవగాహన పెరుగుతోంది. దాంతో వారు సరికొత్త పెట్టుబడి పథకాల కోసం చూస్తున్నారు.
- ఎవరూ తమ పొదుపు సొమ్మునంతా రిస్క్‌తో కూడిన పథకాల్లో లేదా స్పెక్యులేటివ్ అసెట్ క్లాస్‌లో పెట్టుబడిగా పెట్టరు. వారి ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో బ్యాంక్ పథకాలకూ స్థానం ఉంటుంది. కాబట్టి, వారిని ఆకర్షించే పెట్టుబడి పథకాలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నాం.

రియల్టీలోకి రూ.9,660 కోట్ల పెట్టుబడులు

కొలియర్స్ తాజా నివేదిక



న్యూఢిల్లీ: భారత రియల్టీ రంగం పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తోంది. సెప్టెంబరు త్రైమాసికంలో ఈ రంగం 115 కోట్ల డాలర్ల (రూ.9960 కోట్లు) విలువైన పెట్టుబడులు ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువని కొలియర్స్ ఇండియా తెలిపింది. ఈ త్రైమాసికంలో రియల్టీలోకి వచ్చిన పెట్టుబడుల్లో 57 శాతం ముంబై, చెన్నై నగరాలు ఆకర్షించాయి. ఈ త్రైమాసికంలో కార్యాలయాల నిర్మాణ రంగం 61.63 కోట్ల డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది దాదాపు ఏడు రెట్లు ఎక్కువ. నివాస గృహాల విభాగంలోకి వచ్చే పెట్టుబడులు 40 శాతం పెరిగి 38.48 కోట్ల డాలర్లకు చేరాయి. అయితే ఇదే సమయంలో పారిశ్రామిక, గిడ్డంగుల నిర్మాణ రంగంలో మాత్రం పెట్టుబడులు 72 శాతం పడిపోయినట్టు కొలియర్స్ ఇండియా తెలిపింది.

హైదరాబాద్‌లో తగ్గిన ఆఫీస్ స్పేస్ డిమాండ్

సెప్టెంబరు త్రైమాసికంలో హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాలకు డిమాండు తగ్గింది. గత ఏడాది జూలై-సెప్టెంబరు మధ్య కాలంలో హైదరాబాద్, చుట్టు పక్కల ప్రాంతాల్లో 27 లక్షల ఎస్ఎఫ్‌టీ లీజు ఒప్పందాలు నమోదైతే, ఈ సంవత్సరం మూడో త్రైమాసికంలో అది 12.6 లక్షల ఎస్ఎఫ్‌టీకి పడిపోయింది. ఇదే సమయంలో బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, పుణె, ముంబై వంటి నగరాల్లో మాత్రం ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు జోరందుకున్నట్టు జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. హైదరాబాద్ సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో మూడో త్రైమాసికంలో 121.6 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 14 శాతం ఎక్కువని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది.

సర్ఫరాజ్ ద్విశతకం

'రెస్ట్'తో ఇరానీకప్



లఖ్‌నవూ: రెస్టాఫ్ ఇండియాతో ఇరానీ కప్ మ్యాచ్‌లో సర్ఫరాజ్ ఖాన్ దిశ్వతకం (221 బ్యాటింగ్)తో దుమ్ము రేపాడు. అజింక్యా రహానె (97) సెంచరీ చేజార్చుకోగా, తనుష్ కోటియన్ (64) అర్ధశతకంతో రాణించడంతో ముంబై జట్టు బుధవారం, రెండో రోజు ఆఖరికి తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 536 పరుగులు చేసింది. ఇరానీ కప్‌లో డబుల్ సెంచరీ చేసిన తొలి ముంబై బ్యాటర్‌గా సర్ఫరాజ్ రికార్డు నెలకొల్పాడు.

సంక్షిప్త స్కోరు: ముంబై తొలి ఇన్నింగ్స్ 536/9 (సర్ఫరాజ్ బ్యాటింగ్ 221, రహానె 97, కోటియన్ 64, శార్దూల్ 36, ముకేష్ కుమార్ 4/109, యశ్ దయాల్ 2/89, ప్రసిద్ధ్ 2/102).

ఖో-ఖో ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యం

న్యూఢిల్లీ: ఖో-ఖో చరిత్రలో తొలిసారిగా నిర్వహిస్తున్న ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది జరిగే ఈ విశ్వకప్‌లో 24 దేశాలు పాల్గొంటాయని జాతీయ ఖో-ఖో ఫెడరేషన్ అధ్యక్షుడు సుధాంశు మిట్టల్ వెల్లడించారు. పురుషులు, మహిళల జట్లకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు.

న్యూజిలాండ్ సారథి సౌథీ రాజీనామా

కొత్త కెప్టెన్‌గా లాథమ్



ఆక్లాండ్: మరో రెండు వారాల్లో భారత్‌తో మూడు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుండగా.. న్యూజిలాండ్ జట్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పేసర్ టిమ్ సౌథీ టెస్ట్ కెప్టెన్సీకి అనూహ్యంగా రాజీనామా చేశాడు. దాంతో అతడి స్థానంలో వికెట్ కీపర్, బ్యాటర్ లామ్ లాథమ్‌ను నియమించారు. మొత్తం 14 టెస్టుల్లో సౌథీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇక ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల్లో న్యూజిలాండ్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే.

బాబర్ మళ్లీ తప్పుకొన్నాడు

రిజ్వాన్‌కు బాధ్యతలు?

కరాచీ: సరిగ్గా ఏడాదిలో రెండోసారి బాబర్ ఆజమ్ పాకిస్థాన్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. పరిమిత ఓవర్ల సారథ్యం నుంచి తప్పుకొంటున్నట్టు బాబర్ బుధవారం వెల్లడించాడు. గత ఏడాది అక్టోబరులో భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచ కప్‌లో దారుణ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కెప్టెన్సీకి ఆజమ్ రాజీనామా చేశాడు. అయితే గత మార్చిలో అతడిని తిరిగి తెల్లబంతుల జట్ల సారథిగా నియమించారు. కానీ ఆరు నెలల్లోనే అతడు మళ్లీ కెప్టెన్సీకి రాజీనామా చేయడం గమనార్హం. బాబర్ స్థానంలో మహ్మద్ రిజ్వాన్ పరిమిత ఓవర్ల సారథ్య బాధ్యతలు చేపట్టనున్నట్టు సమాచారం. కాగా, వన్డేలు, టీ20లకు వేర్వేరు కెప్టెన్లను నియమించాలని కూడా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భావిస్తోంది.

ఆసీస్‌పై యువ భారత్ గెలుపు

అండర్-19 అనధికార టెస్ట్

చెన్నై: తీవ్ర ఒత్తిడిలో నిఖిల్ కుమార్ (55 నాటౌట్) అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. అండర్-19 అనధికార టెస్ట్‌లో ఆస్ట్రేలియాపై భారత్ 2 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఆటకు మూడో రోజైన బుధవారం ఆసీస్ నిర్దేశించిన 212 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 214/8 స్కోరు చేసి గెలిచింది. నిత్య పాండ్యా (51), కార్తికేయ (35) రాణించారు. మొదటి ఇన్నింగ్స్‌లో శతకంతో అదరగొట్టిన వైభవ్ సూర్యవంశీ (1) విఫలమయ్యాడు. ఐడెన్ ఒకానర్ 4 వికెట్లు, విశ్వ రామ్‌కుమార్ 3 వికెట్లు పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 110/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించి ఆసీస్ 214 పరుగులకు కుప్పకూలింది. స్పిన్నర్ మహ్మద్ ఎనాన్ 6 వికెట్లతో ప్రత్యర్థి వెన్నువిరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 293, భారత్ 296 పరుగులు చేశాయి.

భారత మహిళల క్రికెట్ జట్టు ఆటలో ప్రమాణాలు పెరిగినా, గొప్ప విజయాలు దక్కుతున్నా, కప్పు కల మాత్రం ఇంకా తీరలేదు. దశాబ్దాలుగా ఊరిస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచప్‌ను అందుకునేందుకు మన అమ్మాయిలకు మరో అద్భుత అవకాశం.
ఈ మెగా టోర్నమెంట్ మొదలయ్యేది నేడే. యూఏఈ వేదికగా జరగనున్న ఈ ప్రపంచకప్‌లో మొత్తం పది జట్లు పోటీపడుతున్నాయి. రికార్డుస్థాయిలో ఏడో టైటిల్‌పై కన్నేసిన డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, ప్రస్తుతం సూపర్‌ఫామ్‌లో ఉన్న భారత్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా తమ తొలి మ్యాచ్‌ని న్యూజిలాండ్‌తో శుక్రవారం ఆడనుంది.

నేటి నుంచి మహిళల టీ20 ప్రపంచకప్



మనమ్మాయిల కల నెరవేరేనా?

- తొలి టైటిల్ వేటలో భారత్
- మరోసారి ఫేవరెట్‌గా ఆస్ట్రేలియా
- బలంగా ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా

నేటి మ్యాచ్‌లు

బంగ్లాదేశ్ X స్కాట్లాండ్
మధ్యాహ్నం 3.30 నుంచి

పాకిస్థాన్ X శ్రీలంక
రాత్రి 7.30 నుంచి

స్టార్ నెట్‌వర్క్, డిస్నీ హాట్‌స్టార్‌లో

దుబాయ్: ఎడారిలో మరో పరుగుల పండుగకు సర్వం సిద్ధమైంది. క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మహిళల టీ20 వరల్డ్‌కప్ 9వ అంచెకు గురువారం తెరలేవనుంది. ప్రపంచకప్ స్వప్నాన్ని నెరవేర్చుకోవాలన్న పట్టుదలతో భారత్ ఉండగా.. ఆరుసార్లు విజేత, డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఇంగ్లండ్, గత టోర్నీ రన్నరప్ దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ సత్తాచాటాలనే కసితో ఉన్నాయి. గతంతో పోల్చితే విదేశీ లీగ్‌లలో జట్ల ప్లేయర్లు కూడా ఫ్రాంచైజీ క్రికెట్ అనుభవం గడించడంతో టోర్నీ ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. షార్జాలో జరిగే ఆరంభ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో బంగ్లాదేశ్ తలపడనుంది. వాస్తవంగా ఈ పొట్టికప్ బంగ్లాదేశ్‌లో జరగాలి. అయితే, అక్కడి రాజకీయ పరిస్థితుల కారణంగా అశాంతి రేగడంతో వేదికను యూఏఈకి మార్చారు. ఈ నెల 20న దుబాయ్ వేదికగా టోర్నీ ఫైనల్ జరగనుంది.

ఎదురులేని ఆస్ట్రేలియా..

మెగా టోర్నీల్లో అత్యంత బలీయమైన జట్టు ఆస్ట్రేలియా అనడంలో ఎలాంటి సందేహం లేదు. టీ20 వరల్డ్‌కప్‌లో కంగారూల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటిదాకా జరిగిన 8 టోర్నీల్లో ఏడుసార్లు ఫైనల్ చేరిన ఆసీస్.. ఆరుసార్లు విశ్వవిజేతగా నిలిచింది. 2009లో జరిగిన ఆరంభ ఎడిషన్‌లో ఇంగ్లండ్ టైటిల్ నెగ్గింది. 2010, 2012, 2014ల్లో వరుసగా మూడుసార్లు చాంపియన్‌గా నిలిచిన ఆసీస్ జోరుకు 2016లో వెస్టిండీస్ చెక్ చెప్పింది. కానీ, 2018, 2020, 2023ల్లో మళ్లీ వరుసగా మూడుసార్లు కంగారూలు కప్‌ను ఎగరేసుకుపోయారు. డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్న ఆసీస్ జైత్రయాత్రను కొనసాగించాలనుకొంటోంది. ఇటీవలి కాలంలో ఇంగ్లండ్, భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఆసీస్‌కు దీటుగా ఎదిగినా.. మెగా ఈవెంట్‌లో మాత్రం కంగారూల ముందు నిలవలేకపోతున్నాయి. మెగ్ లానింగ్ రిటైర్మెంట్ ప్రకటించడంతో అలీస్సా హీలీ కెప్టెన్సీలో ఆసీస్ బరిలోకి దిగుతోంది. జట్టులో ఎలీస్ పెర్రీ, గ్రేస్ హ్యారిస్, ఆష్లే గార్డ్‌నర్ కీలక ప్లేయర్లు.

పటిష్టంగా ఇంగ్లండ్..

తొలి టోర్నీలో విజేతగా నిలిచిన ఇంగ్లండ్ మళ్లీ కప్‌ను ముద్దాడలేక పోయింది. మూడుసార్లు ఫైనల్ చేరినా ఆసీస్ చేతిలో పరాజయం పాలైంది. అయితే, యాషెస్‌లో ఆసీస్‌ను ఓడించిన ఇంగ్లండ్ ఈసారి మరింత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఆల్‌రౌండర్లు, పవర్ హిట్టర్లతో బలంగా కనిపిస్తున్న ఇంగ్లండ్ ఈసారి టోర్నీని సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. సోఫీ ఎకిల్‌స్టోన్, సారా గ్లెన్, చార్లీ డీన్, స్కివర్ బ్రంట్ అనుభవం జట్టుకు ప్లస్ కానుంది.

బలహీనతను అధిగమించేనా..

ఆసీస్‌కు గట్టిపోటీ ఇచ్చే జట్లలో ఒకటిగా భారత్ కనిపిస్తున్నా.. తుదిమెట్టుపై తడబాటుకు లోనవడం మనోళ్లకు బలహీనతగా మారింది. 2020 టోర్నీ ఫైనల్లో కంగారూల చేతిలో ఓడిన హర్మన్ సేన.. 2022 కామన్వెల్త్ క్రీడల్లోనూ ఆ జట్టుకు తలొగ్గింది. ఆసియాకప్‌లో భారత్ అద్భుత ప్రదర్శన చేసినా, ఫైనల్లో శ్రీలంక చేతిలో కంగుతింది. ఫిట్‌నెస్, ఫీల్డింగ్‌పై దృష్టిసారించిన భారత్.. ఈసారి ఐసీసీ ట్రోఫీని ఒడిసిపట్టాలనే కసితో ఉంది. షఫాలీ వర్మ, స్మృతి మంధాన, రిచా ఘోష్, హర్మన్‌ప్రీత్ బ్యాటింగ్‌లో కీలకం. దుబాయ్ వికెట్లు స్పిన్‌కు అనుకూలించే చాన్సుండడంతో రాధా యాదవ్, దీప్తి శర్మపై జట్టు ఎక్కువగా ఆధారపడనుంది.

భారత మ్యాచ్‌ల షెడ్యూల్

తేదీ	వేదిక	ప్రత్యర్థి	సమయం
అక్టోబరు 4	దుబాయ్	న్యూజిలాండ్	రాత్రి 7.30
అక్టోబరు 6	దుబాయ్	పాకిస్థాన్	మ. 3.30
అక్టోబరు 9	దుబాయ్	శ్రీలంక	రాత్రి 7.30
అక్టోబరు 13	షార్జా	ఆస్ట్రేలియా	రాత్రి 7.30

గ్రూప్-ఎ: భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక.
గ్రూప్-బి: బంగ్లాదేశ్, ఇంగ్లండ్, స్కాట్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్.

టోర్నీ ఫార్మాట్

10 జట్లు టోర్నీలో పాల్గొంటున్నాయి. సెమీస్, ఫైనల్ సహా 23 మ్యాచ్‌లు షార్జా, దుబాయ్‌లో జరగనున్నాయి. మొత్తం జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి.

డబ్బే డబ్బు

గతంతో పోల్చితే ఈ టోర్నీ ప్రైజ్‌మనీని రికార్డుస్థాయిలో 225 శాతం పెంచారు. పురుషులతో సమానంగా మహిళల విజేతకు నగదు దక్కనుంది.

విజేతకు రూ. 19.64 కోట్లు
రన్నరప్‌కు రూ. 9.82 కోట్లు

తొలిసారి స్మార్ట్ రీప్లే సిస్టమ్

ఐపీఎల్, హండ్రెడ్ లీగ్‌లలో ఉపయోగించే స్మార్ట్ రీప్లే సిస్టమ్‌ను తొలిసారి ఐసీసీ వరల్డ్‌కప్‌లో ఉపయోగించనున్నారు. రివ్యూ ఫలితాన్ని వేగంగా ప్రకటించేందుకు ఈ వ్యవస్థ ఉపకరిస్తుంది. ఇందులో టీవీ అంపైర్‌కు హాక్-ఐ విజువల్స్ నేరుగా ఆపరేటర్ల నుంచి అత్యుత్తమ కోణాల్లో అందనున్నాయి. ఇంతకుముందు హాక్-ఐ ఆపరేటర్లు, థర్డ్ అంపైర్‌కు మధ్య టీవీ బ్రాడ్‌కాస్ట్ డైరెక్టర్ అనుసంధానకర్తగా ఉండేవాడు. ఈ కారణంగా కొంత జాప్యం జరిగేది.



సీఎం చంద్రబాబు 'వస్తున్నా.. మీకోసం' పాదయాత్ర చేపట్టి 12 ఏళ్లు అయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

బాబు పాదయాత్రకు పన్నెండేళ్లు

- టీడీపీ కేంద్ర కార్యాలయంలో వేడుక
- గోనుగుంట్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిన వర్ల, అశోక్‌బాబు

అమరావతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు 'వస్తున్నా... మీ కోసం' పేరుతో పాదయాత్ర చేపట్టి పన్నెండేళ్లు అయింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ నేతలు బుధవారమిక్కడ వేడుక నిర్వహించారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయన ఉమ్మడి రాష్ట్రంలో ఈ పాదయాత్ర జరిపారు. 2012 అక్టోబరు 2న అనంతపురం జిల్లా హిందూపురం నుంచి ప్రారంభించారు. బుధవారానికి పన్నెండేళ్లు కావడంతో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ అశోక్‌బాబు 12 కిలోల కేక్‌ను టీడీపీ కేంద్ర కార్యాలయంలో కట్ చేశారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ.. ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు బాసటగా నిలిచేందుకు 63 ఏళ్ల వయసులో చంద్రబాబు పాదయాత్ర చేపట్టారని చెప్పారు. '208 రోజుల్లో 2,817 కిలోమీటర్లు నడిచారు. నాటి దుర్మార్గ పాలనపై ప్రజలను చైతన్యవంతులను చేశారు. దాని ఫలితంగా 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆయన చేసిన పాదయాత్రను ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటుంటారు. నూరేళ్లు ఆయన వర్ధిల్లేలా భగవంతుడు ఆశీర్వదించాలని మా ఆకాంక్ష' అని అన్నారు. చంద్రబాబు తన పాదయాత్రలో 1,253 గ్రామాలు, 162 మండలాలు, 160 అసెంబ్లీ నియోజకవర్గాలను సందర్శించారని, ఇది చరిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోయిందని అశోక్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, పార్టీ నాయకులు రెడ్డివారి గురవారెడ్డి, చెన్నుపాటి గాంధీ, హసన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరుమలకు చంద్రబాబు

- సతీసమేతంగా శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 4, 5 తేదీల్లో తిరుపతి జిల్లాల్లో పర్యటించనున్నారు. 4న సాయంత్రం 4 గంటలకు విజయవాడలో బయలుదేరి 5 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటలకు తిరుమల పద్మావతి అతిథి గృహం వెళ్తారు. రాత్రి 8 గంటలకు బేడి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. రాత్రి 9 గంటలకు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం పెద్దశేష వాహన సేవలో చంద్రబాబు దంపతులు పాల్గొంటారు. అనంతరం తిరిగి పద్మావతి గెస్ట్‌హౌస్‌కు తిరిగి వచ్చి రాత్రికి అక్కడే బస చేస్తారు. 5వ తేదీ ఉదయం 8 గంటలకు శ్రీ వకుళమాత కేంద్రీకృత వంటశాలను సీఎం ప్రారంభిస్తారు. ఉదయం 9 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్ట్ నుంచి హైదరాబాద్ బయల్దేరి వెళ్తారు.

10న మంత్రివర్గ సమావేశం

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 10న జరగనుంది. ఆరోజు ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలు అందించాలని సూచించారు. 8వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రతిపాదనలు సాధారణ పరిపాలన శాఖకు పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చెత్తపన్ను రద్దు



గాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నంలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులతో కలిసి టీ తాగుతూ సమస్యలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందులో రాజీపడేది లేదన్నారు. గత పాలకుల పాపాలు నేడు రాష్ట్ర ప్రజల పాలిట శాపాలుగా మారాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రామతీర్థంలో రాముడి విగ్రహం తల తొలగిస్తే గత ప్రభుత్వ హయాంలో విచారణ చేయలేదని, కనకదుర్గమ్మ అమ్మవారి గుడిలో వెండి సింహాలు మాయమైతే దోషులను పట్టుకోలేదని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం, తూర్పుగోదావరి జిల్లాల్లో రథాలు తగలబెట్టేశారని, నేరస్థుడు రాజకీయ ముసుగు వేసుకుంటే ఇలాంటి పరిణామాలే చోటుచేసుకుంటాయని చెప్పారు. ఇకపై వారి ఆటలు కట్టిస్తామని, ఏ చిన్న సంఘటన జరిగినా దోషులను ఇట్టే గుర్తిస్తామని, కూటమి ప్రభుత్వంలో ఎవరైనా తోక తిప్పితే కట్ చేస్తానని హెచ్చరించారు. కృష్ణానదికి గతంలో ఎన్నడూలేని విధంగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందన్నారు. బుడమేరు గట్లు తెగటంతో విజయవాడ మునిగిపోయిందని, ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు యుద్ధమే చేశానన్నారు. మచిలీపట్నంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులు నడుంలోతు నీటిలోనూ కష్టపడి పనిచేశారని గుర్తుచేశారు.

డ్రోన్ కెమెరాల ద్వారా చెత్త గుర్తింపు

రాష్ట్రంలో పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇక నుంచి డ్రోన్ కెమెరాల ద్వారా చెత్త ఎక్కడ ఉందో గుర్తిస్తామన్నారు. ఎవరూ రోడ్డుపై చెత్తవేయొద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని ముఖ్యమంత్రి సూచించారు. ఇటీవల కాలంలో గ్యాస్ ధరలు పెరిగినా ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినవిధంగా దీపావళి పండుగ నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చే పథకాన్ని ప్రారంభించనున్నామని తెలిపారు. 2025 మార్చి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మరుగుదొడ్లు లేని వారిందరికీ మరుగుదొడ్లు కట్టిస్తామని తెలిపారు. 2027 నాటికి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు పూర్తిచేస్తామన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 45 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 45 శాతం ఇవ్వగా, మిగిలిన 10 శాతం స్థానిక సంస్థలు ఖర్చుపెట్టుకోవాల్సి ఉంటుందన్నారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, తాను చర్చించుకుని ఇంటింటికీ కుళాయి పథకాన్ని కచ్చితంగా పూర్తిచేయాలని నిర్ణయించామని తెలిపారు.

పుట్టిన రోజున మొక్క నాటండి

మీ కుటుంబ సభ్యుల్లో ఎవరి పుట్టినరోజైనా, మననం చేసుకునే రోజైనా వారి గుర్తుగా ఒక చెట్టును నాటాలని, దీంతో పచ్చదనం వెల్లివిరుస్తుందన్నారు. గ్రీన్ హైడ్రోజన్‌తో ఎంతో ఉపయోగం ఉందని, ఈ ప్రాజెక్టుపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతి అగ్రస్థానంలో ఉండాలని కోరుకునే వారిలో తాను ప్రథముడినని చంద్రబాబు పేర్కొన్నారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో నెంబర్‌వన్‌గా ఎదగాలని, ఈ కృషిలో తెలుగు ప్రజలు 33 శాతం ఉండాలని ఆకాంక్షించారు.

పోలవరం, బందరు పోర్టులను పూర్తిచేస్తాం

కృష్ణాడెల్టాకు సాగునీరు అందించే పోలవరం ప్రాజెక్టును రానున్న రెండేళ్లలో పూర్తిచేస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. బందరు పోర్టును 2025, డిసెంబరు నాటికి లేదా 2026, మార్చి నాటికి పూర్తిచేసేలా ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం తన షెడ్యూల్‌లో లేకపోయినా చంద్రబాబు పోర్టు పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. అనంతరం ఆంధ్ర జాతీయ కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకూ బందరు పోర్టు పనులు 24 శాతమే పూర్తయ్యాయని, పోర్టుకు ఇంకా 36 ఎకరాలు అప్పగించాల్సి ఉందని, ఈ భూమిని అప్పగించాలని కలెక్టర్‌కు సూచించినట్లు సీఎం తెలిపారు. 4 బెర్తుల్లో పోర్టు పనులను తొలివిడతగా ప్రారంభిస్తామని చెప్పారు. బందరు పోర్టు రాజధాని పోర్టు అని, గంటలోనే చేరుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇసుక కొరత కారణంగా పోర్టు పనులు కొంతమేర జాప్యం జరిగాయని, ఇసుక కొరత లేకుండా చూస్తామన్నారు. తెలంగాణ, నాగపూర్ తదితర ప్రాంతాలను పోర్టుకు అనుసంధానం చేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. పోర్టుకు అనుబంధంగా జాతీయ రహదారి ఇప్పటికే అందుబాటులో ఉందని, మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌ను కలిపితే ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. బందరు పోర్టును పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆంధ్ర జాతీయ కళాశాల దేవాదాయశాఖ ఆధీనంలో ఉందని, అయితే కొంతమంది వ్యక్తులు దీనిని సొంతం చేసుకున్నారని సీఎం అన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్ర జాతీయ కళాశాలను స్వాధీనం చేసుకుంటుందని స్పష్టంచేశారు.

ఇద్దరు పిల్లలుంటేనే ఎన్నికల్లో పోటీ...

గతంలో జనాభా నియంత్రణ కోసం ఇద్దరు పిల్లల కంటే ఎక్కువగా ఉంటే ఎన్నికల్లో పోటీచేసేందుకు అనర్హులుగా ప్రకటించేలా నిర్ణయించామని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం జనాభా తగ్గిపోతోందని, వృద్ధులే మిగులుతున్నారని, ఈ నేపథ్యంలో జనాభా సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇక నుంచి ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలు కచ్చితంగా ఉండాలనే నిబంధన పెట్టాల్సి వస్తుందేమో అని చమత్కరించారు. పేదరిక నిర్మూలన కోసం జనవరి నుంచి పి-4 పథకాన్ని అమలుచేస్తానని, నిమ్మకూరు నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తానని తెలిపారు.

వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు

మచిలీపట్నం మెడికల్ కళాశాలకు జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య పేరు పెట్టాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకురాగా, సీఎం హామీ ఇచ్చారు. మచిలీపట్నంలో తీర ప్రాంతం ఉండటంతో తాగునీటి ఎద్దడి ఉందని, శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి కొల్లు రవీంద్ర సీఎంకు తెలపగా, సమస్యను పరిష్కరించేందుకు నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను, స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్-డాక్టర్ పద్మావతి దంపతులను ముఖ్యమంత్రి సన్మానించారు.



సుమనశ్రీ(ఫైల్)

ప్రముఖ కవి, సాహిత్య విమర్శకుడు సుమనశ్రీ కన్నుమూత

- మరణించిన 20 రోజుల తర్వాత వెలుగులోకి
- మెకానికల్ ఇంజనీరింగ్‌లోనూ విశిష్ట సేవలు

విశాఖపట్నం, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, విమర్శకుడు, కథకుడు, తెలుగు సాహిత్యలోకానికి సుమనశ్రీగా సుపరిచితుడైన చెళ్లపిళ్ళ కామేశ్వరరావు(77) కన్నుమూశారు. వైజాగ్‌లో స్థిరపడిన ఆయన తీవ్రజ్వరంతో బాధపడుతూ సెప్టెంబరు 12న తుదిశ్వాస విడిచారు. ఆ విషయం తెలుగు సాహిత్యలోకానికి అక్టోబరు 2, బుధవారం తెలిసింది. ప్రపంచంలో ఏమూల ఏమి జరిగినా క్షణాల్లో ఆ వార్త అందరి దృష్టికి వస్తున్న ప్రస్తుత కాలంలో ఒక సీనియర్ కవి మరణవార్త 20 రోజుల తర్వాత వెలుగు చూడటం బాధాకరం.

సుమనశ్రీ పుట్టింది నరసరావుపేట...

సుమనశ్రీ స్వస్థలం నరసరావుపేట. అక్కడే డిగ్రీ చదివిన తర్వాత అనంతపురం ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ (బీఈ) చదివారు. అదే సబ్జెక్టుపై ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ చేశారు. అనంతరం అదే విశ్వవిద్యాలయంలో ఏడేళ్లు అధ్యాపకునిగా సేవలందించారు. హైదరాబాద్, బీహెచ్ఈఎల్‌లో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా 2003లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకొన్నారు. ఆనాటి నుంచి పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రొఫెసర్‌గా 2018 వరకు సేవలందించారు. కెనడాలోని అట్టావా వర్సిటీలోనూ విజిటింగ్ ప్రొఫెసర్‌గా మూడేళ్లు పనిచేశారు. సాహిత్య జీవితానికొస్తే, సుమనశ్రీ తండ్రి, పద్యకవి బంగారేశ్వర శర్మ ప్రోత్సాహంతో 1965 నుంచి కలం పట్టారు. గీతం పునీతమౌతుంది, రెప్పల మధ్య ఆకాశం, రక్త నేత్రోదయం, మహాస్వప్నం, నేత్రం నా సంకేతం... తదితర కవితా సంపుటాలు, మరికొన్ని కథలు పుస్తకాలుగా వెలువడ్డాయి. అజంతా కవిత్వంపై విశ్లేషణాత్మక వ్యాసాలు 'అజంతా లిపి', ఆధునిక కవిత్వంపై వ్యాసాలు 'కవిత్వం ఒక ఆత్మఘోష' ప్రచురితమయ్యాయి. సుమనశ్రీ మరణవార్త తెలిసిన అనంతరం, ఆయన 'అమావస్య సుందరి' కవితలోని "ఒక మరణ మృదంగ ధ్యానంలో హాయిగా... ప్రాణాలు విడుస్తున్నాన్నేను మహదానందంగా... చాలు ఇక ఈ జీవితానికి... ఇంతటి విహ్వలానుభవం..." పంక్తులను సామాజిక మాధ్యమాల వేదికగా సాహితీవేత్తలు గుర్తు చేసుకున్నారు. సుమనశ్రీ భార్య పేరు వెంకట రమణ. వీరి ఇద్దరి కుమారులు హేమచంద్రకుమార్, సురేష్‌బాబు అమెరికాలో స్థిరపడ్డారు. విశాఖ అక్కయ్యపాలెం శ్మశానవాటికలో సెప్టెంబరు 15న చెళ్లపిళ్ల కామేశ్వరరావు అలియాస్ సుమనశ్రీ అంత్యక్రియలు ముగిశాయి.

కిలో 408కి ఇవ్వలేనోళ్లు 328కి ఎలా ఇచ్చారు?

- ఏఆర్ ఫుడ్స్ కాంట్రాక్టులో మతలబు ఏమిటి?
- సుబ్బారెడ్డి, భూమనలో దొంగెవరు: ఆనం

నెల్లూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు నెయ్యి సరఫరా టెండర్లలో నిబంధనలు మార్చి వైసీపీ నేతలు దోపిడీకి పాల్పడ్డారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపించారు. 2023 నవంబరులో నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొన్న ఏఆర్ డెయిరీ ఫుడ్స్ రూ.408కు కేజీ నెయ్యి సరఫరా చేయలేమని చెప్పిందన్నారు. అదే సంస్థ 4 నెలల తర్వాత ఈ ఏడాది మార్చిలో జరిగిన టెండర్లలో కేజీ నెయ్యి రూ.328కే సరఫరా చేస్తామని ముందుకొచ్చిందని, దీని వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. బుధవారం నెల్లూరులో ఆనం విలేకరులతో మాట్లాడారు. 'తిరుపతి-శ్రీకాళహస్తి మధ్య ఉన్న వైష్ణవి మిల్క్ ప్రొడక్ట్స్ నుంచి ఒక ట్యాంకర్ (ఏపీ26టీసీ4779) నెయ్యితో జూలై 2న బయల్దేరి తమిళనాడులోని దుండిగల్‌కు వెళ్లింది. అక్కడి ఏఆర్ ఫుడ్స్‌కు చేరింది. ఇదే ట్యాంకర్ మళ్లీ అక్కడి నుంచి జూలై 4న బయల్దేరి తిరుమలకు వచ్చింది. అంటే ఏఆర్ ఫుడ్స్‌కు నెయ్యి సరఫరా చేస్తోంది వైష్ణవి మిల్క్ ప్రొడక్ట్స్. దీన్నిబట్టి ఏఆర్ ఫుడ్స్‌కు నెయ్యి సరఫరా చేసే స్థాయి లేదని అర్థమవుతోంది. మార్చిలో జరిగిన టెండర్లు రింగ్ అయ్యాయి. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి టెండర్ నిబంధనలు మార్చారు. టెండర్లలో పాల్గొనే సంస్థల దూరం 800 కి.మీ. నుంచి 1500 కి.మీ.కు ఎందుకు మార్చారు? సుబ్బారెడ్డి హయాంలో కేజీ నెయ్యి ధర రూ.496కు ఓ కంపెనీకి టెండర్ అప్పగించారు. భూమన హయాంలో ఈ ధరను రూ.294కు తగ్గించారు. ఇది ఎలా సాధ్యమైంది? ఇంత తక్కువ ధరకు ప్రపంచంలో ఎక్కడైనా నెయ్యి దొరుకుతుందా? ఒక ఏడాదిలో 55 శాతం నెయ్యి ధరను తగ్గించారు. ఇలా చేస్తే నాణ్యమైన నెయ్యి ఎలా తీసుకొస్తారు? ఇక్కడ దొంగ వైవీ సుబ్బారెడ్డినా లేక భూమన కరుణాకర్‌రెడ్డినా? వీరిలో ఒకరు జగన్మోహన్‌రెడ్డికి రైట్ హ్యాండ్ మరొకరు లెఫ్ట్ హ్యాండ్' అని ఆనం వ్యాఖ్యానించారు. కల్తీ నెయ్యి సరఫరా చేశారు కాబట్టే అంత తక్కువ ధరకు కోట్ చేశారన్నారు.

ఆరోసారీ జోగి విచారణ

- మళ్లీ అవే పొంతనలేని సమాధానాలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 2: ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంపై దాడి కేసుకు సంబంధించి మాజీ మంత్రి జోగి రమేశ్ ఆరోసారి పోలీసు విచారణకు హాజరయ్యారు. బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరి అర్బన్ పోలీసుస్టేషన్‌లో జరిగిన ఈ విచారణలో ఆయన ఎప్పటిలాగే పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. కేసు దర్యాప్తు అధికారి, డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రమేశ్‌ను విచారించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జోగి రమేశ్‌ను 27 ప్రశ్నలు అడిగామని చెప్పారు. వాటిలో కొన్నింటికి మాత్రమే సంతృప్తికర సమాధానాలిచ్చారని, మిగతా వాటికి వాస్తవ విరుద్ధమైన సమాధానాలు చెప్పారని వెల్లడించారు. తమ వద్ద ఉన్న ఆధారాలు, ఇతర నిందితులు చెప్పిన సాక్ష్యాలకు.. రమేశ్ చెప్పిన సమాధానాలకు ఏమాత్రం పొంతన లేదన్నారు. ఇప్పటికే జోగి రమేశ్‌కు చెందిన సోషల్ మీడియా ఖాతాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దాడి జరిగిన రోజు వినియోగించిన సెల్‌ఫోను, సిమ్ కార్డు కోరినప్పటికీ ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. జోగి రమేశ్ దర్యాప్తునకు సహకరించడం లేదని, ఇవే విషయాలను న్యాయస్థానం ముందు ఉంచుతామని చెప్పారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఐదు పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పవన్ దీక్ష విరమణ

(మొదటి పేజీ తరువాయి)

'వారాహి డిక్లరేషన్' పుస్తకాన్ని శ్రీవారి పాదాల వద్ద ఉంచి దర్శించుకున్నారు. ప్రదక్షిణంగా రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు శేష వస్త్రం కప్పి ఆశీర్వచనం చేశారు. తర్వాత టీటీడీ అదనపు ఈవో శ్రీవారి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చాక పవన్‌కల్యాణ్ తన చేతిలోని వారాహి డిక్లరేషన్ పుస్తకాన్ని మీడియాకు చూపారు. అక్కడ నుంచి నేరుగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకున్నారు. భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న తీరును పరిశీలించారు. భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. అన్నప్రసాదాల తయారీ, రోజు ఎంతమంది వస్తున్నారు, ఇటీవల చేపట్టిన మార్పులను టీటీడీ ఉన్నతాధికారులు పవన్‌కు వివరించారు. శ్రీవారి సేవకులకు, భక్తులకు పవన్ నమస్కరిస్తూ ఆప్యాయంగా పలకరించారు. తిరిగి అతిథి గృహానికి చేరుకున్న ఆయన చాలా వరకు ఏకాంతంగానే గడిపారు. గురువారం ఉదయం జపాలి ఆంజనేయస్వామిని దర్శించుకోనున్నారు.

'వారాహి డిక్లరేషన్'లో ఏముంది?

తిరుపతిలో గురువారం సాయంత్రం జరిగే వారాహి సభలో పవన్ కల్యాణ్ ఏ అంశాలపై మాట్లాడనున్నారనేది చర్చనీయాంశంగా మారింది. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సమయంలో పవన్ చేతిలో కనిపించిన రెడ్‌బుక్‌ను ప్రతిఒక్కరు ఆసక్తిగా చూశారు. పుస్తకం కవర్ పేజీపై 'ధర్మోరక్షతి రక్షితః', 'వారాహి డిక్లరేషన్, తిరుపతి, 03.10.2024' అన్న అక్షరాలతో పాటు మధ్యలో వారాహి అమ్మవారి చిత్రం ఉంది. తిరుపతిలో జరిగే సభలో ఆయన 'వారాహి డిక్లరేషన్' విడుదల చేయనున్నారు.



శ్రీవారి ఆలయం ముందు వారాహి డిక్లరేషన్ పుస్తకంతో పవన్ కల్యాణ్

సనాతన ధర్మపరిరక్షణకే....

సనాతన ధర్మ పరిరక్షణ కోసమే వారాహి యాత్ర చేపడుతున్నట్టు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 'సుమారు 14 నెలల క్రితం వారాహి మొదటిసారి రోడ్డుపైకి వచ్చినపుడు అది కేవలం ఉద్యమం మాత్రమే కాదు దానికంటే మించిన కార్యక్రమం. కార్యాచరణకు పిలుపు. వైసీపీ నిరంకుశ పాలనలో ఏపీ నలిగిపోతున్న ఆ సమయంలో వారాహి శక్తికి సంకేతంగా మారింది. ఇపుడు వారాహి చాలా పెద్ద లక్ష్యం కోసం తిరిగి వచ్చింది. సనాతన ధర్మ రక్ష బోర్డుకు జీవం పోయాలనుకునే లక్షలాది మంది స్వరాన్ని ప్రతిధ్వనించడమే దాని లక్ష్యం. మన ప్రాచీన సాంప్రదాయాలు, విలువలను పరిరక్షించడానికి సంబంధించింది. రేపటి వారాహి సభ ఈ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. తిరుపతిలో నేను వారాహి డిక్లరేషన్ చేయబోతున్నా. సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తానని, మన వారసత్వాన్ని కాపాడుకుంటానని, ఆ లక్ష్యం కలిగిన ప్రతి ఒక్కరితో కలసి నడుస్తానని వాగ్దానం చేస్తున్నాను. కలసికట్టుగా దేశ భవిష్యత్తును సురక్షితం చేయడంతో పాటు బలోపేతం చేయగలం' అని పవన్ పోస్టు చేశారు.

కుమార్తెతో డిక్లరేషన్‌పై సంతకం

పవన్ కల్యాణ్ తన చిన్నకుమార్తె పొలెనా అంజనతో డిక్లరేషన్‌పై సంతకం చేయించారు. ఆలయ నిబంధనల ప్రకారం అన్యమతస్తులు శ్రీవారి దర్శనానికి వస్తే తమకు హిందూ సంప్రదాయాలంటే గౌరవమని, శ్రీవారిపై నమ్మకంతో వచ్చామని ఉన్న డిక్లరేషన్‌పై సంతకం చేయాలి. శ్రీవారి దర్శనానికి వెళ్లే ముందు పవన్ బస చేసిన గాయత్రి అతిథి గృహం వద్దకు రిసెప్షన్ అధికారులు డిక్లరేషన్ ఫారాన్ని తీసుకెళ్లారు. పవన్ తన కుమార్తె పొలెనా అంజనతో సంతకం చేయించారు. పొలెనా మైనర్ కావడంతో తండ్రిగా పవన్ కల్యాణ్ కూడా డిక్లరేషన్‌పై సంతకం చేశారు. వారితో వచ్చిన మరో ముగ్గురు కూడా డిక్లరేషన్‌పై సంతకాలు చేసినట్టు తెలిసింది. కాగా పవన్ చిన్నకుమార్తె పొలెనా అంజన తొలిసారి మీడియా ముందుకొచ్చారు.

నేను సీఎంగా ఉంటేనే ప్రజలకు మేలు!

- రాష్ట్రంలో పాలన కుప్పకూలింది
- 4 నెలల్లోనే ప్రభుత్వ వ్యతిరేకత తారస్థాయికి: జగన్
- నేడు మళ్లీ బెంగళూరు ప్యాలెస్‌కు

అమరావతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): తాను ముఖ్యమంత్రి సీట్లో ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతి సందర్భంగా బుధవారమిక్కడ తాడేపల్లి ప్యాలెస్‌లో వారి చిత్రపటాలకు ఆయన నివాళులు అర్పించారు. అనంతరం వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. 'ముఖ్యమంత్రి సీట్లో నేనుంటేనే పాలన సాగుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే పాలన కుప్పకూలింది. సూపర్ సిక్సులూ లేవు. సూపర్ సెవెన్లూ లేవు. మరోపక్క అబద్ధాలు చెబుతున్నారు. స్కూళ్లు పోయాయి.. చదువులూ పోయాయి.. ఆస్పత్రులూ పోయాయి. ఆరోగ్యశ్రీలూ పోయాయి. ఆసరా పోయింది.. డోర్ డెలివరీ పోయింది. వ్యవసాయం పోయింది. పెట్టుబడి సాయం పోయింది. ఉచిత బీమా పోయింది.. ఆర్బీకేలూ పోయాయి.. ఇలా అన్నీ పోయాయి. వ్యవసాయం, చదువులు, వైద్యం మూడు రంగాలూ తిరోగమనంలోకి వెళ్లిపోయాయి' అని ఆరోపించారు. రాష్ట్రంలో పరిపాలన, శాంతిభద్రతలు లేవని.. ఇష్టమొచ్చినట్లుగా దొంగ కేసులు పెట్టి రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. విజయవాడ వరద బాధితులకు ఎన్యుమరేషన్ కూడా చేయలేకపోతున్నారని.. వరదలో మునిగిన ఇళ్లు, నష్టం సమాచారాన్ని సేకరించలేని, సహాయం చేయలేని పరిస్థితి ఉందని తెలిపారు. పారదర్శకత లేకుండా నచ్చినోళ్లకే, ఇవ్వాలనుకున్నవాళ్లకే సాయం చేశారని ఆరోపించారు. 4 నెలలకే ప్రభుత్వంపై వ్యతిరేకత తారస్థాయికి చేరుకుందని.. ఇది అర్థమై రకరకాల అంశాలను తీసుకొచ్చి జనం దృష్టి మళ్లిస్తున్నారని వ్యాఖ్యానించారు. వైసీపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. జాతీయ స్థాయిలో పార్టీలేవీ లేనంతగా వైసీపీని బలోపేతం చేయాలని పిలుపిచ్చారు. ఇందుకు కార్యకర్తల్లో 'స్పార్క్' ఉండాలన్నారు.

ఒకరోజు ముందే బెంగళూరుకు!

ఎన్నికల్లో ఘోరపరాజయం దరిమిలా జగన్ ప్రతి శుక్రవారం బెంగళూరు యలహంక ప్యాలెస్‌కు వెళ్తున్నారు. పని ఉంటే తాడేపల్లి వస్తున్నారు. గత శుక్రవారం వెళ్లి మంగళవారమే వచ్చారు. తాజాగా శుక్రవారం కాకుండా గురువారమే ఆయన బెంగళూరు వెళ్తున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి.


డిప్యూటీ సీఎం అవుతాడనుకోలేదు

- నా బిడ్డ ప్రజలకు సేవ చేయడం సంతోషం
- పవన్ తల్లి అంజనాదేవి

పవన్‌కు దేవుడు మంచి బాధ్యతిచ్చాడు

తండ్రిలాగా బాగా మొండిపట్టుదల

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): 'భగవంతుడు పవన్‌కు ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగించాడు' అని జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాతృమూర్తి కొణిదెల అంజనాదేవి అన్నారు. ప్రజల కోసం కష్టపడి ముందుకు నడిచిన పవన్‌కు దేవుడు మంచి బాధ్యత ఇచ్చాడని సంతోషం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం అవుతాడని తాను అనుకోలేదన్నారు. 'అమ్మ మనసు' పేరుతో ఆమె ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ గురించి పలు విషయాలు చెప్పారు. ఆమె మాటల్లోనే... పవన్ ప్రజల కష్టం తీర్చాలని తపన పడుతున్నాడు. మొదటి నుంచి పట్టు విడుపులు చూడడు. నేల మీదే పడుకుంటాడు. చిన్నప్పటి నుంచి నాకు ఇది కావాలని అడిగే వ్యక్తి కాదు. అందరూ భోజనాలు చేశాక తర్వాత వచ్చి తినేవాడు. నా చేతి వంటలో పలావు అంటే బాగా ఇష్టపడతాడు. అయినా ఇది చేసి పెట్టు అని మాత్రం అడగడు. నేను చేసి పెడితే తినేవాడు. గతంలో సినిమాల కోసం కష్టపడ్డాడు. ఇప్పుడు ప్రజల కోసం కష్టపడుతున్నాడు. వేంకటేశ్వర స్వామి దీక్ష చేయడం సంతోషంగా ఉంది. పవన్‌కు చిన్ననాటి నుంచి ఆధ్యాత్మిక ఆలోచనలు కొంచెం ఎక్కువ. నా కోసం అయ్యప్ప మాల వేసుకుని శబరిమల వెళ్లొచ్చాడు. అలా అని ప్రతి రోజూ దండాలు పెట్టేసి, పూజలు ఏమీ చేయడు. పవన్ తన అన్నప్రాసన వేడుకలో కత్తి, పెన్ను పట్టుకున్నాడు. అప్పుడే ప్రజలకు ఏదో చేస్తాడని నేను ఊహించాను. పవన్‌కు తండ్రిలానే మాటలు తక్కువ. అనుకున్న పనులు మాత్రం చేస్తారు. మిత భాషి కావడంతో వాళ్ల నాన్న కూడా కల్యాణ్‌ను ఇష్టపడేవారు. చిన్నప్పటి నుంచి పుస్తకాలు ఎక్కువగా చదివేవాడు. హైస్కూల్ స్థాయి నుంచి నేటి వరకూ అదేవిధంగా పుస్తకాలు చదువుతూనే ఉన్నాడు. పవన్ డిప్యూటీ సీఎం అవుతాడని నేను ముందు ఊహించలేదు. వారి వారి అదృష్టాన్ని బట్టి జీవితం ఉంటుంది. చిరంజీవి కూడా తమ్ముడిని బాగా చూసుకునేవాడు. ఇప్పటికీ పవన్ వదిన చాటు బిడ్డ. వాళ్ల నాన్నకు వృత్తిరీత్యా బదిలీలు ఎక్కువగా ఉండటంతో చెన్నైలో పెద్దబ్బాయి దగ్గరే ఎక్కువగా ఉన్నాడు.



శ్రీ కల్యాణ్ కుమార్ అని మేం పేరు పెట్టాం. కానీ ఆ తర్వాత పవన్ కల్యాణ్ అని మార్చుకున్నాడు. మంత్రిగా నా బిడ్డ ప్రజలకు సేవ చేయడం, మంచి చేయడం నాకు ఆనందాన్నిస్తోంది. మొదటి నుంచి పవన్‌కు సాయం చేసే గుణం ఎక్కువ. తన కళ్ల ముందు ఏదైనా జరిగితే వెంటనే స్పందించి ఆదుకుంటాడు. తండ్రితో చిన్నప్పుడు పవన్‌కు బాగా అనుబంధం ఉండేది. తండ్రీకొడుకులకు మొండిపట్టుదల బాగా ఎక్కువ. తనను పోలీసులు అడ్డుకుంటే రోడ్డు మీద పడుకున్న తీరు చూసి నాకు బాధ కలిగింది. ఇంత అవసరమా, ఇన్ని కష్టాలు ఎందుకు పడడం అనిపించింది. తన బిడ్డ మంచి వృద్ధిలోకి రావాలని ఏ తల్లి అయినా కోరుకుంటుంది. నేనూ అదే కోరుకుంటున్నాను.

36 రోజుల ఆడ శిశువు గొంతు నులిమి.. గోడకేసి కొట్టి..

- కిరాతకంగా హతమార్చిన కసాయి తండ్రి
- అమ్ముడుపోవడం లేదని దారుణం.. కాకినాడలో ఘోరం

కాకినాడ క్రైం, అక్టోబరు 2: ఆడపిల్ల పుట్టిందని ఆగ్రహించాడు.. ఆ పసికందును ఎలాగైనా అమ్మేసేందుకు ప్రయత్నించాడు.. 36 రోజులైనా ఆ శిశువు అమ్ముడు పోకపోవడంతో కన్న తండ్రే కసాయిలా మారాడు. ఆ నవజాత శిశువుని గొంతు నులిమి గోడ కేసి కొట్టి అత్యంత పాశవికంగా హతమార్చాడు. కాకినాడలో ఈ ఘోరం జరగగా.. నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జగన్నాథపురం చెక్కావారి వీధికి చెక్కా భవానీకి భర్త చనిపోయాడు. దీంతో నాలుగేళ్లుగా కేతా శివమణి అనే పండ్ల వ్యాపారితో సహజీవనం చేస్తోంది. చెడు వ్యసనాలకు బానిసైన శివమణి తనకు వచ్చే సంపాదన సరిపోక గతంలో వీరికి తొలికాన్పులో పుట్టిన మగ శిశువును విశాఖపట్నానికి చెందిన వారికి విక్రయించాడు. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేశాడు. భవాని ఇటీవల ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆడపిల్ల అంటే ఇష్టం లేని శివమణి.. ఆ శిశువును కూడా విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఆడపిల్ల కావడంతో కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో కోపోద్రిక్తుడైన శివమణి ఆ చిన్నారిని చంపేస్తానని భార్య భవానితో రెండు రోజులుగా గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి చిన్నారిని గోడకేసి బలంగా కొట్టి, పీక నొక్కి చాపమీద పడేసి పరారయ్యాడు. చిన్నారి ఎంతసేపటికీ కదలకపోవడంతో భవానికి అనుమానం వచ్చి జీజీహెచ్‌కు తీసుకెళ్లింది. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం కాకినాడ అన్నమ్మఘాటీ సెంటర్‌లో శివమణిని అరెస్ట్ చేసి.. కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.

ప్రవీణ్ ప్రకాశ్, శేషగిరిలకు జైలు

కోర్టు ధిక్కార వ్యాజ్యంలో హైకోర్టు తీర్పు

- నెల రోజుల జైలు సహా 2 వేల జరిమానా
- అప్పీల్ దాఖలుకు వీలుగా తీర్పు అమలు నాలుగు వారాలు నిలుపుదల

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): కోర్టు ధిక్కరణ కేసుకు సంబంధించి వైసీపీ హయాంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌కు, అప్పటి ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి శేషగిరి బాబుకు హైకోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించింది. కోర్టు ఉత్తర్వులు జారీ చేశాక వాటికి వక్రభాష్యం చెప్పకుండా సరైన స్ఫూర్తితో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తేల్చి చెప్పింది. కోర్టు ఉత్తర్వులు.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని భావిస్తే వాటిపై అప్పీల్ చేసే వెసులుబాటు ఉందని గుర్తు చేసింది. ఉత్తర్వులకు వక్రభాష్యం చెబుతూ వాటిని అమలు చేయకుండా ఉండడానికి వీల్లేదని పేర్కొంది. ప్రస్తుత కేసులో కోర్టు ఉత్తర్వులు అమలు చేయని పాఠశాల విద్యాశాఖ అప్పటి ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఇంటర్మీడియెట్ బోర్డు అప్పటి కార్యదర్శి శేషగిరిబాబుకు నెలరోజుల సాధారణ జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. అయితే, అప్పీల్ చేసుకునేందుకు వీలుగా సమయం ఇవ్వాలని అధికారుల తరపు న్యాయవాదులు అభ్యర్థించడంతో తీర్పు అమలును నాలుగు వారాల పాటు నిలుపుదల చేసింది. తాము ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్ కోర్టు ఎలాంటి స్టే ఇవ్వకపోతే ఈ నెల 21న హైకోర్టు రిజిస్ట్రార్ జ్యుడీషియల్ ముందు లొంగిపోవాలని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో తీర్పు ఇచ్చారు.

ఇదీ వివాదం

ఇంటర్మీడియెట్ బోర్డులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం. విజయలక్ష్మి 2022, ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు. అదే ఏడాది జనవరి 31న పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్థిక శాఖ జీవో 15ను జారీ చేసింది. ఈ జీవో ఆధారంగా తనను 62 ఏళ్లు వచ్చేవరకు ఉద్యోగంలో కొనసాగించాలని విజయలక్ష్మి ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శికి విన్నవించారు. సానుకూల స్పందన లేకపోవడంతో ఆమె 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి.. విజయలక్ష్మికి 62 ఏళ్లు వచ్చేవరకు సర్వీసులో కొనసాగించాలని ఆదేశిస్తూ.. 2023 ఫిబ్రవరిలో ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఆదేశాలు అమలుకాకపోవడంతో విజయలక్ష్మి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. అప్పటి పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి శేషగిరిబాబును ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి.. అప్పటి పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వైఖరిని తీవ్రంగా ఆక్షేపించారు. పలుమార్లు అవకాశం ఇచ్చినా కౌంటర్ దాఖలు చేయకపోవడంపై అభ్యంతరం తెలిపారు. ఇది కోర్టు ఉత్తర్వులను అగౌరవపర్చడమేనని పేర్కొన్నారు.

గనుల ఘనుడు 'బేర్'!

(మొదటి పేజీ తరువాయి)

తన గోడు వెళ్లబోసుకుంటూ... 'పోలార్ బేర్' కథ చెప్పినట్లు సమాచారం. "ధ్రువపు ఎలుగు బంటిని వేటాడేందుకు ఎస్కిమోలు రక్తం పూసిన పదునైన కత్తులను ఎరగా వాడుతారు. ధ్రువపు ఎలుగుబంట్లకు రక్తమంటే ఇష్టం. కత్తికి పూసిన రక్తాన్ని నాకే క్రమంలో దాని నాలుక, నోరు తెగి రక్తం కారుతుంది. అదే రక్తం కత్తి నుంచి వస్తుందనుకుని ఇంకా ఇంకా ఆ కత్తిని నాకుతూ... చివరికి కింద పడిపోతుంది. అప్పుడు ఎస్కిమోలు వచ్చి దాన్ని చంపేస్తారు. నా పరిస్థితి కూడా అచ్చం ఇలాగే తయారైంది. కోస్ట్‌గార్డ్‌లో ఆఫీసర్‌గా ఉన్న నేను 'డిప్యుటేషన్' ఉచ్చులో పడి ఏపీకి వచ్చాను. కత్తికి ఉన్న రక్తపు చుక్క రుచి చూసిన పోలార్ బేర్‌లా నేను కూడా అధికారాన్ని చూశా తప్ప ఆ మాయలో పడిపోతున్నానని తెలుసుకునేలోపే కింద పడిపోయా. ఇసుక ఊబిలో ఎంతగా కూరుకుపోయానో ప్రభుత్వం మారిన తర్వాతగానీ తెలియలేదు" అని వెంకట రెడ్డి వాపోయినట్లు తెలిసింది.

చంద్రబాబు హయాంలో ప్రజలకు ఉచితంగా అందించిన ఇసుకను... వైసీపీ పెద్దలు 'సొంత' ఆదాయ వనరుగా మార్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తవ్వకాలు, అమ్మకాలను ఒకే సంస్థకు కట్టబెట్టారు. ఈ మొత్తం ప్రక్రియలో మైన్స్ డైరెక్టర్‌గా ఉన్న వెంకటరెడ్డి కీలకపాత్ర పోషించారు. వెంకట రెడ్డిని న్యాయస్థానం గురువారం నుంచి మూడు రోజులపాటు ఏసీబీ కస్టడీకి అప్పగించింది. ఈ సందర్భంగా ఆయన నుంచి కీలక వివరాలు రాబట్టేందుకు ఏసీబీ ప్రయత్నిస్తోంది. ఇసుకను ఒకే సంస్థకు కట్టబెడుతూ జరిగిన ఒప్పందం వెనుక ఎవరున్నారు? గనుల శాఖకు చెందిన వే బిల్లులు జారీ చేయాలన్న నిబంధనను ఇసుకలో పాతేసి కాంట్రాక్టరు సొంతంగా ముద్రించుకున్న వే బిల్లులు చేతిరాతతో ఇచ్చేందుకు ఎలా అనుమతించారు? ఇసుక కాంట్రాక్టు సంస్థలు ఇష్టారాజ్యంగా రాష్ట్ర సంపదను దోచేసుకున్నా మీరెందుకు అడ్డుకోలేకపోయారు? భారీగా చేతులు మారిన సొమ్ములో ఎవరి వాటా ఎంత? టెండరులో పేర్కొన్న మొత్తాన్ని కాంట్రాక్టు సంస్థ ప్రతి 15 రోజులకొకసారి చెల్లించాలి. కానీ... నెలల తరబడి ప్రభుత్వ ఖజానాకు జమ చేయని ఇసుక కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్య తీసుకోలేదు? ప్రభుత్వానికి రూ.850కోట్ల బకాయి పడిన సంస్థకు ఎన్‌వోసీ ఎందుకు, ఎలా ఇచ్చారు? నోట్ ఫైల్ లేకుండా ఇన్ని రూ.వందల కోట్లను ఎవరి ఆదేశాల మేరకు దోచిపెట్టారు? దీంతోపాటు పలు అంశాలపై వెంకట రెడ్డి నుంచి వివరాలు రాబట్టాలని ఏసీబీ నిర్ణయించుకుంది.

నిండా మునిగి...

వెంకటరెడ్డిది కడప జిల్లా. ఇండియన్ కోస్ట్ గార్డులో సీనియర్ సివిల్ స్టాఫ్ ఆఫీసర్‌గా ఉన్న ఆయన... వైసీపీ ప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై ఏపీకి వచ్చారు. ఏపీ మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్‌గా మూడేళ్లపాటు పని చేసి సుమారు మూడు వేల కోట్లను వైసీపీ పెద్దలకు దోచిపెట్టారనే ఆరోపణలున్నాయి. మే 2021 నుంచి జూన్ 2024 వరకూ ప్రైవేటు ఏజెన్సీలు నిర్వహించిన మైన్స్ అండ్ మినరల్స్ ఇసుక తవ్వకాల్లో అగ్రిమెంట్ షరతులను ఉల్లంఘించారు. ఆయన హయాంలో జరిగిన ఉల్లంఘనల కారణంగా రూ.2566 కోట్ల విలువైన ప్రభుత్వ సంపద ప్రైవేటు వ్యక్తుల పరమైంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు ఆదేశాలను అడ్డగోలుగా బుట్టదాఖలు చేశారు. ప్రభుత్వం మారగానే.. ఆయన్ను సస్పెండ్ చేసి, ఏసీబీ విచారణకు ఆదేశించారు. ఏసీబీ అధికారులు గనుల దందాకు సంబంధించిన పూర్తి వివరాలను ఆధారాలతో సహా సేకరించారు. 2022 ఏప్రిల్ నుంచి కొత్త జిల్లాలకు సంబంధించిన ఇసుక తవ్వకాల డేటా, కాంట్రాక్టర్లు ఇసుక విక్రయాల సమయంలో జారీ చేసిన వే బిల్లులూ తీసుకున్నారు. రీచ్‌ల వారీ తవ్వకాలు, అమ్మకాల్లో వ్యత్యాసాన్ని గుర్తించారు. ఐపీసీ సెక్షన్లతోపాటు అవినీతి నిరోధక, మైనింగ్ చట్టాల ప్రకారం కేసు పెట్టారు. అప్పటికే రిటైర్ అయ్యి అజ్ఞాతంలో ఉన్న వెంకటరెడ్డి ఢిల్లీలో ఉన్నట్లు టెక్నాలజీ సాయంతో గుర్తించారు. ఆయనను వ్యూహాత్మకంగా హైదరాబాద్‌కు రప్పించి.. అరెస్టు చేశారు.



అనుమల్లంక గ్రామం



ఆదుకోండి సామీ...

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని ఎ.కొండూరు మండలం దీప్లానగర్‌కు చెందిన బూక్యా స్వామి (40) ఏడాదిగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. 20కిపైగా డయాలసిస్‌లు ఎప్పుడో పూర్తి అయ్యాయి. కానీ, నేటికీ పింఛన్ అందడం లేదు. వ్యాధి తీవ్రం కావడంతో రెండు నెలలుగా వారానికి మూడుసార్లు డయాలసిస్ అవసరం అవుతోంది. స్వామి తండ్రి హనుమా 2004లో, తల్లి తులసి 2014లో, సోదరి సక్రి 2018లో కిడ్నీ వ్యాధితోనే మృతి చెందారు. తమ ఊరికి వచ్చే కలెక్టర్లకు, ఇతర అధికారులకు కిడ్నీ వ్యాధి బాధితుల కష్టాలను వివరించేది స్వామినే. సురక్షితమైన తాగునీరును అందించి తమకు కిడ్నీ మహమ్మారి పీడ వదిలించాలంటూ స్వామి వేడుకుంటున్నారు.

ఇది మరో ఉద్దానం!

ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో వేలల్లో కిడ్నీవ్యాధి కేసులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ తండాలు, గ్రామాల్లో సుమారు 30వేల మంది నివసిస్తున్నారు. అధికారిక లెక్కలు కిడ్నీ వ్యాధితో బాధపడే వారి సంఖ్యను వెయ్యిలోపే చూపిస్తుండగా వాస్తవ సంఖ్య మాత్రం అంతకు 20 రెట్లు ఉంది. డయాలసిస్ చేయించుకుంటున్న వారి సంఖ్యే 700కుపైగా ఉండటం గమనార్హం. కిడ్నీ వ్యాధి తొలిసారి 2017లో ఎ.కొండూరు మండలం దీప్లానగర్ తండాలో బయట పడింది. కాళ్ల నొప్పులు మొదలై...అవి వాస్తుండటంతో బాధితులు పరీక్షలు చేయించుకోగా, వ్యాధి వెలుగు చూసింది. గత ఏడేళ్లలో ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో సుమారు వెయ్యి మందికిపైగా కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబరుల్లోనే ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో 10 మంది కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. ఇంకా అనేక మంది డయాలసిస్ రోగులు ప్రాణాలతో పోరాడుతున్నారు. అనుమల్లంక గ్రామంలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో కిడ్నీ వ్యాధి ముదిరి ఐదుగురు చనిపోయారు. కనకపూడి దాసు, కనకపూడి భారతి జూలైలో చనిపోగా గొల్లమందల కృష్ణ, గొల్లమందల నారాయణ(అన్నదమ్ములు), వేల్పుల కోటమ్మ ఆగస్టులో మృతిచెందారు. గ్రామంలో 70 మందిలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ గ్రామానికి చెంతనే ఉంది వినగడప తండా. గ్రామంలో సుమారు 200 కుటుంబాలున్నాయి. ఈ గ్రామంలోనూ ప్రతి కుటుంబంలో ఒకరో ఇద్దరో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారి సంఖ్య 25 దాకా ఉంటుంది. కిడ్నీ వ్యాధితో బాధపడే వారిలో ఎక్కువ మంది వితంతువులే. వారి భర్తలు ఇదే వ్యాధిన బారినపడి మృతి చెందారు.

కలుషిత నీటి వల్లే..



ఫ్లోరోసిస్ నీరు వస్తోందని నిరుపయోగంగా వదిలేసిన చేతిపంపు, ఫ్లోరోసిస్ నీరు పట్టిన పాత్రలో మిగిలిన అవశేషాలు

కిడ్నీ ప్రభావిత గ్రామాల్లోని తాగునీరు కలుషితం కావడం వల్లే ఆయా ప్రాంతాల ప్రజలు కిడ్నీ వ్యాధిబారిన పడుతున్నారు. బోరు వాటరులో మోటాలిక్ ఎలిమెంట్స్‌తో(ఆర్సెనిక్, కాడ్మియం, లెడ్ వంటివి)పాటు ఫ్లోరైడ్, సిలికాన్ ఎక్కువగా ఉండటం వల్లే ఈ ప్రాంతవాసులు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. కిడ్నీ ప్రభావిత గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించగలిగితే చాలా వరకు సమస్య పరిష్కారమవుతుంది. కానీ ఏళ్ల తరబడి దీనికి సంబంధించిన పనులు పట్టాలు ఎక్కడం లేదు. జల్ జీవన్ మిషన్ కింద కిడ్నీ ప్రభావిత గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు ప్రయత్నం జరిగినా, గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతి కారణంగా ఆ పనులు అరకొరగానే ఆగిపోయాయి. అనుమల్లంక గ్రామానికి నీటిని అందించేందుకు కట్లేరు వద్ద బోరు ఏర్పాటు చేసి జలజీవన్ మిషన్ నిధుల రూ.35 లక్షలతో గ్రామంలోనికి పైపులైన్ వేశారు. ఆ పైప్‌లైనును శిథిలావస్థలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుకు కలిపారు. దీంతో గ్రామంలోని నీటితో కట్లేరు నీరు కూడా కలిసి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. అలాకాకుండా ప్రత్యేకంగా మరో ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించి అందులోకి కట్లేరు నీటిని నిల్వ చేసి ఉంటే దీప్లానగర్ తండా తాగునీటి సమస్యకు పరిష్కారం దొరికేది.



వంగిపోయిన నడుముతో ఒంటరిగా రోడ్డు దాటుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్థుడు...

సాయానికి సవాలక్ష నిబంధనలు

కిడ్నీ బాధితులకు ప్రభుత్వం అందించే సాయం రూ.10 వేలు పొందాలంటే ఎన్నో నిబంధనలు అడ్డుగా ఉన్నాయి. వ్యాధి తీవ్రత...క్రియాటిన్ స్థాయి... 20 డయాలసిస్‌లు చేయించుకుని ఉండడం వంటి నిబంధనలు సాయానికి ప్రాతిపదికగా ఉంటున్నాయి. సాధారణంగా వ్యాధికి గురైన వారిలో తొలి దశలో కిడ్నీలు 35 నుంచి 50 శాతం పాడవుతాయి. ఆ తర్వా త 80 శాతం వరకు పాడవుతాయి. మూడో దశలో 80 శాతం కన్నా ఎక్కువగా పాడవుతాయి. చివరికి డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బాధితునికి సీరం క్రియాటిన్ స్థాయి మూడు నెలల వ్యవధిలో రెండు సార్లు వైద్యపరీక్షల్లో 5 కంటే ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారణ కావాలి, అలాగే కిడ్నీ శుద్ధి సామర్థ్యం, కిడ్నీ పరిమాణం వంటి లెక్కలు కూడా ప్రభుత్వ సాయం పొందే అర్హతను నిర్ణయిస్తాయి. దీంతో చాలామంది ప్రభుత్వ సాయం పొందలేకపోతున్నారు.

మంచినీటి పథకం పూర్తిచేయాలి..

- తిరువూరు నియోజకవర్గ కిడ్నీ సమస్యలను అధ్యయనం చేయడానికి నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలి.
- తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి.
- కృష్ణా నది మంచినీటి పథకానికి తక్షణమే నిధులు మంజూరు చేసి వేగంగా పూర్తి చేసి స్వచ్ఛమైన మంచినీరును కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు అందించాలి. అప్పుడే ముందు తరాలు కిడ్నీ వ్యాధి బారినపడకుండా ఉంటాయి.
- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు బలవర్థక ఆహారాన్ని అందిస్తే వ్యాధిని తట్టుకునే శక్తి పెరుగుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. కిడ్నీ వ్యాధి ఉన్న వారికి పోషకాహారం అంగన్వాడీల ద్వారా అందించాలి. ఆహారపు అలవాట్లపై అవగాహన సదస్సులు నిర్వహించాలి.

ఇంటికో కష్టం..

కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో ఒక్కొక్క కుటుంబానిది ఒక్కో విషాదం. ప్రతి కుటుంబంలో ఒకరో, ఇద్దరో ఈ వ్యాధి బారినపడిన వారే. చాలా కుటుంబాలది రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. డయాలసిస్‌కు వెళితే మరొకరు తోడు రావాల్సి ఉంటుంది. అలా పని మానుకొని వెళితే కుటుంబం గడవటం కష్టమని డయాలసిస్‌కు వెళ్లకుండా మృత్యువుకు చేరువ అవుతున్న వారు ఎందరో ఉన్నారు. మందులు తెచ్చుకొని వాడుకుంటున్నారు.

భార్య, భర్త కిడ్నీ రోగులే..



మద్దాల ప్రసాద్, మరియమ్మ దంపతులు

అనుమల్లంక గ్రామ మాజీ సర్పంచి మద్దాల ప్రసాద్, మరియమ్మ దంపతులు ఇద్దరూ కిడ్నీ వ్యాధి బాధితులే. ప్రసాద్ 1995 నుంచి 2001 వరకు సర్పంచిగా చేశారు. వీరి ఇద్దరు కుమారులు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రసాద్‌కు మాత్రమే వృద్ధాప్య పింఛన్ వస్తుంది. మరియమ్మకు 5.5 ఎంజీ/డీఎల్(మిల్లీ గ్రామ్స్ పర్ డెసీలీటర్) క్రియాటిన్ ఉంది. సాధారణంగా రక్తంలో 1.2 ఎంజీ/డీఎల్ సీరం క్రియాటిన్ ఉంటే కిడ్నీలు సరిగా పనిచేయడం లేదని అర్థం. అలాంటిది మరియమ్మకు 5.5 ఉన్నా ఆమెకు కిడ్నీ రోగులకు వచ్చే పింఛన్ రావడం లేదు. కారణం డయాలసిస్ చేయించుకోవడం లేదు. క్రియాటిన్ 5 దాటితే డయాలసిస్ చేయించుకోవాలి. కానీ తనను డయాలసిస్‌కు తీసుకెళితే ఆ రోజుకు కొడుక్కి పని పోయినట్లేనని, అందుకే వెళ్లడం లేదని మరియమ్మ వాపోయింది. తాను తన భర్త ఇద్దరమూ మందులతో నెట్టుకొస్తున్నామని, ఇద్దరికీ కలిపి చెరో రూ.7వేలు నెలకు మందులకు అవుతాయని మరియమ్మ తెలిపింది.

చూసే దిక్కు లేరు..



అనుమల్లంకకు చెందిన చిరసాని ఆశీర్వాదం పరిస్థితి మరింత దయనీయం. ఆయన భార్య కరోనా సమయంలో చనిపోయింది. పిల్లలు పనుల కోసం విజయవాడ వెళ్లారు. నెలకోసారి చిన్న కుమారుడు మందులు తెచ్చి ఇస్తాడు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూనే ఆశీర్వాదం రోజూ కాస్త వండుకుని తిని కాలక్షేపం చేస్తున్నాడు. వచ్చే పింఛను డబ్బులు మందులకే సరిపోవడం లేదని, కొడుకుల సాయంతో కడుపు నింపుకుంటున్నానని ఆయన వాపోయారు.

ముందు కొడుక్కి.. ఇప్పుడు తండ్రికి..

మద్దాల వెంకటేశ్వరరావు అనే వృద్ధుని పెద్ద కుమారుడు బాబురావు 2018లో కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటూ మృతి చెందారు. ప్రస్తుతం వెంకటేశ్వరరావు డయాలసిస్ చేయించుకుంటున్నారు. తనకు వచ్చే రూ.10 వేల పింఛన్ వైద్య ఖర్చులకే చాలడం లేదని ఆయన వాపోయారు.

వితంతు పింఛనే దిక్కు..



వినగడప తండాకు చెందిన గుగులోతు సోమ్లి భర్త కేశ్య 2011 కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. సోమ్లి కూడా కిడ్నీ వ్యాధి బాధితురాలే. వితంతు పింఛన్ కింద వచ్చే రూ.4 వేలతోనే ఆమె వైద్యం చేయించుకుంటుంది. కూలీ పనులు చేసుకుంటూ జీవించే కుటుంబం. పిల్లలు ఉన్నా వారి కష్టార్జితం వారి పిల్లలకే చాలడం లేదు. నెలకు రూ.15 వేల వరకు వైద్యం కింద ఖర్చవుతుంది. ఓపిక ఉన్నంత వరకు పనిచేసి వచ్చిన డబ్బులతో మందులు కొనుక్కుంటాను.. ఆ తర్వాత నా పరిస్థితి ఏమిటని సోమ్లి వాపోతోంది.

లెక్కలోకి రానివెన్నో..

ఎ.కొండూరులోని ఉచిత డయాలసిస్ కేంద్రంలో రోజుకు 9 నుంచి 11 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. నెలకు సరాసరి 250 వరకు ఈ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్నారని టెక్నీషియన్ రామకృష్ణ తెలిపారు. ఇది అధికారికంగా ఇక్కడకు వస్తున్న వారి లెక్క మాత్రమే. ఇంకా ఖమ్మం, విజయవాడ, నూజివీడు తదితర చోట్ల డయాలసిస్ చేయించుకునే వారి సంఖ్య ఇంతకు రెట్టింపు ఉంటుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఎన్‌హెచ్‌-16పై డబుల్‌ ఫ్లైఓవర్‌

● మహానాడు నుంచి నిడమానూరు వరకు ఆరు వరసలతో రోడ్డు ● ఇదే మార్గంలో సెంట్రల్‌ డివైడర్‌పై లైట్‌ మెట్రో రైల్‌ ఎలివేటెడ్‌ కారిడార్‌
● నిడమానూరు నుంచి రామవరప్పాడు వరకు మెట్రో లైన్‌ ● త్వరలో జిల్లా అధికారులు, మెట్రో రైల్‌ కార్పొరేషన్‌ సమావేశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్‌-16)పై వీఐపీ కారిడార్‌లో ఫ్లై ఓవర్‌ ఆన్‌ ఫ్లై ఓవర్‌ (ఎఫ్‌ఓఎఫ్‌) రాబోతోంది. సాధారణ ఫ్లైఓవర్‌, మెట్రో ఫ్లై ఓవర్‌ ఒకదానిపై ఒకటి ఉంటాయి. ఇలాంటి అరుదైన ఫ్లై ఓవర్‌ విజయవాడకే సొంతం కాబోతోంది. మహానాడు జంక్షన్‌ నుంచి నిడమానూరు జంక్షన్‌ వరకు ఎన్‌హెచ్‌ - 16పై ఆరు వరసల ఫ్లైఓవర్‌ మంజూరైన సంగతి తెలిసిందే. అంతకంటే ముందుగా 2017-18 మధ్య కాలంలోనే లైట్‌ మెట్రో రైల్‌ ప్రాజెక్టులో భాగంగా ఇదే మార్గంలో ఎలివేటెడ్‌ విధానంలో మెట్రో కారిడార్‌ను ప్రతిపాదించారు. గత వైసీపీ ప్రభుత్వం లైట్‌ మెట్రో రైల్‌ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది. దీంతో లైట్‌ మెట్రో కథ అక్కడితో ఆగిపోయింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం మహానాడు ఫ్లైఓవర్‌కు అనుమతులు ఇవ్వడంతో దీనికి సంబంధించిన డీపీఆర్‌ చాలా కాలంగా జరుగుతోంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టు విషయం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి ఈ ప్రాజెక్టును కొనసాగించటానికి అంగీకరించింది. దీంతో డీపీఆర్‌ రూపకల్పనలో కొంత జాప్యం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతోనే ముగిసిపోయిందనుకున్న విజయవాడ లైట్‌ మెట్రో రైల్‌ ప్రాజెక్టు అంశం కూడా తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో డీపీఆర్‌లో మార్పులు చేయాల్సి వస్తోంది. దీనికి సంబంధించి అతి త్వరలో జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు వచ్చి ఏపీ మెట్రో రైల్‌ కార్పొరేషన్‌ ఉన్నతాధికారులతో చర్చించిన మీదట తుది డీపీఆర్‌లో ఆ మేరకు అలైన్‌మెంట్‌ను ఫిక్స్‌ చేయనున్నారు.

విజయవాడలోనే అతి పెద్ద ఫ్లై ఓవర్‌

విజయవాడకు ఇప్పుడున్న అన్ని ఫ్లైఓవర్ల కంటే నిడమానూరు ఫ్లైఓవరే అతి పెద్దది. దీని పొడవు 6.50 కిలోమీటర్లు ఉంటుంది. అయితే మెట్రో కారిడార్‌ రామవరప్పాడు నుంచి ఏలూరు రోడ్డు మీదుగా వెళుతుంది. అందువల్ల నాలుగు కిలోమీటర్లు మాత్రమే మెట్రో కారిడార్‌ హైవే మీదుగా వెళుతుంది. ముందుగా ఫ్లై ఓవర్‌ వేస్తే ఆ తర్వాత మెట్రో ఫ్లై ఓవర్‌ (ఎలివేటెడ్‌ కారిడార్‌) ఏర్పాటు చేయటం కష్టంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రెండు పద్ధతులను ఎన్‌హెచ్‌ అధికారులు ఆలోచిస్తున్నారు. ఇందులో ఒక పద్ధతి ఏమంటే జాతీయ రహదారుల సంస్థ నేతృత్వంలో నిర్మించే ఫ్లై ఓవర్‌ పైనే మెట్రో ఎలివేటెడ్‌ కారిడార్‌ కూడా కలిపి నిర్మించటం. దీనికి అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించటం. రెండవ పద్ధతి ఏమంటే - మెట్రో ఫ్లై ఓవర్‌ నిర్మించుకునేలా ఎన్‌హెచ్‌ ప్రతిపాదిత ఫ్లై ఓవర్‌ పిల్లర్లను దానికి అనుగుణంగా ఏర్పాటు చేస్తూనే కొంత ఎత్తు మేర నిర్మించటం. ఇలా చేస్తే ఈ పిల్లర్లు సెంట్రల్‌ డివైడర్‌లోకి వస్తాయి. ఈ పిల్లర్ల మీద తర్వాత మెట్రో పిల్లర్లను ఆ సంస్థ ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలా రెండు పద్ధతులతో ఎన్‌హెచ్‌ ఆలోచనలు సాగిస్తోంది. రానున్న రోజుల్లో ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

సమన్వయంతో దసరా ఉత్సవాలు విజయవంతం చేయాలి

హోం మంత్రి అనిత



వన్‌టౌన్‌, అక్టోబరు 2: ఇంద్రకీలాద్రిపై గురువారం నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాలను అన్ని శాఖల సమన్వయంతోపాటు విస్తృత బందోబస్తు మధ్య నిర్వహించనున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. దసరా మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తు, ఇతర అంశాలపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఏ భక్తుడు ఇబ్బందిపడకుండా అమ్మవారి దర్శనం సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ వీవీఐపీలు, ప్రముఖులకు టైమ్‌స్లాట్‌ ప్రకారమే దర్శనాలు ఉంటాయన్నారు. క్యూలో ఉన్న భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం ఏర్పాట్లు చేశారన్నారు. వృద్ధులకు, మహిళలకు ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హోమంత్రిని అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీస్సులు, ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి పెమ్మసాని



కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ బుధవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌



కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ అమ్మవారిని దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రామారావు, అర్చకులు ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



చిట్టినగర్‌ మహాలక్ష్మి అమ్మవారు

ఉత్సవాలకు ముస్తాబైన మహాలక్ష్మీ ఆలయం

చిట్టినగర్‌, అక్టోబరు 2: పాతబస్తీ ప్రాంతంలోని పురాతన దేవాలయాల్లో ఒకటైన చిట్టినగర్‌ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. విద్యుత్‌ దీపాల ఏర్పాటు చేస్తున్నారు. గురువారం నుంచి 10రోజులు పాటు అమ్మవారు వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు.



ధర్నాలో పాల్గొన్న మున్సిపల్‌ టీచర్లు

సమస్యలు పరిష్కరించండి

మున్సిపల్‌ టీచర్ల ధర్నా

ధర్నాచౌక్‌, అక్టోబరు 2: దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌ వద్ద బుధవారం మున్సిపల్‌ టీచర్లు ధర్నా నిర్వహించారు. యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌కుమార్‌ మాట్లాడుతూ మున్సిపల్‌ టీచర్ల పదోన్నతులు, బదిలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అనేక ఉద్యమాలు, వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. ఈ ప్రభుత్వమైనా స్పందించి న్యాయం చేయాలన్నారు. లేదంటే ఈ నెల 17న అన్ని జిల్లాల డీఈవో కార్యాలయాల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. జిల్లా ప్రధానకార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ మున్సిపల్‌ పాఠశాలల్లో టీచర్ల కొరత అధికంగా ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్‌ ఉపాధ్యాయులకు పీఎఫ్‌ అకౌంట్‌ విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో సత్తా చాటుదాం

ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌



పోరంకిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌

పెనమలూరు, అక్టోబరు 2 : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించుకొని కృష్ణా జిల్లా తరపున సత్తా చాటుదామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ పిలుపునిచ్చారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కూటమి పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ వచ్చే పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు, నాబార్డు నిధులతో వంతెనలు, రోడ్లు వేసే ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 45నుంచి 50శాతం జల్‌జీవన్‌ నిధులు, మునిసిపాలిటీ నిధులతో కలిపి ప్రతి ఇంటికీ ఒక కుళాయి ఇచ్చే కార్యక్రమాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో చర్చించి ఇప్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో 18వేలు, పెనమలూరులో 15వేల పట్టభద్రుల ఓట్లు ఉన్నాయన్నారు. గ్రామ, మండల, మునిసిపల్‌ స్థాయి కమిటీల్లో పార్టీ కోసం కష్టపడేవారికే స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో యువనేత వెంకట్రామ్‌, జనసేన నేతలు ముప్పారాజా, తాతపూడి గణేష్‌, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, యార్లగడ్డ సుచిత్ర, షేక్‌ బుజ్జి, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఐ నేత రామకృష్ణ



రైల్వే డివిజన్‌ కార్యాలయం వద్ద డీఆర్‌ఎం నరేంద్ర ఎ పాటిల్‌



పండిట్‌ నెహ్రూ బస్‌ స్టేషన్‌లో స్వచ్ఛతా హి సేవ

గాంధీ బోధించిన సమతావాదమే దేశానికి రక్ష

● గాంధీజీకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నివాళి ● బస్‌స్టేషన్‌, రైల్వే డివిజన్‌లో స్వచ్ఛతా హి సేవ

వన్‌టౌన్‌ : గాంధీ బోధించిన సమతావాదమే దేశానికి రక్ష అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. సీపీఐ విజయవాడ నగరసమితీ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని గాంధీ పార్క్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను మంట కలిపినవారు కేంద్రంలో అధికారంలోకి వచ్చి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ వంటి మతోన్మాద శక్తులతోపాటు నటులు కూడా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్‌ రాసిన రాజ్యాంగం, గాంధీజీ సమతావాదమే ప్రజలకు, దేశానికి రక్ష అన్నారు. నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, బుట్టి రాయప్ప, తాడి పైడయ్య, కొట్టు రమణరావ పాల్గొన్నారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో...

విజయవాడ రైల్వే డివిజన్‌లో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్‌ దివస్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో అయిదు మెట్రిక్‌ టన్నుల చెత్తను సేకరించి తరలించారు. ఒక్కో టీమ్‌లో 25 మంది చొప్పున 20 బృందాలుగా ఏర్పడి పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, జాక్‌ అండ్‌ జిల్‌ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. అంతకు ముందు టవర్‌ క్లాక్‌ వద్ద ఉన్న మహాత్మాగాంధీ చిత్రపటానికి డీఆర్‌ఎం నరేంద్ర ఎ పాటిల్‌, బ్రాంచ్‌ అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం శ్రీనివాసరావు కొండా, సీనియర్‌ డీఈ ఎం.కిషోర్‌, తదితరులు పాల్గొన్నారు.

పండిట్‌ నెహ్రూ బస్‌ స్టేషన్‌లో...

పండిట్‌ నెహ్రూ బస్‌ స్టేషన్‌లో గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ చీఫ్‌ ట్రాఫిక్‌ మేనేజర్‌ నర్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలను పీకివేసి పరిసరాలను శుభ్రం చేశారు.



ధర్నాలో పాల్గొన్న పీఠాధిపతులు

లడ్డూ ప్రసాదం కల్తీపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలి

విశ్వ హిందూ పరిషత్‌

ధర్నాచౌక్‌, అక్టోబరు 2: టీటీడీ పవిత్రను కాపాడాలని, లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని వక్తలు డిమాండ్‌ చేశారు. విశ్వ హిందూ పరిషత్‌ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా చేశారు. హిందూ దేవాలయాలను స్వతంత్ర ప్రతిపత్తి గల హిందూ ధార్మిక సంస్థకు అప్పగించాలన్నారు. నూతనంగా ఏర్పడే టీటీడీ పాలకమండలిలో ఛైర్మన్‌, సభ్యులను రాజకీయాలకు అతీతంగా ధార్మికత, దైవభక్తి కలిగిన హిందువులకే ఇవ్వాలన్నారు. మతా శివ చైతన్యానంద స్వామిని, శివ కేశవ పీఠాధిపతి శివస్వామి, శైవ క్షేత్రం పీఠాధిపతి గోకరాజు గంగరాజు, వీహెచ్‌పీ కేంద్రీయ ఉపాధ్యక్షుడు వై.రాఘవులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు రూ.2 లక్షల చీరలు

విజయవాడ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు సినీ దర్శకుడు పి.కాశీపరుశురామ్‌ రూ.2లక్షల చీరలను సమర్పించారు. కాశీ తల్లిదండ్రులు పి.శ్రీనివాసరావు, తల్లి నాగజ్యోతి పోలీసు కమిషనరేట్‌లో స్పెషల్‌ బ్రాంచ్‌ ఏఎస్‌ఐలుగా పనిచేస్తున్నారు. విజయవాడకు చెదిన కాశీ తల్లిదండ్రులతో కలిసి బుధవారం అమ్మవారిని దర్శించుకుని చీరలను అందజేశారు.



కూరగాయల లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మండవ వెంకటరత్నం, శీరం రామారావు తదితరులు

తిరుమలకు కూరగాయలు

లబ్బీపేట, అక్టోబరు 2 : మండవ కుటుంబరావు ప్రారంభించిన తిరుమల శ్రీవారి అన్నదాన పథకానికి అందించే కూరగాయల వితరణను మండవ శ్రీనివాస్‌ కొనసాగించడం అభినందనీయమని ఇందిరా ఫుడ్స్‌ అధినేత మండవ వెంకటరత్నం, శీరం రామారావు అన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు తొలి విడతగా 10టన్నుల కూరగాయల లారీని ఏ కన్వెన్షన్‌ నుంచి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరత్న, రామారావులు మాట్లాడుతూ కుటుంబరావు ఉన్నతకాలం బంధుమిత్రుల సహకారంతో ప్రతి నెల తిరుమలకు కూరగాయలు పంపేవారన్నారు. కార్యక్రమంలో దాతలు కంకణాల రమేష్‌, తుమ్మల భోగేశ్వర రావు, మండవ నాగేశ్వరరావు, లంకె ప్రసాదరావు, చలసాని వెంకటేశ్వరరావు, కాంతారావు, ప్రసాద్‌ పాల్గొన్నారు.



విరాళాన్ని నిర్వాహకురాలికి అందజేస్తున్న దాతలు

ఎన్‌ఆర్‌ఐల దాతృత్వం

వృద్ధాశ్రమానికి రూ.13 లక్షల విరాళం

అజిత్‌సింగ్‌నగర్‌, అక్టోబరు 2 : ఎన్‌ఆర్‌ఐలు తమ దాతృత్వాన్ని చాటారు. వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధ ఆశ్రమానికి రూ.13 లక్షల విలువచేసే ఇంటిని కొనుగోలుచేసి వారికి బహుమతిగా అందజేశారు. అమెరికాలో ఉంటున్న ఆశాజ్యోతి, వారి మిత్రబృందం తుమ్మలపల్లి రాజేశ్వరరావు, భాగ్యలక్ష్మి, వంశీకృష్ణ మాతృదేవోభవ ఆశ్రమం గురించి తెలుసుకున్నారు. బుడమేరు వరదలో సమయంలో ఆశ్రమంలోని వృద్ధులు ఎదుర్కొన్న ఇబ్బందులను సోషల్‌ మీడియా ద్వారా తెలుసుకుని ఆశ్రమానికి సొంత ఇంటిని ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. వాంబేకాలనీలో ఓ ఇంటిని కొనుగోలు చేసేందుకు ఆ విరాళాన్ని అందించారు. దీనికి సంబంధించిన చెక్కును దాతల కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎం.రామకృష్ణ, గోపీకృష్ణ ఆశ్రమ నిర్వాహకురాలు ఎం.దుర్గకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వేధింపులు తాళలేకే కూతురు మృతి

● వైసీపీ నేతల అండతో తమపైనే కేసు
● ఓ తల్లి ఆవేదన

ధర్నాచౌక్‌, అక్టోబరు 2: ప్రేమ పేరుతో వంచించి పెళ్లి చేసుకుని, ఆ తర్వాత వేధించి ఆమె మృతికి కారణమైన నిందితులను శిక్షించి తమకు న్యాయం చేయాలని గుంటూరు జిల్లా నల్లపాడుకు చెందిన మృతురాలి జననీ తల్లి శంకరలీలా, పెద్దమ్మ ఓంకారమ్మ ప్రభుత్వాన్ని కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ డిగ్రీ మూడో ఏడాది చదవుతున్న తమ కూతురును ప్రేమ పేరుతో బండారు ఆనంద్‌ అనే ఆటోడ్రైవర్‌తో 2022 జూలై 4న వెళ్లిపోయిందన్నారు. అదేరోజు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అప్పుడు స్థానిక వైసీపీ నేతల అండతో తమపైనే అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 14 నెలల తర్వాత గుంటూరు జనరల్‌ ఆసుపత్రిలో తమ కూతురిని శవంగా తమకిచ్చారని కన్నీటి పర్యంతమయ్యారు. తమ కూతురు మృతికి కారణమైన నింది తులను, వారిని కాపాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమ కూతురు మృతి చెంది ఏడాది గడుస్తున్నా నేటికి తమకు న్యాయం జరగలేదని, తమకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. లాయర్‌ సలీం మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయకపోగా వారిపైనే అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు.

రేపు శాప్‌ ఛైర్మన్‌ బాధ్యతల స్వీకరణ

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 2 : నగరంలోని శాప్‌ ప్రధాన కార్యాలయంలో ప్రభుత్వం నామినేట్‌ చేసిన నూతన శాప్‌ ఛైర్మన్‌ అనిమిని రవినాయుడు ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు పదవీ బాధ్యతలను స్వీకరించనున్నారని, ఈ కార్యక్రమానికి క్రీడా సంఘాల ప్రతినిధు హాజరై విజయవంతం చేయాలని ఏపీవోఏ సెక్రటరీ కేపీ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత

● నగరపాలక సంస్థ కమిషనర్‌ ధ్యానచంద్ర ● టెర్రస్‌ గార్డెనింగ్‌ విజేతకు రూ.10వేలు బహుమతి



గార్డెన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్‌ ధ్యానచంద్ర

భారతీనగర్‌, అక్టోబరు 2 : ఇళ్ల మిద్దెలపై మొక్కల పెంపకాన్ని చేపడితే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్‌ ధ్యాన్‌చంద్ర అన్నారు. ఇన్వైట్‌ యువర్‌ కమిషనర్‌ కార్యక్రమంలో విజేతగా నిలిచిన భారతీనగర్‌ కాలనీ రెండో రోడ్డులోని ధవలేశ్వరపు నాగలక్ష్మి ఇంటికి బుధవారం వెళ్లి టెర్రస్‌ గార్డెన్‌ను పరిశీలించి రూ.10 వేలు చెక్కును బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ టెర్రస్‌, బాల్కనీ, బ్యాక్‌ యాడ్‌లో వన్‌ఎర్త్‌ వన్‌ లైఫ్‌ వారు సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న కూరగాయలు, పండ్లు తీసుకోవడం ఆరోగ్యానికి చాలామంచిదన్నారు. విజేతగా ఎంపికైన నాగలక్ష్మి మాట్లాడుతూ విషరసాయన రహిత, సేంద్రీయ పద్ధతిలో వన్‌ఎర్త్‌ వన్‌ లైఫ్‌ అను సిద్ధాంతంతో నాన్‌ గవర్నమెంట్‌ ఆర్గనైజేషన్‌ వలంటీర్‌గా పనిచేస్తూ కార్పొరేషన్‌ సహకారంతో రైతుబజారుల్లో పడేసిన కూరగాయలను తీసుకువచ్చి వాటితో ఎరువులు తయారుచేసి టెర్రస్‌ గార్డెన్‌లో ఎరువును ఉపయోగిస్తూ, కూరగాయలను పండిస్తున్నామన్నారు. ఆ కూరగాయలనే వండుకొని తింటున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్‌ కమిషనర్‌ చంద్రశేఖర్‌, చీఫ్‌ మెడికల్‌ హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ పి.రత్నావళి, అసిస్టెంట్‌ మెడికల్‌హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ బాబు శ్రీనివాస్‌, డిప్యూటీ సిటీ ప్లానర్‌ జుబిన్‌ చీరన్‌రాయ్‌, ఎస్టేట్‌ ఆఫీసర్‌ టి.శ్రీనివాస్‌, స్వచ్ఛసర్వేక్షన్‌ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన మద్యం విధానాన్ని సవరించాలి

● మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్‌



మహిళా సంఘాల ఆధ్వర్యంలో లెనిన్‌ సెంటర్‌లో నిరసన

గవర్నర్‌పేట, అక్టోబరు 2: మద్యం అమ్మకాలతో ప్రభుత్వం మహిళల జీవితాలతో ఆడుకోవాలని చూస్తోందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ఈ నెల నుంచి అమలులలోకి తీసుకువచ్చే నూతన మద్యం విధానాన్ని సవరించాలని డిమాండ్‌ చేశారు. మద్యాన్ని నిషేధించకపోగా ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా దుకాణాల సంఖ్య పెంపుతోపాటు, 99 రూపాయలకే క్వార్టర్‌ బాటిల్‌ అందించడం వంటి వాటిని నిరసిస్తూ మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ లెనిన్‌ సెంటర్‌లో నిరసన దీక్ష జరిగింది. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం, మహిళా కాంగ్రెస్‌ నిరసనలో పాల్గొన్నాయి. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించాలని నినాదాలు చేశారు. సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. సోషలిస్టు నాయకులు వి.వి.కృష్ణారావు, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ, నగర మేయర్‌ రాయన భాగ్యలక్ష్మి, రైతు సంఘం నేత వై.కేశవరావు, కార్మిక సంఘాల నేతలు ఆర్‌. రవీంద్రనాథ్‌, వి.ఉమామహేశ్వరరావు, సుబ్బరావమ్మ, కాంగ్రెస్‌ నాయకురాలు సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రత్నాచల్‌ ఎక్స్‌ప్రెస్‌కు 30 వసంతాలు



రైల్వే స్టేషన్‌, అక్టోబరు 2: రత్నాచల్‌ ఎక్స్‌ప్రెస్‌కు 30 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా బుధవారం విజయవాడ డివిజన్‌లో వేడుక జరుపుకున్నారు. 1994 అక్టోబరు 2వ తేదీన అన్నవరం సత్యనారాయణస్వామి కొలువైన రత్నగిరి కొండ పేరిట ఈ ఎక్స్‌ప్రెస్‌కు రత్నాచల్‌ అని నామకరణం చేశారు. ఈ రైలు విజయవాడ, విశాఖపట్నం మధ్య ప్రధానమైన లింకుగా మారింది. ఆ రువాత 1999లో సూపర్‌ ఫాస్ట్‌ సర్వీసుగా మార్పు చెందింది. 2006లో 24 కోచ్‌ల సామర్థ్యంతో ఆధునీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రయాణికులు రత్నాచల్‌ ఎక్స్‌ప్రెస్‌ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. అప్‌ అండ్‌ డౌన్‌లో రత్నాచల్‌ ఎక్స్‌ప్రెస్‌లో 140 శాతం ఆక్యుపెన్సీ ఉండటం విశేషమని అధికారులు తెలిపారు.

జాతీయస్థాయి త్రోబాల్‌ చాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్లు



విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 2 : తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌ కేవీబీఆర్‌ ఇండోర్‌ స్టేడియంలో గురువారం నుంచి 5వ తేదీ వరకు జరిగే జూనియర్‌ జాతీయస్థాయి త్రోబాల్‌ చాంపియన్‌ షిప్‌లో పాల్గొనే రాష్ట్ర బాల, బాలికల జట్లు ఇందిరాగాంధీ మున్సిపల్‌ స్టేడియం నుంచి బుధవారం బయలుదేరాయి. త్రోబాల్‌ అసోసియేషన్‌ సెక్రటరీ ఎండీ గౌస్‌ బాషా, ఛైర్మన్‌ పి.సత్యానారాయణరాజు, కార్పొరేటర్‌ శిరీష, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ ఈదా సులోచన జట్టు సభ్యులకు జెర్సీలు అందజేశారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్లు ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

బాలుర జట్టు సభ్యులు.....

దిలీప్‌కుమార్‌, శ్రీవత్స, ప్రమోద్‌కుమార్‌, జైసాయి, వెంకట నాగచరణ్‌, జ్యోతి వర్మ, యశ్వంత్‌ రతన్‌, ఆనంద్‌, శివకుమార్‌, నూకరాజు, సురేష్‌, ఫణిభూషణ్‌, రాజేష్‌, నందు.

బాలికలు..

చందన, జోషిత, లోహిత, పల్లవి, లహరి, రాజ్యలక్ష్మి, దుర్గాభవాని, బి.సరిత, ద్రాక్షాయణి, సునీత, సాయి కీర్తన, లక్ష్మి, ఆషిత, శ్రావణి.




మహాత్మగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులర్పిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సత్యం, అహింస మహాత్ముని ఆయుధాలు

గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రికి ఘనంగా నివాళులర్పించిన గవర్నర్, నేతలు

అమరావతి, న్యూఢిల్లీ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు మహాత్మ గాంధీ సత్యం, అహింసను తన ఆయుధాలుగా ఎంచుకున్నారని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గుర్తుచేశారు. గాంధీ 155వ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి 120వ జయంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్ వారికి నివాళులర్పించారు. బుధవారం ఉదయం రాజ్‌భవన్ దర్బార్ హాలులో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వతంత్ర్య ఉద్యమంలో వారి పాత్రను గుర్తు చేశారు. కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గాంధీ, శాస్త్రికి ఆ పార్టీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ ఇద్దరు మహా నేతల చిత్రపటాలకు పుష్పమాలలు వేసి అంజలి ఘటించారు. గాంధీ మహాత్ముని ఆశయాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలనను అరికట్టి.. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం పాలన సాగిస్తోందని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అశోక్ బాబు, జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, పార్టీ మీడియా విభాగం సమన్వయకర్త దారపునేని నరేంద్రబాబు, నేతలు చప్పిడి రాజశేఖర్, చెన్నుపాటి గాంధీ, కోటేశ్వరరావు, చలపతి రావు, హసన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

ఏపీ భవన్‌లో... గాంధీ జయంతి వేడుకలను ఏపీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ హిమాంశు కౌశిక్ జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్ముని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మంగళగిరిలోని డా.ఎన్టీఆర్ వైద్య సేవలు ట్రస్ట్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో జి.లక్ష్మీషా, ట్రస్ట్ అడ్మిన్ ఈవో వెంకట దీపక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మహాత్మగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

కూటమి సర్కారుపై కొత్త ఆశలు!

- విద్యుదుత్పత్తి పునఃప్రారంభానికి ప్రైవేటు సంస్థలు సిద్ధం
- నేడు మంత్రి గొట్టిపాటితో భేటీ

అమరావతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) రద్దు, న్యాయస్థానాల్లో వ్యాజ్యాలతో గత ఐదేళ్లు విలవిలలాడిన ప్రైవేటు విద్యుదుత్పత్తి సంస్థలు.. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకావడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. అప్పట్లో నిలిపివేసిన ఉత్పత్తిని తిరిగి ప్రారంభించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. అయితే దానికి ముందుగా పలు సమస్యలు పరిష్కారం కావలసి ఉంది. ప్రైవేటు పునరుత్పాదక విద్యుత్ సంస్థలతో 2014-19 నడుమ చంద్రబాబు ప్రభుత్వం కుదుర్చుకున్న సౌర, పవన విద్యుత్ పీపీఏలను.. జగన్ సీఎం అయ్యాక కేంద్రం వద్దన్నా రద్దుచేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఆయా సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. రెండు వ్యాజ్యాలు దాఖలు చేయగా.. ఒక పిటిషన్‌పై తీర్పు వచ్చింది. మరో వ్యాజ్యంపై విచారణ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇంకోవైపు.. గ్రీన్ క్లీన్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్న చంద్రబాబు ప్రభుత్వం.. సౌర, పవన విద్యుదుత్పత్తిని పునరుద్ధరించే దిశగా ఆయా సంస్థలతో సంప్రదింపులు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో సంస్థల యాజమాన్యాలు సమావేశం కానున్నాయి. 2018 జూలై నుంచి 2022 మే వరకూ లేట్ పేమెంట్ సర్‌చార్జి కింద డిస్కంలకు చెల్లించాల్సిన రూ.620 కోట్లు, మరో రూ.200 కోట్ల చెల్లింపులపైనా చర్చ జరుగనుంది. ఉత్పత్తి ఆధారిత రాయితీ (జీబీఐ)పైనా సమీక్షిస్తారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో తాము ఆర్థికంగా నష్టపోయామని ప్రైవేటు సౌర, పవన విద్యుదుత్పత్తి సంస్థలు వాపోతున్నాయి. తమను ఆదుకుంటేనే భవిష్యత్‌లో రాష్ట్రంలో వ్యాపారాన్ని, ఉత్పత్తిని విస్తరించేందుకు వీలుంటుందని చెబుతున్నాయి. గురువారం నాటి సమావేశానికి దాదాపు 15 వరకూ సంస్థలు వస్తాయని ఇంధన శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చర్చలు కొలిక్కి వస్తే.. రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతాయని ఆశిస్తున్నాయి.

అవ్వా తాతలకు పెద్దకొడుకు చంద్రన్న: అనగాని

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును అవ్వా తాతలు తమ పెద్ద కొడుకు భావిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే ఒకటో తేదీన ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తుండటంతో వారంతా ఆనందడోలికల్లో తేలియాడుతున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వంగవీటి రాధాకు చంద్రబాబు పరామర్శ

విజయవాడ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను సీఎం చంద్రబాబు పరామర్శించారు. ఆయనకు ఫోన్‌చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే దగ్గుబాటి విరాళం

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, ఆయన అనుచరులు కలసి రూ.11,28,100 విరాళంగా అందజేశారు. మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం కలిసి చెక్కు అందించారు.

బడి భోజనంలో ఇక జిల్లాకో మెనూ

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఒకే మెనూ విధానం అమల్లో ఉంది. ఇకపై ప్రాంతాల వారీగా మెనూ ఉండాలని నిర్ణయించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల ఆహారపు అలవాట్లకు తగ్గట్టుగా మెనూ రూపొందిస్తారు. ఆ బాధ్యతను కలెక్టర్లకు అప్పగించారు. ఈనెలాఖరు నుంచే కొత్త మెనూ అమల్లోకి రానుంది.

ఉన్నత విద్యలో సీఈఎంఎస్

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో సమగ్ర పరీక్షల నిర్వహణ విధానం(సీఈఎంఎస్) అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం పరీక్షల విధానాన్ని డిజిటలైజ్ చేయాలని, విశ్లేషణ అవసరం అని గుర్తించి ఏపీ టెక్నలాజికల్ సర్వీసెస్ ద్వారా టెండర్లు ఆహ్వానించింది.

నేడు పోలవరానికి పీపీఏ సీఈవో

అమరావతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో అతుల్‌జైన్ గురువారం పోలవరం రానున్నారు. శుక్రవారం రాజమండ్రిలో ప్రాజెక్టు ఇంజనీర్లు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. నిజానికి గతంలోనే ఆయన పోలవరం రావాలనుకున్నారు. అయితే గోదావరి వరదల కారణంగా ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో పర్యటనను వాయిదా వేసుకుంటూ వచ్చారు.

రేషన్‌షాపుల హేతుబద్ధీకరణకు తాత్కాలిక బ్రేక్

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల హేతుబద్ధీకరణ(రేషనలైజేషన్) ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. రాష్ట్రంలోని 29,795 రేషన్ షాపుల ద్వారా మొత్తం 1,48,43,671 కార్డుదారులకు పౌరసరఫరాల శాఖ ద్వారా సరుకులను రాయితీ ధరలపై పంపిణీ చేస్తున్నారు. కొన్ని రేషన్ షాపులకు ఎక్కువ కార్డులు, మరికొన్నింటికి అతి తక్కువ రేషన్‌కార్డులు ఉండటంతో వచ్చే కమీషన్ డబ్బులు షాపుల అద్దెకు కూడా సరిపోక చాలామంది డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అన్ని రేషన్ షాపులకు సమాన ప్రాతిపదికన రేషన్ కార్డులు సర్దుబాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం రేషనలైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. అయితే రేషనలైజేషన్ ప్రక్రియపై కొందరు రేషన్ డీలర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో డీలర్ల అభిప్రాయాలు తీసుకోకుండా ఈ ప్రక్రియను కొనసాగించవద్దని న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో రేషనలైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు నేతృత్వంలో సమాఖ్య ప్రతినిధి బృందం బుధవారం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేసింది.

ఐఆర్‌జీసీని ఉగ్ర సంస్థగా ప్రకటించండి

- భద్రతామండలిలో ఇజ్రాయెల్

న్యూయార్క్, అక్టోబరు 2: ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్(ఐఆర్‌జీసీ)ని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని ఐరాస భద్రత మండలిలో ఇజ్రాయెల్ డిమాండ్ చేసింది. ఐఆర్‌జీసీకి తన-పర బేధం లేదని.. చంపడమొక్కటే ఆ సంస్థ లక్ష్యమని ఐరాసలో ఇజ్రాయెల్ ప్రతినిధి డానీ డానన్ ఆరోపించారు. ఇంకా హమాస్ చెరలో ఉన్న 101 మంది బందీలను విడుదల చేసేదాకా ఇజ్రాయెల్ వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణిదాడుల దాడిపై బుధవారం భద్రతా మండలిలో సుదీర్ఘ చర్చ జరిగింది. లెబనాన్‌లో దురాక్రమణను ఆపాలంటూ ఫ్రాన్స్, తమ దేశంపై ఇరాన్ దాడికి వ్యతిరేకంగా ఇజ్రాయెల్ తీర్మానాలు చేశాయి.

పుణేలో కూలిన హెలికాప్టర్.. ముగ్గురి మృతి

పుణే, అక్టోబరు 2: ప్రైవేటు విమానయాన సంస్థకు చెందిన హెలికాప్టర్ కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు, ఒక ఇంజనీరు మరణించారు. మహారాష్ట్రలోని పుణే జిల్లాలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. అదే హెలికాప్టర్‌ను తమ పార్టీ అద్దెకు తీసుకుందని, మంగళవారం ఆ హెలికాప్టర్‌లో తాను బీడ్ జిల్లాలోని పార్లీకి ప్రయాణించానని, బుధవారం కూడా ముంబై నుంచి రాయ్‌గడ్‌కు అదే హెలికాప్టర్‌లో తాను ప్రయాణించాల్సి ఉండగా, అంతలోనే ఈ దుర్ఘటన జరిగిందని ఎన్సీపీ మహారాష్ట్ర అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు సునీల్ తత్కరే పీటీఐకి తెలిపారు.

సాగర జలాలపై ప్రపంచ యాత్ర ప్రారంభం

పనాజీ, అక్టోబరు 2: ప్రపంచాన్ని చుట్టొచ్చేందుకు, సముద్ర జలాలపై అధ్యయనం చేసేందుకు భారత నేవీకి చెందిన ఇద్దరు మహిళా అధికారులు చేపట్టిన సాహస యాత్ర బుధవారం మొదలైంది. లెఫ్టినెంట్ కమాండర్లు దిల్నా కె, రూప కె.. 'నావికా సాగర్ పరిక్రమ' పేరిట చేపట్టిన ఈ యాత్రను గోవాలోని పనాజీలో నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. 'ఇండియన్ నావల్ సెయిలింగ్ వెజెల్ (ఐఎన్ఎస్‌వీ) తారిణి'లో దిల్నా, రూప.. సాగర జలాలపై ప్రపంచాన్ని చుట్టిరానున్నారు. ఎనిమిది నెలలపాటు సాగే ఈ యాత్రలో వారు 21,600 నాటికల్ మైళ్లు (40వేల కి.మీ) ప్రయాణించనున్నారు. ఈ యాత్ర వచ్చే ఏడాది మేలో ముగియనుంది.



డొంకరాయి జలాశయంలో మొసళ్లు

అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి మంగళవారం రాత్రి మూడు మొసళ్లు బయటకు వచ్చాయి. వాటిని చూసి ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. మూడింటిలో రెండు మొసళ్లు తిరిగి జలాశయంలోకి వెళ్లిపోగా, ఒకటి మాత్రం డ్యామ్ రెండో గేటు సమీపంలోని రోడ్డుపై ఉండిపోయింది. జెన్‌కో సెక్యూరిటీ సిబ్బంది అతికష్టంపై మొసలిని జలాశయంలోకి పంపించారు.

- సీలేరు

మళ్లీ అడ్డగోలు బదిలీలు!

టీచర్ల సిఫారసు బదిలీలకు చర్యలు

వినతులపై నివేదికలకు విద్యా శాఖ ఆదేశం

- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా బదిలీలు
- ఇప్పుడూ అదే తరహా పోకడలు ఏంటంటూ ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన
- తక్షణమే ఈ ప్రక్రియ ఆపాలి: ఏపీటీఎఫ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



కొత్త ప్రభుత్వంలోనూ టీచర్ల అడ్డగోలు బదిలీల వ్యవహారం తెరపైకి వస్తోంది. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా జరిగిన అక్రమ బదిలీల తరహాలో సిఫారసు బదిలీలకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 16 మంది టీచర్ల వినతులపై సవివర నివేదికలు సమర్పించాలంటూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పయ్యావుల పార్వతి ఆదివారం డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు, విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ, శ్రీసత్యసాయి, అన్నమయ్య, ఎన్టీఆర్, బాపట్ల, నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో ఈ సిఫారసు బదిలీలకు వినతులు వచ్చాయంటూ టీచర్ల వివరాలను పేర్కొన్నారు. వారి వినతులపై రిమార్కులు, ప్రత్యామ్నాయ అవకాశాలను నివేదికల్లో వివరించాలని సూచించారు. కాగా ఈ వ్యవహారంపై ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వం పెద్దఎత్తున అడ్డదారిలో టీచర్లను బదిలీలు చేసింది. దాదాపు 2వేలమందికి పైగా బదిలీలకు అప్పట్లో ఉత్తర్వులు జారీ చేసింది. వారిలో వెయ్యి మందికిపైగా టీచర్లు దొడ్డిదారిలో బదిలీ అయ్యారు. ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారింది. అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖలో అప్పటి సర్వీసుల జేడీ రామలింగం, సచివాలయంలో పాఠశాల విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి పాత్ర ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపించాలనే డిమాండ్లూ ఉన్నాయి. ఈ బదిలీలకు సంబంధించి దాదాపు రూ.వంద కోట్లు చేతులు మారినట్లు ప్రచారం జరిగింది. ఇది అప్పట్లో పెద్ద వివాదమైంది. అలాంటి బదిలీలకు తావు లేదని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ అదే తరహా బదిలీలకు తెరతీయడం అనుమానాలకు తావిస్తోంది.

కౌన్సెలింగ్ విధానంలోనే జరగాలి: ఏపీటీఎఫ్

గత ప్రభుత్వంలో వందల సంఖ్యలో సిఫారసు బదిలీలు చేశారని, ఇప్పుడు కూడా మళ్లీ అవే తరహాలో బదిలీలు చేస్తారా? అని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో సిఫారసు బదిలీలు ఉండవని గతంలో మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు సిఫారసు బదిలీలపై ఆదేశాలు జారీ చేశారన్నారు. వెంటనే ఈ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు చేపడితే కౌన్సెలింగ్ విధానంలోనే జరగాలన్నారు.

హాజరు స్కానర్ల టెండర్లలో ఎల్1గా 'మంత్ర'

- యూఐడీఏఐ నిషేధిత సంస్థ అంటూ మంత్రపై ఫిర్యాదులు
- టెండరు ఖరారు చేయకుండా నిలిపివేత
- డిసెంబరు దాకా పాత యంత్రాలకు అనుమతి
- గ్రామ, వార్డు సచివాలయ శాఖలో వేలిముద్ర స్కానర్ల టెండర్ల వ్యవహారం

అమరావతి, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు కోసం వాడే వేలిముద్ర స్కానర్ల కాంట్రాక్టును అనుమతి లేని మంత్ర సంస్థ దక్కించుకోవడంతో గ్రామ, వార్డు సచివాలయ శాఖ టెండర్లు నిలిపేసింది. గ్రామ, వార్డు సచివాలయ శాఖలో సుమారు 1,34,450 స్కానర్లు కొనుగోలుకు ఆ సంస్థ ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీస్ సంస్థ (ఏపీటీఎస్)కు బాధ్యతలు అప్పజెప్పింది. ఏపీటీఎస్ అక్టోబరు 3న టెండర్లు పిలుస్తూ అర్హత కలిగిన సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. టెండరు నిబంధనల ప్రకారం.. స్కానర్లు సరఫరా చేయడంతోపాటు మూడేళ్లపాటు సర్వీసు అందించాలి. అయితే ఈ టెండర్ల కోసం మంత్ర సంస్థ ప్రొడక్టు సరఫరా చేసేందుకు అక్షర ఎంటర్‌ప్రైజెస్, స్టార్‌టెక్ ప్రొడక్టును సరఫరా చేసేందుకు సెల్‌కాన్ సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. ఒక్కో స్కానర్ రేటును రూ.3,200లుగా ప్రభుత్వం నిర్ణయించగా.. రూ.1,989కే సరఫరా చేస్తామని అక్షర ఎంటర్‌ప్రైజెస్ కోట్ చేయడంతో ఎల్1గా ఎంపికైంది. అయితే స్కానర్లు సరఫరా చేసే సంస్థకు యూఐడీఏఐ (యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) నుంచి అనుమతి ఉండాలి. మంత్ర సంస్థను యూఐడీఏఐ నిషేధించిందని, ఆ సంస్థకు టెండరు ఖరారు చేయవద్దంటూ పలు ఫిర్యాదులు అందాయి. దీంతో మంత్ర సంస్థకు టెండర్ ఖరారు చేయకుండా ఏపీటీఎస్ నిలిపేసింది. అయితే ప్రస్తుతం ఉపయోగిస్తున్న స్కానర్లను డిసెంబరు 31 దాకా వాడుకునేందుకు అనుమతిస్తూ యూఐడీఏఐ ఆదేశాలిచ్చింది. దీంతో యూఐడీఏఐ అనుమతి తీసుకొస్తామని, అప్పటి దాకా టెండర్ల అప్పగింత నిలిపేయాలని మంత్ర సంస్థ దరఖాస్తు చేసుకుంది.

సన్యాసం తీసుకోండని ఎవరికీ చెప్పం!

- తప్పుడు ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు: ఈశా ఫౌండేషన్

చెన్నై, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకోవాలని గానీ, సన్యాసం స్వీకరించాలని గానీ తామెవ్వరినీ అడగబోమని కోయంబత్తూరులోని ఈశా ఫౌండేషన్ కేంద్రం ప్రకటించింది. ఈశా యోగా కేంద్రంలో జరుగుతున్న పోలీసు తనిఖీలు, దీనికి సంబంధించి హైకోర్టు చేసిన వ్యాఖ్యలు, ఆదేశాలపై స్పందించిన ఆ కేంద్రం ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రజలకు యోగా, ఆధ్యాత్మికతను అందించడానికి సద్గురు.. ఈశా ఫౌండేషన్‌ను స్థాపించారని తెలిపింది. ఈశా యోగా కేంద్రంలో వేలాదిమంది సన్యాసులు, బ్రహ్మచారులు ఉన్నట్టు వివరించింది. కోర్టులో నిజమే గెలుస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొంది. ఫౌండేషన్ పై నిరాధార ఆరోపణలు, తప్పుడు ప్రచారం చేసినట్టయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

హంద్రీ-నీవా సామర్థ్యం పెంచుదాం

- చింతలపూడికి అడ్డంకులు తొలగిద్దాం
- భూసేకరణ పూర్తిగా దృష్టిపెట్టాలి
- కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయండి
- అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం
- ప్రాధాన్య ప్రాజెక్టులపై సమీక్ష



హంద్రీనీవా, చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ వరప్రదాయిని హంద్రీ-నీవా సుజల స్రవంతి సామర్థ్యాన్ని పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. మొదటి దశలో సామర్థ్యం పెంచడం.. ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ పనులు చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకుల తొలగింపుపైనా దృష్టిపెట్టాలని స్పష్టం చేశారు. బుధవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ప్రాధాన్య ప్రాజెక్టులపై ఆయన సమీక్ష నిర్వహించారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వంలోనే కీలక పనులన్నీ పూర్తి చేసుకున్న ఈ ప్రాజెక్టులు వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి చెప్పారు. కృష్ణాజలాలను ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల వరకూ తరలించే ఉద్దేశంతో 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించాం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 80 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన ఇరవై శాతం పనులను జగన్ ప్రభుత్వం పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించింది. దీంతో సీమ జిల్లాలకు కృష్ణా జలాలు అందించలేకపోతున్నాం. హంద్రీ-నీవా సామర్థ్యాన్ని పెంచడంతో పాటు.. ఎత్తిపోతల పథకాలపైనా దృష్టిసారించాల్సి ఉంది. చివరి ఆయకట్టుదాకా సాగునీటిని తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాలి' అని స్పష్టం చేశారు. రామానాయుడు గతవారం కర్నూలు, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించారు. హంద్రీ-నీవా ప్రధాన కాలువ, రిజర్వాయర్లు, పుంగనూరు బ్రాంచి కెనాల్, కుప్పం బ్రాంచి కెనాల్‌ను పరిశీలించారు. ఆ సందర్భంగా తన దృష్టికి వచ్చిన అంశాలపై అధికారులతో సమీక్షించారు. అలాగే ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు సాగు, తాగునీరందించే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు గత టీడీపీ ప్రభుత్వంలోనే 70 శాతం పూర్తయ్యాయని గుర్తుచేశారు. వైసీపీ పాలనలో పనులేవీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ పథకాన్ని ప్రాధాన్యతా ప్రాజెక్టుల జాబితాలో చేర్చాలని, పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రధాన అడ్డంకి భూసేకరణను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు-ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పనులకు ఊపు!

డిసెంబరు నుంచి ముమ్మరంగా నిర్మాణాలు

- 2 వేల కోట్లతో ఇప్పటికే పలు ప్రాజెక్టులకు టెండర్లు
- కన్సల్‌టెంట్ కోసం టెండర్లు .. ఈ నెలలో ఖరారు
- భూ సేకరణ సమస్యలు కొలిక్కిరాగానే.. ప్రధాన ప్రాజెక్టుల పనులు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి): టెక్నికల్ కమిటీ నివేదిక కోసం జాప్యమైన అమరావతి రాజధాని పనులు డిసెంబరు నెల నుంచి ఊపందుకోనున్నాయి. కొత్త సంవత్సరంలో రాజధానిలో పతాక స్థాయిలో పనులు జరిగే పరిస్థితి ఉంది. టెక్నికల్ రిపోర్టుతో సంబంధం లేని రూ.2 వేల కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ ఇప్పటికే టెండర్లు పిలిచింది. ఈ టెండర్లు కొలిక్కి రావటానికి మరికొంత సమయం పడుతుంది. వీటిలో ప్రధానంగా సీఆర్‌డీఏ ప్రధాన పరిపాలనా కార్యాలయం బ్యాలెన్స్ పనులు పూర్తి చేసేందుకు రూ.160 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. దీంతో పాటు సమాంతరంగా ఇంటీరియల్ డిజైన్స్, ఆర్కిటెక్ట్ డిజైన్స్ తదితర పనులకు మరో రూ.129 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పనులకు రూ.930 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. హ్యాపీనెస్ట్‌లో ఇంటీరియర్, ఆర్కిటెక్చర్, అదనపు హంగుల కోసం మరో రూ.730 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్న ఇవన్నీ కొలిక్కి రావటానికి కొంత సమయం పడుతుంది. టెండర్లు ఖరారై పనులు చేపట్టడానికి నవంబరు, డిసెంబరు నాటికి సమయం పట్టే అవకాశం ఉంది. టెక్నికల్ కమిటీ ద్వారా నియమితులైన హైదరాబాద్, చెన్నై ఐఐటీ సంస్థల ప్రతినిధులు ఇటీవలే రాజధాని భవనాలు, హైకోర్టు బేస్‌మెంట్ కాంక్రీట్, ఇతర భవనాల కాంక్రీట్ దృఢంగా ఉందని, ఉక్కు కూడా మంచిగా ఉందని నివేదిక ఇవ్వటంతో.. ఈ పనుల కొనసాగింపునకు కూడా కన్సల్‌టెంట్ల కోసం టెండర్లు పిలిచారు. శాశ్వత రాజధాని పనులను రూ.8 వేల కోట్ల వ్యయంతో చేపట్టే పరిస్థితి ఉంది. ఇప్పటికే సీఆర్‌డీఏ ప్రధాన పరిపాలన భవనం, హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులకు రూ.2000 కోట్ల మేర టెండర్లు పిలిచారు. అమరావతికి గ్రాండ్ ఎంట్రన్స్ రోడ్డు అయిన సీడ్ యాక్సెస్ రోడ్డు రెండవ దశ పనులను ప్రారంభించేందుకు సీఆర్‌డీఏ ఇప్పటికే సిద్ధమైంది. రెండో దశ పనులకు ఆటంకంగా ఉన్న మొత్తం 11 కోర్టు కేసులను పరిష్కరించుకునేందుకు సీఆర్‌డీఏ తీవ్రంగా కృషి చేస్తోంది. సీడ్ యాక్సెస్ రోడ్డు ఉండవల్లి నుంచి మణిపాల్ హాస్పిటల్ పక్కగా ఎన్‌హెచ్-16కు కలుస్తుంది. ప్రస్తుత కనకదుర్గవారధి దిగువ నుంచి అమరావతికి గ్రాండ్ ఎంట్రన్స్ రోడ్డు కనెక్ట్ అవుతుంది. ఇదే ఎన్‌హెచ్ - 16 కు అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా అభివృద్ధి చేపట్టిన మరో నాలుగు రోడ్లను కూడా కలపాలని నిర్ణయించారు. వీటికి పెద్దగా భూ సేకరణ అవసరం లేదు. ఇటీవల వరదల కారణంగా విజయవాడ నగరం ముంపునకు గురి కావటంతో .. భవిష్యత్తులో అమరావతికి వరద ప్రమాదం లేకుండా మెగా ఇరిగేషన్ ప్రాజెక్టులకు కూడా అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) నేతృత్వంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. అమరావతిలో కొండవీడువాగు, గ్రావిటీ కెనాల్, పాలవాగులను విస్తరించేందుకు డిజైన్స్ సిద్ధం చేశారు. వీటితో పాటు ఆరు చోట్ల రిజర్వాయర్లు ఏర్పాటు చేయటం, మరో మూడు చోట్ల పంపింగ్ స్టేషన్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల విలువ దాదాపు రూ.3 వేల కోట్లకు పైగా ఉండవచ్చని చెబుతున్నారు.

ఈ నైరుతి అసాధారణం

అతిభారీవర్షాలు కురిసే రోజులు పెరుగుతున్నాయ్

- వాతావరణ, సముద్ర అధ్యయన నిపుణులు

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ముగిసిన నైరుతి రుతుపవనాల సీజన్‌లో అనేక అసాధారణ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ ఏడాది నాలుగు నెలల సీజన్‌లో 108 శాతం వర్షపాతం నమోదైంది. సీజన్‌లో భారీ నుంచి అతి భారీవర్షాలు (24 గంటల వ్యవధిలో 11.5 నుంచి 20.45 సెం.మీ.) కురిసిన సందర్భాలు 2,632, అత్యంత భారీవర్షాలు, కుంభవృష్టి (20.45 సెం.మీ. కంటే ఎక్కువ) కురిసిన సందర్భాలు 473 వరకూ ఉన్నాయి. గత ఐదేళ్లతో పోల్చితే ఈ సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. 2020లో భారీ నుంచి అతిభారీవర్షాలు 1,912 మార్లు కురవగా, 341 సార్లు కుంభవృష్టి కురిసింది. భారీ నుంచి అతిభారీవర్షాలు ఎక్కువగా జూలై, ఆగస్టు నెలల్లో కురుస్తున్నాయి. గడచిన ఐదేళ్లుగా పరిశీలిస్తే పశ్చిమ తీరం, ఈశాన్య, తూర్పు, ఉత్తర భారతంలో వర్షాల తీవ్రత పెరుగుతున్నట్టు వాతావరణ శాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది కేరళ నుంచి గుజరాత్ వరకు పశ్చిమ తీరం, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఒడిశా, బిహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయ వంటి చోట్ల వర్ష బీభత్సం కనిపించింది. ఇందుకు వాతావరణంలో మార్పు ఒక్కటే కారణమని చెప్పలేమని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ, సముద్ర అధ్యయన విభాగాధిపతి ఆచార్య సునీత అన్నారు. సాధారణంగా పశ్చిమ కనుములు, ఈశాన్య భారతంలో కుంభవృష్టి వర్షాలకు అక్కడి స్థానిక పరిస్థితులు కూడా ఒక కారణమని పేర్కొన్నారు. అరేబియా సముద్రం కొన్ని సంవత్సరాలుగా వేడెక్కడంతో పశ్చిమ తీరంలో వర్ష బీభత్సం తీవ్రత పెరుగుతోంది. ఈ ఏడాది ఆగస్టులోనే అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉండడం, స్థానికంగా ఉండే పరిస్థితులు తోడు కావడంతో వయనాడ్‌లో ఊహించని విపత్తు వచ్చింది. వరదలు, కుంభవృష్టి వర్షాలకు పట్టణీకరణ, భారీఎత్తున నిర్మాణాలు, పరిశ్రమలు, వాహన కాలుష్యం పెరగడం వంటివి కారణాలుగా చెప్పవచ్చునని ఆచార్య సునీత తెలిపారు. అయితే వర్షాల తీవ్రత పెరగడంపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు

అప్పట్లో పగటి పూట నడిచే తొలి ఎక్స్‌ప్రెస్ రైలు

మొదట్లో విజయవాడకే... అనంతరం తిరుపతి వరకు పొడిగింపు



చిలకలగూడ, అక్టోబరు2 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మగాంధీ పుట్టిన అక్టోబరు 2వ తేదీకి దక్షిణమధ్య రైల్వేకి విడదీయరాని అనుబంధం ఉంది. ఈ జోన్ పరిధిలో ఎన్నో కార్యక్రమాలు ఇదే రోజున ప్రారంభమయ్యాయి. అంతేందుకు దక్షిణమధ్య రైల్వే ప్రారంభమైందే 1966, అక్టోబరు 2వ తేదీన! అంతేగాక తెలుగువారికి సుపరిచితమైన కృష్ణా ఎక్స్‌ప్రెస్ కూడా యాభై ఏళ్ల క్రితం ఇదే తేదీన మొదలైంది. అక్టోబరు 2, 1974లో సికింద్రాబాద్ నుంచి విజయవాడకి డీజిల్ ఇంజిన్‌తో లాంఛనంగా దీన్ని ఆరంభించారు. ఇరు ప్రాంతాల మధ్య సుప్రసిద్ధమైన కృష్ణా నది ఉండటం వల్లే దానికి 'కృష్ణా ఎక్స్‌ప్రెస్' అనే పేరును పెట్టారు. అయితే అప్పట్లో పగటిపూట నడిచే మొట్టమొదటి ఎక్స్‌ప్రెస్ రైలు ఇదే కావడం విశేషం. మొదట్లో సికింద్రాబాద్ నుంచి విజయవాడ వరకు మాత్రమే నడిచేది. తరువాత గుంటూరు వరకు పొడిగించారు. ప్రస్తుతం ఆదిలాబాద్ నుంచి తిరుపతి మధ్య సేవలు కొనసాగుతున్నాయి. 1980 ప్రాంతంలో ఒంగోలు, నెల్లూరు వెళ్లడానికి విజయవాడలో రైలు మారి వెళ్లవలసి వచ్చేది, అనంతరం తక్కువ ఖర్చుతో తిరుపతి వెళ్లే అవకాశం ఏర్పడింది. దాదాపు ప్రయాణం మొత్తం పగటి పూట కావడంతో ప్రయాణికుల ఆదరణ పొందింది. బుధవారం యాభై ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పలువురు తెలుగువారు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 3 అక్టోబరు 2024
diksuchi@andhrajyothy.com

ఓయూలో ఈవెనింగ్ ఎంబీఏ

ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్-ఎంబీఏ ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంబీఏ(టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వీటిని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తోంది. టీజీ ఐసెట్ 2024 అర్హత పొందిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. వీరికి కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. టీజీ ఐసెట్ 2024 రాయని అభ్యర్థులు, రాసినప్పటికీ అర్హత పొందని వారు వర్సిటీ నిర్వహించే ఓయూ ఎంబీఏ సెట్ 2024 రాయాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎగ్జిక్యూటివ్/మేనేజీరియల్/అడ్మినిస్ట్రేటివ్/ఇంజనీరింగ్/డిఫెన్స్ విభాగాల్లో కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. అభ్యర్థులు తాము పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 19
- **ఓయూ ఎంబీఏ సెట్ 2024 తేదీ:** అక్టోబరు 27
- **వెబ్‌సైట్:** http://ouadmissions.com/

ఓయూ ఎంబీఏ సెట్ 2024 వివరాలు

ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి పార్ట్‌లో బిజినెస్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్‌లో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 30 ప్రశ్నలు; రెండో సెక్షన్‌లో జనరల్ ఇంగ్లీష్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్‌తో గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

పెట్రోలియం అండ్ ఎనర్జీలో పీహెచ్‌డీ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- పీహెచ్‌డీ 2024-25 స్ప్రింగ్ సెమిస్టర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెగ్యులర్, ప్రాజెక్ట్, స్పాన్సర్డ్, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఇండివిడ్యువల్ ఫెలోషిప్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయవచ్చు. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్సు వర్క్, పబ్లికేషన్ ఆఫ్ రిసెర్చ్ వర్క్, సెమినార్‌లు, కాంప్రహెన్సివ్ ఎగ్జామినేషన్, వైవా, అవార్డ్ ఆఫ్ పేటెంట్స్ ఉంటాయి. అకడమిక్ మెరిట్, ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

విభాగాలు

బయోసైన్స్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎర్త్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్.

అర్హత

సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ/డ్యూయెల్ డిగ్రీ/ బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ఎన్‌బీహెచ్‌ఎం/నెట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. లేని పక్షంలో ఏఐసీటీఈ/యూజీసీ గుర్తింపు పొందిన డిగ్రీ కళాశాలల్లో కనీసం మూడేళ్ల బోధన అనుభవం ఉండాలి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్, కోల్, ఎర్త్ సైన్సెస్, కెమికల్ అండ్ ఫర్టిలైజర్, డిఫెన్స్ సంస్థలు; పీఎస్‌యూలు, ఆర్ అండ్ డీ సంస్థలు, నేషనల్ ల్యాబొరేటరీలు, సంస్థ గుర్తింపు పొందిన ఇండస్ట్రీలలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. వీరు స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. ఇండివిడ్యువల్ ఫెలోషిప్ కేటగిరీ కింద ప్రవేశం పొందాలంటే సీఎస్ఐఆర్/యూజీసీ/ డీబీటీ/ఐసీపీఆర్/ఇన్‌స్పయిర్ నుంచి వ్యాలిడ్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) అర్హత ఉండాలి. ఐఐటీలు, ఐఐఎస్సీ, ఐఐపీఈ, ఆర్‌జీఐపీటీ సంస్థలనుంచి కనీసం 8 సీజీపీఏతో బీటెక్/ డ్యూయెల్ డిగ్రీ-బీటెక్ అండ్ ఎంటెక్/ అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/జామ్ స్కోర్‌తో రెండేళ్ల ఎమ్మెస్సీ పూర్తిచేసినవారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు.

రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్

అభ్యర్థులకు సంస్థ గరిష్ఠంగా అయిదేళ్లపాటు రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ అందిస్తుంది. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000 చెల్లిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.30,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 15
- **ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** నవంబరు 26 నుంచి 29 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 6న
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in



జయశంకర్ వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. విదేశాల్లో నివశిస్తున్న ఎన్ఆర్ఐ అభ్యర్థులు, ఎన్ఆర్ఐలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్(ఇంటర్/పన్నెండోతరగతి మార్కులు) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు రూ.9,53,450లకు డీడీ, రూ.46,550ల నగదుతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. వీరికి ఫీ రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ రాయితీలు లభించవు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.



- **బీటెక్ స్పెషలైజేషన్‌లు:** ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్

బైపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ 10 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

ఎంపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు

సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) 3 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- బైపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు(ఇండియన్/విదేశీ బోర్డు) నుంచి బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే ఏదేని ఇండియన్/విదేశీ బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 1
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఆన్‌లైన్ వీకెండ్ ప్రోగ్రామ్‌లు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు నెలలు. ప్రోగ్రామ్‌నకు 150 గంటల సెషన్స్ నిర్దేశించారు. వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ స్టడీస్, రియల్ వరల్డ్ సినారియోలు, క్విజ్‌లు, ఇండివిడ్యువల్/గ్రూప్ అసైన్‌మెంట్స్, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ అండ్ ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసి ఫైనల్ ఎగ్జామ్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్‌లు ఉపకరంగా ఉంటాయి.

- **ఒక్కో ప్రోగ్రామ్ ఫీజు:** రూ.75,000+18 శాతం జీఎస్‌టీ
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

గ్లోబల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అండ్ పోర్ట్ ఆపరేషన్స్

- ఇందులో ఎనిమిది మాడ్యూల్స్ ఉంటాయి. గ్లోబల్ ట్రేడ్ ప్రాక్టీసెస్, సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, పోర్ట్ ఆపరేషన్స్, లాజిస్టిక్స్ ఆప్టిమైజేషన్ అంశాలను బోధిస్తారు.
- **మాడ్యూల్స్:** ఇండియాస్ ఫారిన్ ట్రేడ్, గ్లోబల్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్, ఎయిర్ లాజిస్టిక్స్, ఓషన్ ట్రాన్స్‌పోర్టేషన్, కస్టమ్స్ రెగ్యులేషన్స్ అండ్ ప్రొసీజర్స్, ఇండియాస్ పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఆపరేషన్స్, సెమినార్ కోర్స్ ఆన్ ట్రేడ్ ఇష్యూస్
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15



ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్

- ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. గ్లోబల్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్, గ్లోబల్ అండ్ ఇంటర్నేషనల్ మార్కెటింగ్, ఫారిన్ ట్రేడ్ పాలసీ, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ ట్రాన్సాక్షన్స్, డాక్యుమెంటేషన్ ప్రొసీజర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు కోర్సు మెటీరియల్‌తోపాటు ఐఐఎఫ్‌టీ లెర్నింగ్ వెబ్ పోర్టల్‌లో లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు.
- **మాడ్యూల్స్:** ఇంటర్నేషనల్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ డాక్యుమెంటేషన్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ అండ్ కస్టమ్స్ రెగ్యులేషన్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్, ఎక్జిమ్ ఫైనాన్స్
- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 15

జాబ్ కార్నర్

హెచ్ఏఎల్‌లో ఖాళీలు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)కు చెందిన రోటరీ వింగ్ అకాడమీ(ఆర్‌డబ్ల్యూఏ)..హెలికాప్టర్ డివిజన్, బెంగళూరు...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 4

1. **ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్: 2**
2. **టెక్నికల్ ట్రేడ్స్‌మన్: 1**
3. **అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్: 1**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ/ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 65 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు రూ.ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ పోస్టులకు రూ.1,64,560; అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులకు రూ.82,280; టెక్నికల్ ట్రేడ్స్‌మన్‌కు రూ.43,054.

దరఖాస్తు ఫీజు: ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులకు రూ.500; టెక్నికల్ ట్రేడ్స్‌మన్ పోస్టులకు రూ.200.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ద డిప్యూటీ జనరల్ మేనేజర్(హెచ్ఆర్), హెలికాప్టర్ డివిజన్, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, పోస్ట్ బాక్స్ నెంబర్-1790, విమనపుర పోస్ట్, బెంగళూరు చిరునామాకు పంపించాలి.

చివరి తేదీ: అక్టోబరు 12

వెబ్‌సైట్:https://halindia.co.in/home



సీ-మెట్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్‌లు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ(సి-మెట్)...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 3

పోస్టు: ప్రాజెక్ట్ అసిస్టెంట్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా(మెటలర్జీ/కెమికల్/మెకానికల్), బీఎస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు రూ.26,300

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఎంపిక ప్రక్రియ: ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీ: అక్టోబరు 16

వేదిక: సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ(సీ-మెట్), ఐడీఏ ఫేజ్-3, చర్లపల్లి, హెచ్‌సీఎల్, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://cmet.gov.in/jobs

ఎంటీపీఎఫ్‌లో టెక్నీషియన్లు

ఆర్మర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్)కు చెందిన మహారాష్ట్ర థానే జిల్లా అంబర్‌నాథ్‌లోని మెషిన్ టూల్ ప్రొటోటైప్ ఫ్యాక్టరీ... ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న 81 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ మేనేజర్: **26 పోస్టులు**
2. డిప్లొమా టెక్నీషియన్: **34 పోస్టులు**
3. అసిస్టెంట్: **2 పోస్టులు**
4. జూనియర్ టెక్నీషియన్: **19 పోస్టులు**

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, మార్కెటింగ్ అండ్ ఎక్స్‌పోర్ట్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్, సీఎన్‌సీ ఆపరేటర్, టూల్ డిజైన్, గ్రైండర్, ఎలక్ట్రీషియన్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్‌దరఖాస్తుకు చివరితేదీ: అక్టోబరు 11.

వెబ్‌సైట్: https://avnl.co.in/

లిటిల్స్

తెలివి తక్కువ తోడేలు

ఒక పావురం మరియు కోడిపుంజు అనుకోకుండా అడవిలో కలుసుకుని, మంచి స్నేహితులయ్యాయి.రోజూ అవి కాసేపు కలుసుకుని, కబుర్లు చెప్పుకునేవి. ఒక రోజు ఆ రెండూ అలాగే కలుసుకుని పావురం చెట్టు మీద వాలి, కోడిపుంజు నేలమీద గింజలు వెతుక్కుంటూ ఉండగా, బాగా ఆకలి మీద ఉన్న ఓ తోడేలు అటుగా వచ్చి, మేత కోసం తిరుగుతున్న కోడిపుంజును చూసింది.

చూడగానే మనసులో ఇలా అనుకుంది, 'ఈ కోడిపుంజు చక్కగా కొవ్వు పట్టి ఉన్నది. దీన్ని కానీ ఇంటికి పట్టుకెళ్లగలిగితే నాకు ఇవాళ విందు భోజనమే' అనుకుని, అదను చూసి, చాటునుండి కోడిపుంజు మీద దాడి చేసింది. దాన్ని అలాగే పట్టుకుని తన దగ్గరున్న సంచీలో వేసుకుంది. కోడిపుంజు చాలా భయపడిపోయి, సంచీలోనుంచే గట్టిగా అరవసాగింది. చెట్టు పైన కొమ్మమీద కూర్చుని ఇదంతా గమనించిన పావురం తన మిత్రుడికి ఏదైనా సాయం చేయాలి అనుకుంది. అనుకున్నదే తడవుగా వెళ్లి, తోడేలు వెళ్లే దారిలో చచ్చిపోయినట్టు కదలకుండా పడుకుంది. అది చూసిన తోడేలు' అదృష్టమంటే ఇవాళ నాదే, ఒకేసారి పావురం, కోడిపుంజు ఇవాళ రెండు పూటలా విందు నాకు అనుకుంటూ పావురాన్ని సంచీలో వేయడానికి సంచీ తెరిచి పక్కన పెట్టింది, ఇదే అదనుగా సంచీలోఉన్న కోడిపుంజుమెల్లగా బయటపడి, తన స్థానంలో ఆ సంచీలో ఒక రాయిని పెట్టింది ఈ లోగా తోడేలు దగ్గరికి రావడం గమనించిన పావురం చటుక్కున లేచి, ఎగిరిపోయింది. 'అమ్మ పావురమా పిడికెడు ఉన్నావు నువ్వు నన్ను ఇంత మోసం చేస్తావా?'అనుకున్నది తోడేలు. అలా సంచీని మోసుకుంటూ ఆనందంగా ఇంటికి వెళ్లి, సంచీ తెరిచి చూసి, అందులో కోడిపుంజు కాక పెద్ద రాయి ఉండటంతో అయోమయంగా కోడిపుంజు రాయిగా ఎలా మారిందా అని ఆలోచిస్తూ, ఆ పూట విందు కాదు కదా అసలు భోజనమే పోగొట్టుకున్నందుకు ఏడ్చింది తోడేలు. ఆ రోజు సాయంత్రం మరలా పావురం కోడిపుంజు రెండూ కలిసి తోడేలు తెలివి తక్కువ తనాన్ని తలచుకుని నవ్వుకున్నాయి. సమయస్ఫూర్తితో ,ఉపాయంతో అపాయాల నుండి తప్పించుకోవచ్చు. మనమేకాక మన మిత్రులను కూడా కాపాడుకోవచ్చు.



10 తేడాలను కనిపెట్టండి





సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 425

	5		9	3			4	
3		9			1		2	
					7			
						2		3
8	4						6	5
5		7						
			6					
	6		7			1		2
	7			4	2		3	

సుడోకు - 424 సమాధానం

9	6	3	7	5	8	1	4	2
1	4	8	2	6	9	5	3	7
5	7	2	1	3	4	9	6	8
3	8	6	9	4	7	2	5	1
7	9	4	5	1	2	6	8	3
2	5	1	6	8	3	7	9	4
6	3	5	8	2	1	4	7	9
8	2	9	4	7	5	3	1	6
4	1	7	3	9	6	8	2	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.